


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సమస్యల వలయంలో గుజరాత్ రాష్ట్రం

శాంతికోసం మతాలు ఐక్యంగా వ్యవహరించాలి

చొరబాటుదారులకు 'రెడ్‌కార్పెట్' పరవాలా? 05

సంపుటి 09, సంచిక: 07 | బుధవారం | 03-12-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# 'సర్'పై చర్చకు ఓకె

**ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం**

**8న వందేమాతరంపై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ**



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చించేందుకు అధికార పక్షం అంగీకరించింది. ఈ విషయాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో మంగళవారం సమావేశమైన అనంతరం కాంగ్రెస్ నేత కె.సురేశ్ వెల్లడించారు. డిసెంబర్ 8న వందేమాతరంపై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరగనున్నట్లు తెలిపారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సర్‌పై చర్చించాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. చర్చకు ప్రభుత్వం విముఖం కాదని, కాలపరిమితిని నిర్దేశించాలనుకోవడం మాత్రం తగదని అధికారపక్షం పేర్కొంది. ఈ నేపథ్యంలో విపక్షాలు ఆందోళనకు దిగడంతో స్పీకర్ అఖిలపక్ష సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు అధికార పక్షం చర్చకు అంగీకరించింది. అయితే, ప్రత్యేకంగా సర్‌పై కాకుండా.. ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనున్నట్లు తెలుస్తోంది.

**రెండవ రోజూ పట్టువీడని ప్రతిపక్షాలు**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రెండవ రోజైన మంగళవారం కూడా వాయిదాల పర్వం కొనసాగింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై చర్చించాల్సిందేనని డిమాండ్ చేస్తూ ఉభయసభల్లోనూ ప్రతిపక్ష ఎంపిలు పట్టుబట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్‌పై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని అయితే దానికి కాలపరిమితి ఏమీ ఉండదని తరువాయి 2లో




**ప్రధానాంశాలపై చర్చించకుండా మోదీ పారిపోతున్నారు...**

- ఇండియా కూటమి నేతలు మండిపాటు
- పార్లమెంట్ వెలుపల 'సర్'కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

05



# ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తో ప్రపంచపటంలో రాష్ట్రం

- తెలంగాణ ఏర్పాటుకు, ఉద్యమ ఆలోచనకు పాల్వంచలోనే బీజం
- ప్రజాప్రభుత్వానికి ఖమ్మం జిల్లానే ఆయువుపట్టు
- దేశాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపించిన మన్మోహన్‌సింగ్ చిరస్మరణీయులు
- తెలంగాణ కలను సాకారం చేసిన మహనీయుడు
- ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి
- కొత్తగూడెంలో వర్సిటీ ఏర్పాటు అభినందనీయం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం

ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలు తెలంగాణను ప్రపంచపటంలో నిలబెడతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అరవై ఏళ్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రధాన మంత్రి హోదాలో నెరవేర్చిన మహోన్నతుడు డా.మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటుకు, ఉద్యమానికి ఆలోచనా బీజం పాల్వంచ కేంద్రంగా పడిందని, రాష్ట్ర ప్రజల కలను సాకారం చేసిన మన్మోహన్ సింగ్ పేరు భూ విజ్ఞాన విశ్వవిద్యాలయానికి పెట్టడం గర్వకారణం అన్నారు. మంగళవారం దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన భూ విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రేవంత్ మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ దేశానికి తలమానికం కానుందన్నారు. దేశాన్ని సంక్షోభం నుండి సంక్షేమం వైపు తరువాయి 12లో

# పిఎంఒ భవనం ఇక 'సేవాతీర్థ్'

**కేంద్ర ప్రభుత్వం నిర్ణయం**



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి కార్యాలయం(పిఎంఒ) భవనం పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. పిఎంఒ భవనం పేరును 'సేవాతీర్థ్'గా మారుస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో పిఎంఒను ఇక నుంచి సేవాతీర్థ్‌గా పిలవనున్నారు. ప్రధానమంత్రి దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్‌లోని పిఎంఒ నుంచి ప్రధానులు విధులు నిర్వర్తిస్తుండగా, ఆ కార్యాలయం కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే పేరు మార్పుపై ప్రకటన వచ్చింది. సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. ఇంతకుముందు ఈ భవనాలను తరువాయి 2లో

# 'లోక్ భవన్'గా 'రాజ్‌భవన్'

**పేరు మారుస్తూ ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ**

ప్రజాపక్షం/హైదరాబాద్




తెలంగాణ గవర్నర్ అధికారిక నివాసం 'రాజ్ భవన్'ను 'లోక్ భవన్'గా మార్చారు. అన్ని 'రాజ్ భవన్'లను 'లోక్ భవన్'లుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు 'రాజ్ భవన్, తెలంగాణ'గా ఉన్న పేరును ఇకపై 'లోక్ భవన్, తెలంగాణ' అని పిలువనున్నట్లు తెలంగాణ లోక్ భవన్ తెలియజేసింది. వికసిత్ భారత్ వైపు విశ్వాసంతో ముందుకు వెళుతున్న నేపథ్యంలో దేశ ప్రజాస్వామ్య విలువల బలం, తరువాయి 2లో




# 'సంచార్‌సాథీ' యాప్‌పై తీవ్ర దుమారం

**తప్పనిసరేం కాదు : కేంద్రం**

**న్యూఢిల్లీ :** ఇకనుంచి దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను ప్రీఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై మంగళవారంనాడు పార్లమెంటు దద్దరిల్లింది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగమని, దీనిపై విస్తృత చర్చ జరపాలంటూ విపక్ష కాంగ్రెస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో 'సంచార్ సాథీ' యాప్‌పై కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వివరణ ఇచ్చారు. వినియోగదారులు అక్కర్లేదనుకుంటే తమ స్మార్ట్ ఫోన్ల నుంచి యాప్‌ను డిలీట్ చేయవచ్చని చెప్పారు. ఇది ఐచ్ఛికమని అన్నారు. ప్రతి ఒక్కరి కోసం ఈ యాప్‌ను ప్రవేశపెట్టడం తన డ్యూటీ తరువాయి 12లో

**తెలంగాణ 'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'కు**

# సమగ్ర కార్యాచరణ



- రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్‌కు ప్రణాళికలు
- రూ.850 కోట్లతో మహేశ్వరంలో 'జెఎస్ డబ్ల్యూ యుఎవి ఫెసిలిటీ'
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను 'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ అన్ మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్, డిఫెన్స్ ఇన్నోవేషన్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చేలా 'ఎకోసిస్టం'ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. మంగళవారం తరువాయి 2లో

# గ్లోబల్ సమ్మిట్‌కు సిఎంలకు ఆహ్వానం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం
- ప్రధానిని ఆహ్వానించనున్న సిఎం, డిప్యూటీ సిఎం భట్టి
- 4న వివిధ రాష్ట్రాల సిఎంలను ఆహ్వానించనున్న మంత్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్




హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ –2025'కు ప్రధానమంత్రి మోదీ సహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్ళారు. సిఎం, డిప్యూటీ సిఎం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీని కలిసి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' కు రావాలని ఆహ్వానించనున్నారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రులనూ సదస్సుకు ఆహ్వానించనున్నారు. కాగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను తరువాయి 2లో




# గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటింటికీ తీసుకువెళ్లాలి
- ప్రతీ ఆడబిడ్డకూ చీర చేరేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదే
- డిసిసి అధ్యక్షులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకు వెళ్లాలని తద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికలో విజయ ఢంకా మోగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసిసి అధ్యక్షులకు దిశా నిర్ధేశనం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో గాంధీ టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నూతన డిసిసి అధ్యక్షులు, పూర్వ డిసిసి అధ్యక్షుల సమావేశంతో పాటు టిపిసిసి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్ , సచిన్ సావంత్ పాల్గొంటారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కోటి మంది ఆడబిడ్డలకు ప్రభుత్వం సారెగా అందిస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, తరువాయి 2లో

**తెలంగాణ ప్రజలకు**

# పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

**లేదంటే సినిమాలు నడువవు..**

**హెచ్చరించిన మంత్రి కోమటిరెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో అతని సినిమాలు నడపబోనీయమని సినిమాటో గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ ప్రజల దిష్టి వల్లనే కోనసీమలో కొబ్బరిచెట్లు ఎండిపోయాయని ఓ సభలో పవన్ కళ్యాణ్ వ్యంగంగా అభివర్ణించారు. పవన్ వ్యాఖ్యలను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి ఎపిలో తెలంగాణ ప్రజలు 60 ఏళ్లు బాధపడ్డామన్నారు. తాము ఫ్లోరైడ్ నీళ్లు తాగామని, నిధులు, నీళ్లు ఉద్యోగాలు మాత్రం మీరే తరువాయి 12లో

# రెండు దశల్లో జనగణన

- ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య మొదటి దశ
- 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన
- లోక్‌సభలో ప్రభుత్వ వెల్లడి




**న్యూఢిల్లీ :** దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్ సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోమ్ వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇస్తూ, జన గణన గురించి తెలిపారు. జన గణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెన్స్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. 'జన గణన 2027 తరువాయి 12లో

# ఒకవైపు చర్చలు... మరోవైపు యుద్ధం

**పోక్రోవ్స్క రష్యా స్వాధీనం : ఖండించిన ఉక్రేన్**



**మాస్కో:** ఒకవైపు శాంతి చర్చలు ముమ్మర దశకు చేరుకున్న తరుణంలో ఉక్రేన్ తూర్పుప్రాంత నగరం పోక్రోవ్స్కలో తీవ్ర యుద్ధం జరుగుతోంది. ఈ నగరాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని రష్యా దళాలు ప్రకటించాయి. కానీ ఉక్రేన్ దానిని ఖండించింది. ఐతే పోక్రోవ్స్క నగరంపై రష్యా దళాల ఆధిపత్యం కొనసాగుతోందని అంతర్జాతీయ మీడియా వార్తలు ప్రచురించాయి. మరో నగరాన్ని కూడా రష్యా స్వాధీనం చేసుకునే దిశగా వెళుతోంది. ఇదేసమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్,ట్రంప్ అల్లుడు కుష్నెర్ మాస్కో చేరుకుని అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల్లో నిమగ్నమయ్యారు. ఒకవైపు దౌత్య చర్చలు జరుగుతున్నాగానీ యుద్ధం ఆపడంలేదని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫ్రాన్స్‌లో పర్యటించి అధ్యక్షుడు మేక్రాన్‌తో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## హాంగ్‌కాంగ్ ప్రమాదంపై స్వతంత్ర విచారణ

**విక్టోరియా :** హాంగ్‌కాంగ్ థాయ్ పో జిల్లాలో నవంబరు 26వ తేదీన ఈ ఏడాది అతిపెద్ద అగ్నిప్రమాద ఘటనపై అక్కడి ప్రభుత్వం స్వతంత్ర దర్యాప్తు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసింది. అన్ని వర్గాల ప్రజల నుండి ఈ ప్రమాద ఘటనపై తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వ్యక్తం అవుతూ ఉండటంతో ఆ ఒత్తిడిని భరించలేక ప్రభుత్వం దిగి వచ్చింది. స్వతంత్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రమాదంపై హాంగ్‌కాంగ్‌లోని యువతరం అనేక అనుమానాలు వ్యక్తం చేస్తోంది. దాదాపు ఎనిమిది ఆకాశహర్మ్యాలు దగ్ధమై పోయినప్పటికీ అక్కడున్న పోలీస్ స్టేషన్ మాత్రం చెక్కుచెదరకుండా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోందని యువకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.
గడచిన అనేక దశాబ్దాల చరిత్రలో హాంకాంగ్‌లో ఇంతటి ఘోరమైన విలయం సంభవించలేదు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ ఆందోళన కలిగించింది. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## భయపడి శాంతికోసం బానిసత్వం చేసేదిలేదు

### ట్రంప్ సైనిక సన్నాహాలపై మదురో హెచ్చరిక



**కారకాస్ :** వెనిజులాపై తదుపరి చర్యలకు భద్రతాధికారులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకవైపు సమావేశమైన తరుణంలో, తమ దేశంపై సైనిక చర్య జరిగే అవకాశాలు ఉన్నాయని దేశాధ్యక్షుడు నికొలస్ మదురో అంచనావేస్తున్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితులమధ్య నికొలస్ మదురో ఎంతో నిగ్రహంతో గుండెధైర్యంతో వ్యవహరిస్తూ రాజధాని కారకాస్ నగరంలో మిరాఫ్లోర్స్ ప్యాలస్ వెలుపల వేలాదిమందితో కూడిన భారీ శాంతి ర్యాలీ ముందు నిలబడి ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నైతికస్థైర్యాన్ని కోల్పోయేది లేదని, సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలను ప్రతిఘటిస్తామని మదురో ప్రకటించారు. యుద్ధం, సైనిక చర్యలకు భయపడి శాంతి కోసం ఎట్టిపరిస్థితుల్లోనూ బానిసత్వం చేసేదిలేదని, "బానిసత్వశాంతి" తమకు అవసరం లేదని డోనాల్డ్ ట్రంప్‌కు మదురో హెచ్చరిక చేశారు. శాంతికోసం ఆయన పదే పదే పిలుపు ఇచ్చారు. ప్రజా పాలకుడుగా విధేయంగా ఉంటానని, దేశాన్ని సమష్టిగా రక్షించుకుందామని మదురో ప్రజలకు పిలుపు ఇచ్చారు. వెనిజులా శాంతిని కోరుకుంటున్నదనీ, కానీ బానిసత్వంతో కూడిన శాంతిని కోరుకోవడంలేదని, సార్వభౌమాధికారం, పరస్పర గౌరవం, సమానత్వం, స్వేచ్ఛతో కూడిన శాంతిని మాత్రమే తమ దేశం కోరుకుంటున్నదని స్పష్టం చేశారు. "మనకు బానిసత్వ శాంతి అవసరం లేదు, వలసదేశ శాంతి అవసరం లేదు, బానిసలు ఎప్పుడు? వలసదేశాలు ఎప్పటిమాట? వలసదేశాలు వద్దు, బానిసత్వశాంతి వద్దు" అని మదురో నినాదాలు చేశారు. గడచిన 22 వారాలుగా కరీబియన్ జలాల్లో ట్రంప్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. డ్రగ్స్ మాఫియా ముఠాలను పెంచిపోషిస్తున్నారంటూ లాటిన్ అమెరికా దేశాలకు బెదిరింపులు ప్రారంభించారు. కరీబియన్ జలాల్లో అత్యంత శక్తిమంతమైన విమాన వాహక యుద్ధ నౌకలను, 15,000 మంది సైన్యాలను ట్రంప్ మోహరించి రేపో మాపో వెనిజులాపై యుద్ధం ప్రకటిస్తామన్న వాతావరణం తెచ్చారు. ఈ పరిస్థితుల్లో వైట్‌హౌస్‌లో భద్రతాధికారులతో ట్రంప్ ఈ విషయంపై చర్చలు జరుపుతున్నారు. మదురోను గద్దె దించుతామని, ఆయనను వెనిజులా నుండి వెళ్ళగొడతామని ట్రంప్ బాహాటంగా ప్రకటనలు చేశారు. మాదకద్రవ్యాల పడవల పేరుతో కరీబియన్ జలాల్లో ఇప్పటివరకూ 22 పడవలపై అమెరికా రక్షణ దళం దాడులు చేసింది. 80 మందిని హతమార్చింది.
ఈ విషయం చివరకు వివాదాస్పదంగా మారింది. అమెరికా చట్టసభ సభ్యులు ఈ దాడులలో రెండు దాడులను యుద్ధ నేరంగా పరిగణించి ట్రంప్ సమాధానం చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ సైనిక చర్యను మాదకద్రవ్యాల వ్యాపారులు, ముఠాల అణచివేత, వ్యతిరేక ప్రచారంగా ట్రంప్ చెబుతుండగా, కమ్యూనిస్టు నేత నికొలస్ మదురోను పదవీచ్యుతుణ్ణి చేసేందుకే ట్రంప్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని వెనిజులా ప్రభుత్వం విమర్శిస్తున్నది.

## సజీవంగానే ఇమ్రాన్ ఖాన్..కానీ మానసిక చిత్రహింస

### అడియాలా జైలు వద్ద భారీ బందోబస్తు
### తెహ్రీక్ ఇన్సాఫ్ దేశవ్యాప్త ఆందోళన : నిషేధాజ్ఞలు



**రావల్పిండి :** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ (73) జైలులో సజీవంగానే ఉన్నారని, కానీ మానసిక చిత్రహింసకు గురవుతున్నారని ఆయన సోదరి డాక్టర్ ఉజ్మాఖాన్ చెప్పారు. తన సోదరుడు చూడటానికి ఆరోగ్యంగానే కనిపిస్తున్నారని చెప్పారు. గడచిన 45 రోజులుగా ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకునేందుకు నిరాకరించిన రావల్పిండి జైలు అధికారులు ఎట్టకేలకు అనుమతి ఇచ్చారు. పదులసంఖ్యలో ఉన్న పిటిఐ పార్టీ కార్యకర్తలను వెంటబెట్టుకుని డాక్టర్ ఉజ్మాఖాన్ అడియాలా జైలులోకి ప్రవేశించి ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకున్నారని ఆయన పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇమ్రాన్‌ఖాన్ జైలులో 2023 ఆగస్టు నెల నుండి ఒంటరిగా నిర్బంధంలో ఉన్నారు. ఆయనను ఎవరూ కలుసుకోనీయకుండా అధికారులు అప్రకటిత ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలకు కారణం ఏమిటో కూడా చెప్పలేదు. చివరకు కుటుంబసభ్యులను కూడా అనుమతించకపోవడంతో జైలులోనే ఆయన మరణించారని సోషల్ మీడియాలో, పత్రికల్లో వదంతులు ప్రారంభమయ్యాయి. దీంతో పిటిఐ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చారు. మంగళవారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి. ఇస్లామాబాద్ హైకోర్టు వెలుపల కూడా న్యాయవాదులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిపారు. జైలు అధికారులు నెలరోజులుగా ఆయన్ను కలుసుకునేందుకు అనుమతి నిరాకరించడంవల్ల ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక చివరకు చేసేది లేక ఇమ్రాన్‌ఖాన్ సోదరీమణికి అనుమతి ఇస్తూ జైలు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అడియాలా జైలు సిబ్బంది జైలుప్రాంగణం ఉన్న ప్రాంతంలో 144 నిషేధాజ్ఞలు అమలు చేశారు. పార్టీ కార్యకర్తలను రానీయకుండా అడ్డుకున్నారు. పంజాబ్ ప్రభుత్వం యావత్ పోలీసు యంత్రాంగాన్ని భద్రత నిమిత్తం రావల్పిండికి తరలించింది. మొత్తం ఎనిమిది కి.మీ మేరకు రహదారిలో ఎవ్వరినీ అనుమతించకుండా రాకపోకలను స్తంభింపజేశారు. కాగా, పాకిస్థాన్ హోంమంత్రి తల్లాల్ చౌధురి ఒక ప్రకటన చేస్తూ ఇస్లామాబాద్, రావల్పిండిలలో 144 నిషేధాజ్ఞలు మూడు రోజులపాటు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. పిటిఐ నాయకులు, చట్టసభ్యులు చట్టానికి, న్యాయానికి కట్టుబడి ఉండాలని కోరారు.

**డెత్‌సెల్‌లో ఇమ్రాన్‌ఖాన్ నిర్బంధం?**

తమ తండ్రిని 'డెత్‌సెల్'లో ఒంటరిగా నిర్బంధించి చిత్రహింసకు గురిచేస్తున్నారని వస్తున్న వార్తలు తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఇమ్రాన్ ఖాన్ కుమారులు ఖాసిం, సులేమాన్ మీడియాకు చెప్పారు. ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు అనుమతించకపోతే దేశవ్యాప్త ఆందోళన చేస్తామని అధికారుల అనుమతికి ముందు వారు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా పార్టీ నిరసన ఉద్యమం చేపట్టిన నేపథ్యంలో వారు మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వం ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకోవడానికి ఒక సోదరికి అనుమతి ఇచ్చామని జైలు అధికారులు చెప్పారు. దీనికి ముందు ఖాసిం, సులేమాన్ మాట్లాడుతూ, నెలన్నర రోజులుగా తమ తండ్రి ఆచూకీ చెప్పకుండా మానసికంగా తమ కుటుంబాన్ని ప్రభుత్వం చిత్రహింసలు చేస్తోందని విమర్శించారు.

## నెతన్యాహూ పదవీ విరమణకు ప్రతిపక్షాల డిమాండ్



**టెల్‌అవీవ్ :** పరిపాలనలో అవినీతి, మోసాలకు పాల్పడ్డారని స్వదేశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రతిపక్షాల డిమాండ్ల మధ్య మంగళవారం కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. రెండు రోజులక్రితం నెతన్యాహూ ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ కు క్షమాభిక్ష ప్రసాదించమంటూ లేఖ రాసిన తర్వాత మొదటిసారి ఆయన కోర్టుకు హాజరయ్యారు. దీనిపై దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రధానమంత్రి దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని మరికొన్నిపార్టీల నాయకులు కోరారు. ఇజ్రాయెల్‌లో సార్వత్రిక ఎన్నికలకు నిర్ణీత ప్రకారం 2026 అక్టోబరు వరకు గడువు ఉంది. రాజకీయాల నుండి ఉపసంహరించుకోవడానికి నెతన్యాహూ అంగీకరిస్తే ఆయన క్షమాభిక్షకు, విచారణ లేకుండా చేసేందుకు అంగీకరించాలని మాజీ ప్రధానమంత్రి నఫ్తాలీ బెన్నెత్ అన్నారు. 2021లో నెతన్యాహూను పదవీచ్యుతుణ్ణి చేసిన కూటమి నాయకుడు బెన్నెత్. నెతన్యాహూ అవినీతిపై 2020లో విచారణ ప్రారంభమైంది. కానీ ఆయన ఇప్పటివరకూ తన తప్పులను అంగీకరించలేదు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రిగా మూడు విడతలుగా 19 సంవత్సరాలు పాలిస్తున్న సుదీర్ఘ రాజకీయ చరిత్రగల నాయకుడు నెతన్యాహూ. 2021లో నెతన్యాహూ పదవీచ్యుతుడయ్యారు. తిరిగి 2022 ఎన్నికల్లో పదవిని చేజిక్కించుకున్నారు. ఆయన అవినీతిపై ప్రతిపక్షాలు సహా ప్రజాగ్రహం పెల్లుబికింది. ఆయన తన తప్పులను అంగీకరించాలని, పదవీ విరమణ చేస్తానని వాగ్దానం చేయాలని, ఆ షరతులపైనే క్షమాభిక్షకు అవకాశం ఇవ్వాలని కొన్ని ప్రతిపక్షాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలు అధ్యక్ష భవనం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తూ నెతన్యాహూను క్షమించవద్దని డిమాండ్ చేశారు.

## ఒకరు చేస్తే... అందరికీ ఆపాదించకండి

### వైట్‌హౌస్ ఎదుట ఆఫ్ఘనిస్థాన్ పౌరుల నిరసన

**వాషింగ్టన్ :** అమెరికా వైట్‌హౌస్ వెలుపల అమెరికాలో ఉన్న ఆఫ్ఘనిస్థాన్ జాతీయులు శాంతియుతంగా నిరసన ప్రదర్శన జరిపారు. అమెరికా సైన్యంలో పనిచేసిన లఖన్‌వాలా అనే సైనికుడు అమెరికా నేషనల్ గార్డులపై కాల్పులు జరిపితే ఈ చర్యను యావత్ ఆఫ్ఘనిస్థాన్ జాతీయులకు అంటగట్టి వారిని బహిష్కృతులుగా చూడటం న్యాయసమ్మతం కాదని వారు నినాదాలు చేశారు. ఒకరు చేసిన తప్పుకు మొత్తం ఆఫ్ఘనిస్థాన్ జాతీయులను నిందించవద్దని, వారిని దేశంలోకి అనుమతించకుండా అడ్డుకోవడం న్యాయం కాదని వారు కోరారు. కొద్దిరోజుల క్రితం జరిగిన కాల్పుల్లో ఒక మహిళా నేషనల్ గార్డు మరణించిన తర్వాత ట్రంప్ వలస విధానంలో కఠిన మార్పులు తీసుకువచ్చారు. ఆఫ్ఘనిస్థాన్ జాతీయులకు అమెరికాలో ప్రవేశం లేదని ప్రకటించారు. దేశంలో ఉన్నవారిని తనిఖీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆఫ్ఘనిస్థాన్ జాతీయులు ప్రదర్శన చేసినప్పటికీ పత్రికలు చాలా చులకనగా చూశాయి.




## విజయఢంకా మోగించాలి
(మొదటి పేజీ తరువాయి)

ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదేనన్నారు. గ్రామలవారీగా సమన్వయం చేసుకుంటూ పంపిణీ పూర్తి చేయాలని, డిసెంబర్ లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. మార్చి నెలలో పట్టణ ప్రాంతాల్లో మహిళలకు 35 లక్షల చీరలను పంపిణీ చేయాలని, తద్వారా ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, పరిపాలనపై గ్రామ గ్రామాన చర్చ జరిగేలా చూడాలన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షోభంలో రాష్ట్రాన్ని అప్పగిస్తే, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షోభం నుంచి సంక్షేమం వైపు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ నెల 7 న ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్‌కాలేజీ ముందు సభ నిర్వహించి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం ద్వారా ఉస్మానియా యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చి దిద్దుతామని చెప్పారు. ఈ నెల 8,9 న నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో చేసింది చెప్పుకోవాలని, ప్రభుత్వం చేస్తున్న పనులు, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. జిల్లా అధ్యక్షుడు అనేది గొప్ప బాధ్యత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో కాళ్లలో కట్టెలు పెట్టడం సహజమని, అది పెద్ద సమస్యగా భావించొద్దని అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు.

**ఓటు చోరీని అంశాన్ని దృష్టి మరలించేందుకే కేసులు : సిఎం రేవంత్‌రెడ్డి**

కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ ఓట్ చోరీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లుతున్న నేపథ్యంలో ఆవిషయాన్ని దృష్టి మరల్చేందుకు మనీ ల్యాండరింగ్ కేసుల పేరుతో కేంద్ర ప్రభుత్వం మళ్లీ హడావుడి చేస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేస్తున్నామన్నారు.
మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పత్రికను నడిపారని, దీన్ని మనీ ల్యాండరింగ్ కేసు పెట్టి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను వేధిస్తున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి అండగా నిలబడతామని, అవసరమైతే ఎందాకైనా పోరాడతామని సందేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి ఇవ్వదలచుకున్నామని సిఎం స్పష్టం చేశారు.

**కష్టపడి పనిచేస్తేనే పదవులు వస్తాయి : మహేశ్ కుమార్**

టిపిసిసి కార్యవర్గ సమావేశాన్ని ఉద్దేశించి టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని, కష్టపడి పని చేస్తే పదవులు అవే వస్తాయన్నారు. డిసిసి పదవి ప్రముఖమైందని స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ నిర్మాణం పై దృష్టి పెట్టాని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఓట్ చోరీ కార్యక్రమం కొంత ఆలస్యం అయ్యింది.వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనుల ఉంటాయని వాటిని విజయవంతం చేయాలన్నారు.
రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కుల సర్వే నిర్వహింమని దీంతో తప్పక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనగణన లో కుల సర్వే నిర్వహిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సాగుతున్న ప్రజాపాలనతో కెసిఆర్ శకం ముగిసిందన్నారు. వాటాల పంచాయతీ లో తేడా వల్ల కెసిఆర్ కుటుంబంలో కొట్లాటు వచ్చాయన్నారు. వారం పది రోజుల్లో కార్పొరేషన్ తో పాటు పెండింగ్ లో ఉన్న పదవుల భర్తీ వర్కింగ్ ప్రెసిడెంట్ లు భర్తీ చేసేందుకు ఆలోచనలో ఉన్నామని చెప్పారు.

## సమగ్ర కార్యాచరణ
(మొదటి పేజీ తరువాయి)

జెఎస్ డబ్ల్యూ, షీల్డ్ ఏఐ సంయుక్తంగా రూ.850 కోట్లతో మహేశ్వరంలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్(ఇఎంసి)లో ఏర్పాటు చేయనున్న 'జెఎస్ డబ్ల్యూ అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్(యుఎవి) ఫెసిలిటీ' భూమి పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... డ్రోన్లు, శాటిలైట్లు, సైబర్ సిస్టమ్స్, ఎఐ అనేవి ఇకపై భవిష్యత్తు సాంకేతికతలు కావని, అవి ఇప్పటికే ఆధునిక యుద్ధాల నిర్వహణ వ్యవస్థగా మారాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో డ్రోన్ల తయారీలో స్వయం సమృద్ధిని సాధించడం జాతీయ భద్రతకు అత్యంత అవసరమన్నారు. 2030 నాటికి దేశీయ డిఫెన్స్ యుఎవి, డ్రోన్ మార్కెట్ వాల్యూ 4.4 బిలియన్ డాలర్లు, 5 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశముందన్నారు. ఈ పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఎల్బిట్ సిస్టమ్స్, షీబెల్ లాంటి అంతర్జాతీయ డిఫెన్స్ దిగ్గజ సంస్థల తయారీ కేంద్రాలు హైదరాబాద్ లో ఉండటం 'రైజింగ్ తెలంగాణ'కు నిదర్శనమన్నారు. ఈ 16 ఎకరాల స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీలో ఏటా 300 వరకు వీటీఓఎల్ డ్రోన్లు తయారవుతాయన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఇక్కడ ఉత్పత్తి మొదలవుతుందని, ప్రొడక్షన్, రిపేర్, టెస్టింగ్... ఇలా అన్ని ఒకేచోట అందుబాటులో ఉంటాయన్నారు. కొత్తగా 300 మందికి హైవాల్యూ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ ఫౌండర్ పార్థ్ జిందాల్, ఎంఎల్‌ఏ మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'లోక్ భవన్'గా 'రాజ్‌భవన్'
(మొదటి పేజీ తరువాయి)

ఉత్సాహాన్ని పునరుద్ధాటించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్ భవన్ తెలియజేసింది. లోక్ భవన్, తెలంగాణ అనే కొత్త నామకరణం అన్ని అధికారిక దస్త్రాల్లు, సూచనలు, రికార్డుల కోసం తక్షణమే అమల్లోకి వస్తుందని లోక్‌భవన్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా రాష్ట్రాల గవర్నర్ల అధికారిక నివాసాలు 'రాజ్ భవన్', 'రాజ్ నివాస్' పేర్లను 'లోక్ భవన్', లోక్ నివాస్'లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నవంబర్ 25వ తేదీన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాసింది. అందుకు అనుగుణంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా తదితర రాష్ట్రాలు ఉత్తర్వులు జారీ చేశాయి.

## పిఎంఒ భవనం ఇక.. 'సేవాతీర్థ్'
(మొదటి పేజీ తరువాయి)

ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌గా పిలిచేవారు. అయితే పరిపాలనలో సేవా భావం ప్రాముఖ్యం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దీనికి సేవా తీర్థ్ అనే పేరు పెట్టాలని నిర్ణయించింది.
ఏఏ కార్యాలయాలు ఉండబోతున్నాయి?
కొత్తగా నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో పిఎంఒతో పాటు కేబినెట్ కార్యదర్శిత్వం, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్‌ఎస్‌సిఎస్), ఇండియా హౌస్ ముఖ్యంగా ఉండనున్నాయి. ఇందులోని ఇండియా హౌస్ ప్రత్యేకంగా విదేశీ ప్రతినిధులు, ప్రపంచ నాయకులతో ఉన్నత స్థాయి చర్చలు జరిపే కేంద్రంగా రూపొందుతోంది. దేశ విదేశాంగ వ్యవహారాల్లో ఇది కీలక పాత్ర పోషించనుంది.
సేవా తీర్థ్ వెనక ఉన్న భావం
పరిపాలన అనేది కేవలం అధికారాన్ని ప్రదర్శించే స్థలం కాదు, ప్రజలకు సేవలందించే కేంద్రం కావాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. 'సేవా తీర్థ్ అనేది సేవా భావాన్ని ప్రతిబింబించే పని ప్రదేశం. దేశ ప్రాధాన్యాలు, జాతీయ నీతులు ఇక్కడే రూపుదిద్దుకుంటాయి' అని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో ఇప్పుడు ఒక నిశ్శబ్దమైన కానీ లోతైన మార్పు జరుగుతోందని వారు పేర్కొన్నారు. అధికారం నుంచి సేవాభావం వైపు, ఆధిపత్యం నుంచి బాధ్యత వైపు మార్పు జరుగుతోందని వెల్లడించారు.

## 'సర్'పై చర్చకు ఓకె
(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. దీంతో ప్రతిపక్షాలు సర్‌పై వెంటనే చర్చ జరపాల్సిందేనని ముక్తకంఠంతో పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభలో గందరగోళ పరిస్థితులు తలెత్తగా, స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో సర్‌పై వెంటనే చర్చ జరిపేందుకు కేంద్రం అంగీకరించకపోవడంతో ప్రతిపక్ష సభ్యులు సభను వాకౌట్ చేశాయి. పార్లమెంట్ వెలుపల కూడా విపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని సర్‌పై చర్చించకు డిమాండ్ చేశాయి. కాగా, లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొడంతో స్పీకర్ సభను ముందుగా మధ్యాహ్నం 12 గంటలకు, ఆ తరువాత 2 గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య సభ మళ్ళీ సమావేశమైంది. సభకు అధ్యక్షత వహించిన దిలీప్ సైకియా, తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో కొనసాగుతున్న సర్‌పై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున సభా కార్యక్రమాలకు అనుమతివ్వాలని ప్రతిపక్షాలను కోరారు. బిహార్‌లో సర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ఎన్నికల ఫలితాలు కూడా వెల్లడయ్యాయన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025 లోక్‌సభలో పరిశీలన, ఆమోదం కోసం ఎజెండాలో పెట్టినప్పటికీ సభ అంతరాయం కారణంగా దానిని చేపట్టలేకపోయారు. ముందుగా దాదాపు 10 నిమిషాల పాటు కొనసాగిన జీరో అవర్‌లో, వివిధ పత్రాలు, స్టాండింగ్ కమిటీల నివేదికలను సభలో ఉంచారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఓటర్ల జాబితా సర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. నినాదాలు చేశారు. ఈ అంశంపై వెంటనే చర్చకు డిమాండ్ పట్టుబట్టారు. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కల్పించుకుని సభ మర్యాదను కాపాడాలని, వివిధ పార్టీల నుండి చాలా మంది సభ్యులు ఉన్నారని, వారి వాదనలు కూడా వినాలని కోరారు. కొన్ని పార్టీల సభ్యులు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం సరికాదని, ఎన్నికల్లో ఓడిపోయామనే కోపం కూడా సభలో కనిపించకూడదని మంత్రి అన్నారు. దివంగత బిజెపి నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఎన్నికల్లో ఓడిపోయారని ప్రస్తావించారు. ఇటీవలి ఎన్నికల ఓటములపై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ, వారు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారని రిజిజు అన్నారు. ప్రభుత్వం సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగుతుండగా, 10 నిమిషాల్లోనే సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు, నిరసనల కారణంగా మధ్యాహ్నం 12 గంటల వరకు సభా కార్యకలాపాలు వాయిదా పడ్డాయి.

**రాజ్యసభలోనూ ప్రతిష్టంభన**

టర్ల జాబితాపై చర్చకు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని చెప్పినప్పటికీ చర్చకు గడువు ఇవ్వడానికి నిరాకరించారు.
దీంతో విపక్షాలు ఇతర విషయాల కంటే సర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా చర్చను నిర్వహించాలని డిమాండ్ చేయగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి 'వందేమాతరం'పై చర్చను ముందుగా చేపట్టాలని సూచించారు. సర్‌పై చర్చకు ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించడంతో, ప్రతిపక్ష ఎంపిలు ఎగువ సభలో నినాదాలు చేసి, తరువాత వాకౌట్ చేశారు. సర్‌పై చర్చ కోసం ఒత్తిడి చేస్తూ, కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఆప్, ఎస్‌పి, సిపిఐ, సిపిఐ(ఎం), సభ్యులు రిజిజును కలిశారు. ఎన్నికల సంస్కరణలపై చర్చకు ప్రభుత్వం సభలో సమయం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఉదయం రాజ్యసభ వాయిదా తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైనప్పుడు, 'వందేమాతరం'పై చర్చను బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేర్చామని, 'ఎన్నికల సంస్కరణలు'పై చర్చకు ముందు దీనిని చేపడతామని రిజిజు అన్నారు. 'వందేమాతరం మన స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన విషయం. ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన విషయాలు కూడా చాలా ముఖ్యమైనవి. పార్టీలు సభలో లేవనెత్తాలనుకునే మరిన్ని అంశాలు ఉండవచ్చు. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఒక అంశాన్ని లేవనెత్తడానికి ఐక్యంగా ఉన్న కారణంగా, ప్రభుత్వం చర్చను చేపట్టడానికి సిద్ధంగా ఉంది, కానీ వందేమాతరంపై చర్చకు ముందు దానిని ఉంచడం సముచితం కాకపోవచ్చు' అని ఆయన అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ స్పందిస్తూ ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. '14 కంటే ఎక్కువ ప్రతిపక్ష పార్టీలు సర్ కారణంగా మృతి చెందారని, అందువల్ల ఒక నిర్దిష్ట అంశంపై చర్చను కోరుకుంటున్నాయి' అని అన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ అనేక పార్టీలు రూల్ 267 కింద చర్చను డిమాండ్ చేశాయని, అది ఇతర విషయాల కంటే ప్రాధాన్యత పొందాలన్నారు. ఇతర వ్యవహారాలన్నింటినీ పక్కన పెట్టి సర్‌పై నిబంధన 267 కింద చర్చను సభ చేపట్టాలన్నారు. డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్ కూడా ఎన్నికల సంస్కరణలపై చర్చ ముందుగా జరగాలని డిమాండ్ చేశారు. చైర్మన్ ఇతర పనులను కొనసాగిస్తుండగా, ప్రతిపక్ష నాయకులు సర్‌పై అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ నినాదాలు చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత వారు సభ నుండి వాకౌట్ చేశారు.

## సిఎంలకు ఆహ్వానం
(మొదటి పేజీ తరువాయి)

కలిసి తెలంగాణ మంత్రులు ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎవరెవరు ఏ ఏ రాష్ట్రాలకు వెళ్లాలో సిఎం నిర్ణయించారు. ఈ నెల 4వ తేదీన మంత్రులు వివిధ రాష్ట్రాలకు వెళ్లి సిఎంలకు గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలకు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు సి.దామోదర్ రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తరప్రదేశ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్థాన్‌కు పొన్నం ప్రభాకర్, చత్తీస్‌గడ్‌కు కొండ సురేఖ, పశ్చిమ బెంగాల్‌కు ధనసరి అనసూయ సీతక్క, మధ్యప్రదేశ్‌కు తుమ్మల నాగేశ్వర రావు, అస్సాంకు జూపల్లి కృష్ణా రావు, బిహార్‌కు జి.వివేక్ వెంకటస్వామి, ఒడిస్సాకు వాకిటి శ్రీహరి, హిమాచల్‌ప్రదేశ్‌కు అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌కు, మహారాష్ట్రకు మొహమ్మద్ అజారుద్దీన్ వెళ్ళి సిఎంకు గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖలను అందిస్తారు. ఢిల్లీ సిఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లకు తెలంగాణ రాష్ట్ర ఎంపిలు కలిసి ఆహ్వాన లేఖలను అందిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## ఉద్యమకారులను పట్టించుకోని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు

### కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఉద్యమకారులను అప్పటి మంత్రులు, ఎంఎల్‌ఎలు పట్టించుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో12 వందల మంది అమలరులయ్యారని చెప్పినప్పటికీ, కేవలం 540 మంది అమరుల కుటుంబాలకు మాత్రమే సాయం అందిందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 'తెలంగాణ అమరవీరుల స్మృతి'లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కవితతో పాటు జాగృతి నాయకులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు కనీస గౌరవం కూడా ఇవ్వలేదని, తెలంగాణ రాష్ట్రావతరణ రోజున వారికి శాలువను కూడా కప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయలేదని, వారికి గౌరవం కూడా ఇవ్వలేదన్న బాధ ప్రజలలో ఉన్నదని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను తాము సరిచేస్తామని చెప్పి అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రావతరణ రోజున ఉద్యమకారులు, వారి కుటుంబాలను గౌరవించలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెన్షన్లు, 250 గజాల స్థలాన్ని ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ నెల 9న ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపైన ప్రకటన చేయాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల చొప్పున భూములు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించకపోతే, జాగృతి తరపున భూపోరాటాలు ప్రారంభిస్తామని కవిత హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐసిడిఎస్ హైర్ వాహనాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : సలావుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐసిడిఎస్ విభాగం హైర్ వాహనాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్ వీల్ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో డబ్ల్యుడి, సిడబ్ల్యు డిపార్టుమెంట్‌కు హైర్ వాహన సేవలను అందిస్తున్నామని, ఏప్రిల్ నుండి నవంబర్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులు ఇప్పటివరకు విడుదల కాకపోవడం వల్ల తాము తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. డిజిల్, వాహన మరమ్మత్తులు, నెలవారీ ఇఎంఐలు, కుటుంబ ఖర్చులు, పిల్లల విద్యా వ్యయం వంటి అన్ని అంశాల్లో తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, ఈ పరిస్థితి కుటుంబాల ఆర్థిక భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రితో పాటు కమిషనర్‌కి లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# కార్మికులకు వేతనాలు పెంచే వరకు పోరాటం

రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు వేతనాలను పెంచే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులల్లో ఒక గంట నిరసన ధర్నా కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఫీవర్ ఆస్పత్రి, కింగ్ కోటి ఆసుపత్రులలో జరిగిన ధర్నాలో ఎం.నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కింద టెండర్లను ఆహ్వానించి, జిఒ నంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని నిబంధనలో పొందుపర్చినప్పటికీ, ఇప్పటివరకు కార్మికులకు ఆ వేతనాలు అందకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. కార్మికులకు రూ.13,600 జీతం రావాల్సి ఉండగా కేవలం రూ.11వేలు మాత్రమే చెల్లించి, శ్రమదోపిడికి గురి చేస్తున్నారని, జీతానికి తగిన పిఎఫ్ చెల్లించడం లేదని, కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం నాలుగు పండగ సెలవులు, నాలుగు జాతీయ సెలవులు, సంవత్సరానికి 15 ఆర్జిత సెలవులు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ఉన్నటువంటి ధరల అనుగుణంగా నూతన టెండర్లను ఆహ్వానించి కార్మికులకు కనీస వేతనం రూ 26వేలు ఇచ్చే విధంగా నిబంధనలు పొందుపరచాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు పెంపునకు నోచుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కనీస వేతనాల కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ రూపొందించిన జీతం కూడా నేటికీ అమలులోకి తీసుకురాకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వాలకు ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన చెప్పారు. హైదరాబాద్ లాంటి మహానగరంలో కార్మికుల జీవించడానికి సరిపడా జీతం ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగానే ప్రస్తుతం కనీసంగా రూ 26 వేల జీతాలు ఉండాలన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రులలోనే రోజు ఒక గంట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారంకాకపోతే ఈ నెల 5వ తేదీన కోఠిలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రులు సక్రమంగా నడవాలంటే కార్మికుల సంఖ్యను, బెడ్ల సంఖ్యను పెంచాలని, అందుకు అనుగుణంగా కార్మికులను నియమించాలని కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం కార్మికులకు రావాల్సిన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్‌కు సంబంధించి కింగ్ కోఠి ఆసుపత్రి నాయకులు పార్వతి, సంతోషి, భాగ్యలక్ష్మి ఫీవర్ ఆస్పత్రి నాయకులు సర్వేశ్వరరావు, రుద్రమ్మ, లక్ష్మి బాయి తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటలో భారత్‌దే అగ్రస్థానం

**తిరువనంతపురం:** సముద్ర చేపల వేట ఆసియా వ్యాప్తంగా స్తబ్దుగా ఉండటంతో చేపల చెరువుల పెంపకం గణనీయంగా వృద్ధి చెందింది. గడచిన 11 సంవత్సరాలలో భారతదేశంలో రికార్డుస్థాయిలో శరవేగంగా చేపల చెరు వుల పెంపకం, వాటి ఉత్పత్తులు వృద్ధి చెందాయి. మనదేశంలో 2014లో చేపల చెరువుల ద్వారా ఉత్పత్తులు 10.50 లక్షల టన్నులు ఉండగా, 2023 నాటికి ఈ ఉత్పత్తులు దాదాపు 40 లక్షల టన్నులకు పెరిగిందని బిఓబిపి–ఐజిఓ (బంగాళాఖాత అంతర్ ప్రభుత్వ సంస్థ కార్యక్రమం) నివేదిక వెల్లడించింది. చెన్నైలో మూడు రోజులపాటు జరిగే ఉన్నతస్థాయి ప్రాంతీయ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైన సందర్భంగా మొదటిరోజు ఈ అధ్యయన నివేదికను విడుదల చేశారు. 12 దేశాలకు చెందిన ప్రతినిధి బృందాలు ఈ వర్క్‌షాపులో పాల్గొంటున్నాయి. ఈ చేపల ఉత్పత్తులు గడచిన పదకొండేళ్ళలో మనదేశంలో ఏకంగా167 శాతం మేరకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా చేపల ఉత్పత్తులలో ఆసియాఖండం 70 శాతం వాటాతో ఆధిపత్యస్థానంలో కొనసాగుతోందని నివేదిక వెల్లడించింది. ఈ ఉత్పత్తులు గణనీయంగా పెరగడంవల్ల ఆసియాలో ఆహార భద్రత వచ్చింది. బిఓబిపి డైరెక్టర్ డాక్టర్ పి.కృష్ణన్ ఈ నివేదిక వివరాలను విధాన నిర్ణేతలకు, నిపుణులకు తెలియజేశారు. ఆసియాలో భారతదేశం చేపల చెరువుల ద్వారా ఈ ఉత్పత్తులను చేయడంలో ఆధిపత్యస్థానంలో ఉందని ఆయన చెప్పారు. మనదేశంలో చేపల చెరువుల ద్వారా ఉత్పత్తులకు సంబంధించిన ఉద్యోగిత 1995లో 17 శాతం ఉండగా, 2020 నాటికి 40 శాతానికి పెరిగిందని నివేదిక వెల్లడించింది.

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లపై ఐటి మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్లోబల్ సమ్మిట్ వేదిక వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ నెల అయిదో తేదీలోపు పనులన్నీ పూర్తి చేసి... ఆరో తేదీన డ్రైరన్ కండక్ట్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రపం చం దృష్టిని ఆకర్షించేలా... తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై సమీక్ష, ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్... మన అతిథులు, వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

## గ్లోబల్ సమ్మిట్ అతిథులకు ప్రత్యేక బాస్కెట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రముఖులకు, అతిథుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాస్కెట్‌లను అందజేయనుంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగే గ్లోబల్ సమిట్‌కు ప్రపంచం నలుమూలల నుంచి కార్పొరేట్ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, పెట్టుబడిదారులు హాజరు కానున్నారు. వీరిని తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా స్వాగతం పలకనుంది. హైదరాబాద్‌కు చేరుకున్న వెంటనే వారికి ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా సాంప్రదాయ కిట్లు, రుచికరమైన వంటకాలతో కూడిన ఫుడ్ బాస్కెట్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కిట్‌లో ఏముంటాయంటే..**

సదస్సుకు హాజరయ్యే అతిథులకు అందించే స్పెషల్ బాస్కెట్‌లో పోచంపల్లి ఇక్కత్, 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో'తో కూడిన సావనీర్ కిట్లను అందించనున్నారు. పోచంపల్లి శాలువా, చేర్యాల మాస్క్ (పెయింటిగ్స్), హైదరాబాద్ అత్తర్, హైదరాబాద్ ముత్యాలతో చేసిన ఆభరణాలు ఇందులో ఉంటాయి. అదేవిధంగా ప్రత్యేక డిజైన్‌తో సిద్ధం చేసిన కల్చరల్ ఫుడ్ బాస్కెట్‌లో మహువ లడ్డులు, సకినాలు, అప్పాలు, బదామ్‌కీ జాలి వంటి తెలంగాణ సాంప్రదాయ వంటకాలు ఉండనున్నాయి. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతి, వంటకాల ప్రత్యేకతను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నారు.

TELANGANA RISING GLOBAL SUMMIT

## హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో క్రీడా రంగానికి సంబంధించి కీలక అడుగు పడనుంది. దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. హంకాంగ్ తరవాత ప్రపంచంలోనే రెండో మహిళల ఫుట్‌బాల్ అకాడమీ ఇదే కావడం విశేషం. దేశంలో రెండో పురుషుల ఫుట్‌బాల్ అకాడమీ కూడా తెలంగాణలోనే ఏర్పాటు చేయనున్నారు. డిసెంబరు 8, 9 తేదీలలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సదస్సులో తెలంగాణ ఫిఫా ఎఐఎఫ్ఎఫ్ ఫుట్‌బాల్ అకాడమీలు వివరాలను ప్రకటించనున్నాయి. వీటితో పాటు హైదరాబాద్ అంతర్జాతీయ చెస్ నిర్వహణకు సంబంధించిన ప్రకటన కూడా సదస్సులో వెలువడనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

# మావోయిస్టు నాయకుడు లోకేటి రమేష్ లొంగుబాటు



**ప్రజాపక్షం/జనగామ :** సిపిఐ మావోయిస్టు అజ్ఞాత నాయకుడు దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సౌత్ బస్తర్ డివిజన్ పరిధిలోని చైతన్య నాట్య మంచ్ డివిజన్ కమిటీ సెక్రటరీ లోకెటి రమేష్ అలియాస్ అశోక్ అలియాస్ నరేందర్, అలియాస్ రాజేశ్వర్, రమేష్‌రావు మంగళవారం జనగామ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా జనగామ డిసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో డిసిపి రాజమహేంద్రనాయక్ మావోయిస్టు రమేష్ లొంగిపోయిన విషయాన్ని వెల్లడించారు. కామారెడ్డి జిల్లా ఇస్రోజి వాడకు చెందిన రమేష్ తండ్రి లోకొటి రాజేందర్‌రావు అలియాస్ చందర్, పడకస్వామి, ప్రభాకర్, రవి, డికేఎస్‌జడ్‌సి వెస్ట్ జోన్ బ్యూరో సెక్రటరీగా పార్టీలో పనిచేశాడన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రమేష్ మావోయిస్టు పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోవడం జరిగిందన్నారు. ఆరోగ్య సమస్యలు, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, అంతర్గత విభేదాల నేపథ్యంలో లొంగిపోవడం జరిగిందన్నారు. రమేష్‌పై రూ.8లక్షల రివార్డు ఉండగా మంగళవారం 25వేలు డిడి రూపంలో అందజేయడం జరిగిందన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని డిసిపి పిలుపునిచ్చారు. ఆయుధాలు, అజ్ఞాతాన్ని వీడాలని, ఊరికి వచ్చి కన్న వారి కన్నీళ్లు తుడవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో జనగామ ఏసిపి పండరీ చేతన్, స్టేషన్‌ఘనపూర్ ఏసిపి భీమ్‌శర్మ, రఘునాథపల్లి సిఐ శ్రీనివాస్‌రెడ్డి, జనగామ సిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ నరేష్‌లు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తున్న వారికి ఇంక్రిమెంట్ పరిశీలించాలి : ఎక్సైజ్ కమిషనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ శాఖలో పని చేస్తూ క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రోత్సాహంగా ఇంక్రిమెంట్ ఇవ్వడానికి అవకాశాలపై పరిశీలించాలని అధికారులకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ సూచించారు. ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది క్రీడల్లో ప్రతిభ చూపేందుకు వారి ఆటలో తర్ఫిదుకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం సముచితమైని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సి టీమ్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ రెజ్లింగ్ క్రీడలో రాణిస్తున్న చరణ్‌కు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ రూ.75 వేల నగదు ప్రోత్సాహన్ని అందించారు. 2025లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ రెజ్లింగ్ పోటీల్లో చరణ్ రెండో స్థానంలో రాణించి సిల్వర్ మెడల్‌ను సాధించాడు. 2024–25లో జరిగిన అల్ ఇండి యా సర్వీసెస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌ల్లో కానిస్టేబుల్ చరణ్ జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించి మంచి ప్రతిభ కనబరిచాడు. 2025–26 సంవత్సరంలో జరుగనున్న అల్ ఇండియా సర్వీసెస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో బాగా రాణించాలని, రెజ్లింగ్ సాధనకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసుకోవడానికి ఆర్థిక సాయం అందిస్తున్నామని కమిషనర్ అన్నారు. త్వరలో జరుగనున్న ఆల్ ఇండియా సర్వీసెస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో మంచి మెడల్స్‌ను సాధించి ఎక్సైజ్‌శాఖకు గుర్తింపు తీసుకురావాలని కమిషనర్ కానిస్టేబుల్ చరణ్‌కు సూచించారు. మంచి సాధన చేయాలని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాయాలని ఇంచార్జీ అడిషనల్ కమిషనర్ ఖురేషిని కమిషనర్ అదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు ఇంచార్జీ అడిషనర్ కమిషనర్ ఖురేషి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్‌లు ఉన్నారు.

# నేడు జర్నలిస్టుల మహా ధర్నా

టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా నిర్లక్ష్యానికి, నిరాధరణకు గురవుతున్న పాత్రికేయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ వెల్లడించారు. మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్ వద్ద ఉదయం 10 గంటలకు ఈ ధర్నా ప్రారంభమవుతుందని చెప్పారు. బషీర్‌బాగ్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరాహత్ అలీ మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పాత్రికేయులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పట్టించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని.. పోరుబాట పడతామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాత్రికేయుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల అమలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి భారీ సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొంటారని చెప్పారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వి.యాదగిరి, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి చీడపురుగు సైబర్ క్రైమ్



'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు

డిజిపి శివధర్ రెడ్డి, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయెల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుత కాలంలో సమాజాన్ని పట్టి పీడిస్తున్న చీడపురుగు సైబర్ క్రైమ్, గతంలో దొంగతనాలు, దారి దోపిడీలు, రాబరీ వంటివి ఉండేవి. కానీ, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఇంట్లోనే కూర్చొని కేవలం సెల్‌ఫోన్ వాడకంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రూ. కోట్లు కొల్లగొడుతున్నారని డిజిపి శివధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న 6 వారాల సైబర్ అవగాహన కార్యక్రమం 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్'ను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం అధికారికంగా డిజిపి శివధర్‌రెడ్డి, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టడానికి రాష్ట్ర పోలీస్ వ్యవస్థ కీలక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు టిజిసిఎస్‌బితో సమన్వయం మరింత బలోపేతం చేయాలని, రాబోయే 6 వారాల ప్రచారంలో ప్రతి జిల్లాలో, ప్రతి విభాగంలో, ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్రమబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. శిఖా గోయెల్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యంత బలమైన, డేటా ఆధారిత సైబర్ నేర ప్రతిస్పందన వ్యవస్థను నిర్మించిందని పేర్కొన్నారు. టిజిసిఎస్‌బి పూర్తిస్థాయి బ్యూరోగా ఏర్పడినప్పటి నుండి రూ.2.44 లక్షల ఎన్‌సిఆర్‌పి ఫిర్యాదులు అందాయని, మొత్తం 58,244 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం జరిగిందన్నారు. రూ.350 కోట్లకు పైగా సైబర్ మోస బాధితులకు రిఫండ్ చేయడం వంటి విశేష ఫలితాలు సాధించిందని తెలిపారు. 1930 హెల్ప్‌లైన్ అప్‌గ్రేడ్, పుట్ ఆన్ హోల్డ్(పిఒహెచ్) వ్యవస్థ బలోపేతం, హైకోర్టుతో కలిసి రూపొందించిన రిఫండ్ ప్రాసెస్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని తెలిపారు. 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' అవగాహన కార్యక్రమం ప్రజలతో నేరుగా కలిసే ఒక భారీ ఉద్యమమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా, విద్యాసంస్థల కోసం రూపొందించిన స్టూడెంట్ ప్రోగ్రాం ఫర్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సిబుల్ సైబర్ స్పెస్ (ఎస్‌పిఎఆర్‌సి) సైబర్ క్లబ్స్‌ను ప్రారంభించారు. ఎస్‌బిఐతో కలిసి బ్యాంకింగ్ సిబ్బంది, సున్నిత వర్గాల కోసం సైబర్ రిఫెండర్స్ అవగాహన కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్‌కు సంబంధించిన పోస్టర్లు, పాటలు, జింగిల్స్, అవగాహన చిత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నతాధికారులు అభిలాషా బిష్త్, సందీప్ శాండిల్య, విసి.సజ్జనార్, అవినాష్ మహంతి, విజయ్‌కుమార్, వి.బి.కమలాసన్ రెడ్డి, ఎఆర్.శ్రీనివాస్, కె.రమేష్‌నాయుడు, అభిషేక్ మహంతి, అరవింద్ బాబు, వైవిఎస్.సుధీంద్ర, నాగలక్ష్మి, సాయిశ్రీ,భాగస్వామ్య శాఖల ప్రతినిధులు, విద్యార్థులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) ప్రతినిధులు, విద్యార్థులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సిపిలు, ఎస్‌పిలు, వర్చువల్‌గా పాల్గొన్నారు.

# తెలంగాణ రైతులకు తీరని నష్టం

కేంద్ర విత్తన ముసాయిదా చట్టంపై సమావేశం

ఈ బిల్లు విదేశీ కంపెనీల కోసమేనని విమర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో అత్యధికంగా విత్తనోత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణ అని,కేంద్ర విత్తన ముసాయిదా చట్టం ద్వారా నష్టపోయేది తెలంగాణ రైతులేననివ్యవసాయ రంగ నిపుణులు, వ్యవసాయ, రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విత్తన ముసాయిదా చట్టం బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే రూపొందించారని విమర్శించారు. విదేశీ కంపెనీ విత్తనాలకు బారులు తీశారని, రాష్ట్రాల అధికారాలను తగ్గించి, పూర్తిగా వ్యవసాయ రంగాన్ని కేంద్రం తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'విత్తన ముసాయిదాచట్టం 2025'పైన తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని బిఆర్‌కె మంగళవారం సమావేశం నిర్వహించారు. సమవేశంలో వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులు, అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

**మల్టీనేషనల్ కంపెనీ ప్రయోజనాలే కనిపిస్తున్నాయి...: కోదండరెడ్డి**

కేంద్రం ప్రవేశపెడుతున్న విత్తన బిల్లులో బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలే కనిపిస్తున్నాయని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. విత్తనం రైతు హక్కు అని, ప్రస్తుతం ఆ విత్తనం, విత్తన కంపెనీల చేతుల్లోకి వెళ్లిందన్నారు. కేంద్రం ప్రవేశపెడుతున్న విత్తన చట్టంలో విత్తనాల ధరలపై నియంత్రణ లేదని, సెల్ఫ్ సర్టిఫికేషన్ తోనే కంపెనీలు అమ్ముకునే అవకాశం కల్పించడం పద్ధతి కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పర్యవరణవేత్త దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ ముసాయిదా విత్తన చట్టంలో రైతుల హక్కులు, వారి రక్షణను పొందుపర్చాల్సిందేనని అన్నారు. రైతుల ప్రయోజనాలకు, దీర్ఘకాలిక భద్రతకు తిలోదకాలు ఇచ్చారు.

**విత్తనాల ఎగుమతికి ముందే నాణ్యత, సాగు పరీక్షలు జరగాలి: డాక్టర్ సోమ మర్ల**

రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సోమ ఎస్. మర మాట్లాడుతూ విత్తన రకాలు ఎగుమతి చేసే దేశాల వ్యవసాయ, అక్కడి వాతావరణ పరిస్థితులకు భారతదేశంలోని దిగుమతిదారుల పరిస్థితులు చాలా భిన్నంగా ఉంటాయన్నారు. ఈ విత్తనాల నాణ్యత, సాగును భారతదేశానికి చెందిన ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలు, ఐసిఎఆర్, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరీక్షలను నిర్వహించాలని సూచించారు. దిగుమతుల ముసుగులో జన్యుపరంగా దిగుమతి చేసుకున్న బ్రీడింగ్ మెటీరియల్‌ను ఎటువంటి పరీక్షలు లేకుండా ఉపయోగిస్తే భారత వ్యవసాయానికి హానికరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ముసాయిదా చట్టంలో రైతులకు ప్రయోజనం కలిగే అంశాలు లేవని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే ప్రతిపాది ంచాలన్నారు. ధరల నియంత్రణ, పరిహారం అంశాన్ని రాష్ట్రమే నిర్వహించాలన్నారు. కిసాన్ కాంగ్రెస్ నాయకుడు పత్తి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయం పద్ధతిలో విత్తనాలు ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయిందన్నారు. హార్టికల్చర్ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి మాట్లాడుతూ సీడ్ కంపెన్సేషన్ ఎన్ని రోజుల్లో వస్తుందో ముందే చెప్పాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్ట్ తరహా ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి దేవభక్తుల సంధ్య, కోశాధికారి డి.జి. నరేంద్ర ప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త రామంజనేయులు, కిసాన్ కాంగ్రెస్ నేతలు నల్లమల్ల వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

### రైతు వ్యతిరేకం: పశ్యపద్మ

కేంద్రం ప్రవేశపెట్టిన 'విత్తన ముసాయిదా బిల్లు 2025' బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా రైతులకు వ్యతిరేకంగా ఉన్నదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. రైతు సంక్షేమం, సామాజిక న్యాయం దిశగా బిల్లును సవరించాలని, ఈ బిల్లులో అనేక సెక్షన్స్‌లలో సవరణలు అవసరమని, రైతు రక్షణను బలోపేతం చేయడం, విత్తన కంపెనీల జవాబుదారితనాన్ని పెంచడం, రైతు హక్కులను రక్షించే పిపివి ఆర్ఎఫ్ చట్టాన్ని పరిరక్షించే అంశంపైన దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో పంట దెబ్బతిన్నప్పుడు పరిహారం, విత్తన ఖర్చులు, దిగుబడి నష్టం, ఎరువులు, తిరిగి సాగు చేసుకునేందుకు అయ్యే అన్ని ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకుని రైతుకు చెల్లించాలని సూచించారు. పరిహారం చెల్లింపును కూడా నిర్దిష్టమైన కాలపరిమితిని బిల్లులో చేర్చాలన్నారు. నకిలీ విత్తనాలను నిరోధించేందుకు నకిలీ విత్తనాలను సరఫరా చేసిన వారిపై రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా, 5 ఏళ్ల ఖైదు పడేలా బిల్లును సవరించాలని పశ్యపద్మ తెలిపారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
NIT No. 23/DB/EE/Alwal Circle/GHMC/2025-26, తేది: 02.12.2025
పని పేరు: GHMC, అల్వాల్ సర్కిల్-27, వార్డు నెం.133, మచ్చబొల్లారంలోని లయోలా కాలేజ్ రోడ్‌లోని సాయిబాబానగర్ కమాన్ వద్ద ఆర్‌సిసి వరద నీటి డ్రెయిన్ పైప్‌లైన్ పునర్నిర్మాణం. అంచనా వ్యయం: రూ.15.50 లక్షలు, ప్రారంభ తేది : 03.12.2025న మ.03.00గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 06.12.2025న మ.03.00గం.ల వరకు. ఇఇ అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11633-PP/CL/ADVT/1/2025-26, Date: 02-12-2025

## రాష్ట్రస్థాయిలో వైష్ణవి విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థి విజ్ఞాన్ మంతన్ జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైష్ణవి ఐఐటి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు అర్హత సాధించారు. ఈ పరీక్ష లెవల్ 1, లెవల్ 2 స్థాయిలలో ఇప్పటి వరకు పరీక్ష నిర్వహించగా ఈ రెండు లెవల్స్‌లలో విజయం సాధించిన విద్యార్థులు మాత్రమే రాష్ట్ర స్థాయి పరీక్షకు అర్హత సాధిస్తారు. సూర్యాపేట నుండి ఒకే ఒక పాఠశాల నుండి ఇంత మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు అర్హత సాధించడం జిల్లాలోనే మొదటిసారి అని పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, కరస్పాండెంట్ కళావతి, డైరెక్టర్ హర్షిత్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత తల్లిదండ్రుల సహకారం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని వారు వివరించారు.

## కలిసి వచ్చే పార్టీలతో సిపిఐ పొత్తు



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలంలో కలిసొచ్చే పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పోటీ చేస్తుందని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో సిపిఐ శాఖ కార్యదర్శి శివర్ల లింగస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ హాజరై మాట్లాడుతూ గ్రామపంచాయితీ ఎన్నికల్లో సిపిఐ కలిసి వచ్చే పార్టీలతో పొత్తు కుదుర్చుకొని పోటీ చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , సిహెచ్ ఊషయ్య, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, ఇరిగి సంజీవ, ఎండి కరీం , మందడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు 30 పోలీస్ యాక్ట్

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 02.12.2025 నుండి ఈనెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజాజీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణా సంచా, డిజెలు ఉపయోగించవద్దని స్పష్టం చేశారు.

## మహిళలపై హింసకు వ్యతిరేక పోరాటం సమష్టి బాధ్యత




**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం సహాయం కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలపై హింస అంశంపై లైన్స్ క్లబ్ సహకారంతో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లగొండ పట్టణ వైద్యులు డాక్టర్ రాజేశ్వరి,డాక్టర్ మంజుల,డాక్టర్ విశ్వజ్యోతి విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మంగళవారం జరిగిన ఈ సదస్సు లో డా రాజేశ్వరి మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు అనేక రూపాలలో హింసను ఎదుర్కొంటున్నట్లు ముఖ్యంగా డిజిటల్ హింస నానాటికి పెరిగిపోతున్న క్రమాన్ని వివరించారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ సదుపాయాలను న్యాయపరమైన సలహాలు సూచనలు అందించే మహిళ పోలీస్ స్టేషన్, సఖి సెంటర్, న్యాయ సదన్ సేవలను వివరించారు. డాక్టర్ విశ్వ జ్యోతి మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా యువతులు మంచి పౌష్టికాహారం వ్యాయామాలు తో శారీరక మానసిక ఆరోగ్య కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ స్వీయ క్రమశిక్షణ,నిరంతర పరిశ్రమతో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయం సెంటర్ కోఆర్డినేటర్ డా సూరం శ్వేత, డాక్టర్ లక్ష్మీప్రభ,డాక్టర్ వై ప్రశాంతి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా అరుణప్రియ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు,లయన్స్ క్లబ్ సభ్యులు ఏదుల్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు





**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు అన్నారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రస్థులకు, రంగుండ్ల గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎన్నికలు జరిగే సమయంలో అందరూ సమన్వయంతో ఉండాలని కోరారు. పోలీసులు ఎన్నికల వేళ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఇలాంటి ప్రలోభాలకు బెదిరింపులకు లోను కాకుండా ఎన్నికల విధానాన్ని గౌరవించాలని సూచించారు. ఎన్నికల చిన్నపాటి వివాదాలు పెద్దగా మారే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో ఆశాంతి వాతావరణం నేలకొనేలా చేసే ప్రయత్నాలను కఠినముగా ఎదుర్కొంటామని, చట్టాన్ని అతిక్రమించే వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

**ప్రజాపక్షం/నందికొండ:** వీధికుక్కల దాడిలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన నందికొండ మునిసిపాలిటీ పైలన్ కాలనీ లోచోటుచేసుకుంది మంగళవారం సాయంత్రం జరిగి నఈ ఘటన స్థానికులను కలవరపరిచింది. పాఠశాల లనుండి ఇంటికి వెళుతున్న షేక్ అక్రమ్‌పై వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడి చేయడంతో అతడు కుక్కల బారి నుండి తప్పించుకునే ప్రయత్నంలో కింద పడిపోవటంతో అతని చేతులు, కాళ్ళు తలపై గాయాలు ఏర్పడ్డాయి ఇదే అదనుగా కుక్కలు దాడికి ప్రయత్నించే సమయంలో వెంటనే అక్కడున్న స్థానికులు కుక్కలను తరిమి బాలుడిని రక్షించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వీధి కుక్కల సమస్యను అదుపులో పెట్టేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తరచూ జరుగుతున్న కుక్క ల దాడులపై అధికారుల స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించి, తక్షణం ఇక్కడ కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కుక్కల దాడులు జరిగాకే మేల్కొనే అధికారులు**

ప్రజల్లో ఆగ్రహం వీధి కుక్కల దాడులు వరుసగా జరుగుతున్నప్పటికీ, అధికారులు మాత్రం సంఘటనలు జరిగాకే స్పందించడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. తాజాగా పాఠశాలకు వెళ్తున్న విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన మరోసారి మున్సిపల్ వ్యవస్థ నిర్లక్ష్యాన్ని వెలుగులోకి తెచ్చింది. నిత్యం కుక్కలు ఇబ్బంది పెడుతున్నాయని చిన్నపిల్లలు, వృద్ధులు భయంతో బయటకి రావట్లేదని ఏదైనా ప్రమాదం జరిగాకే అధికారులు స్పందిస్తున్నారని. గతంలో ఒక బాలికకు కుక్కల దాడిలో రాబిస్ వ్యాధి సోకి ఇప్పటికీ మృత్యువుతో పోరాడుతూనే ఉందని అయినా సరే అధికారులు ముందస్తు చర్యలు తీసుకునే ఆలోచనే లేదని స్థానికులు మండిపడుతున్నారు.



# ప్రసూతి వార్డులో పురుషులా..?

సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం

ఆసుపత్రిలో సిసి కెమెరాలు నిరంతరం పనిచేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రసూతి వార్డులో పురుషులు ఉండడం ఏంటని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. అలాగే వార్డులో ఉన్న వారందరినీ వెంటనే బయటికి పంపాలని చెప్పారు. మంగళవారం ఆమె నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు ,చిన్నపిల్లల వార్డు, ఐసీయూ తదితర వార్డులలో తనిఖీలు నిర్వహించారు. కాగా ప్రసూతి వార్డులో పురుషులు ఉండడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే అందరిని బయటకు పంపించాలని, పురుషులను ప్రసూతి వార్డులోకి ఎందుకు అనుమతించారని డ్యూటీ డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, ఇదే విషయంపై జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ పై సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ప్రసవించిన మహిళలకు సహాయకులు ఎక్కువ మంది ఉండడం వల్ల చిన్న పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని ,అందువల్ల ఎక్కువ మంది ఉండకుండా, కేవలం ఒక్కరు మాత్రమే సహాయకులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి వార్డులో ఉన్న సీసీ కెమెరాలు, ఆరు బయట వాహనాలు నిలిపే చోట ఇతర ముఖ్యమైన స్థలాలలో ఉన్న సీసీ కెమెరాలను ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేయాలని ,ముఖ్యంగా ప్రధాన గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాలు 24 గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వర్గాలను ఆదేశించారు. ప్రత్యేకించి ఆటోలు నిలిపే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటిండెంట్ అరుణకుమారి,డాక్టర్ వందన, డాక్టర్ నగేష్ ఉన్నారు.

# తప్పలకు తావులేకుండా నామినేషన్ల స్వీకరణ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/కోదాడ:** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణలో అధికారులు జాగ్రత్త వహించాలని, తప్పులకు తావులేకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ అన్నారు. మంగళవారం అనంతగిరి గ్రామ పంచాయితీ కార్యలయంలో ఆమినాబాద్, క్రిష్ణపురం, అనంతగిరి, కోదాడ మండల పరిధి గుడిబండ క్లస్టర్ పరిధి అడ్లూరు, అల్వాలపురం, గుడిబండ, తొగర్రాయి నామినేషన్ల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. అభ్యర్థులు 5 గంటల తరువాత కార్యలయంలో నామినేషన్లు వేసేందుకు వచ్చిన్నట్లయితే వారికి టోకెల్లు జారీచేయాలని అధికారులకు సూచించారు. వీరి వెంకట ఆర్డీవో సూర్యానారాయణ, తహసీల్దార్ వాజీద్ అలీ, ఎంపీడీఓ ఇసాక్‌అహ్మద్, హరిసింగ్, ఆర్‌ఓలు ఉన్నారు.

**నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజాపక్షం/అనంతగిరి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జాగ్రత్తగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడి కేంద్రంలో అన్ని వసతులు ఉన్నాయో లేవో తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం సందర్శించి టిపోల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల జాబితాను ఎంట్రీ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ సూర్యనారాయణ, తహశీల్దార్ హిమబిందు, ఎంపిడిఓ హరిసింగ్, ఎంపిఓ సుష్మా, ఎస్‌ఐ నవీన్ కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# సైబర్ నేరాల నివారణపై పోలీస్ శాఖ కృషి: ఎస్‌పి

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరుతో 42 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో కళాశాల విద్యార్థినులు, విద్యార్థులకు ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో సైబర్ నేరాలకు మోసపోకూడదని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణపై పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఈ కార్యక్రమం డిసెంబర్ 2 నుండి జనవరి 12 వరకు ప్రతి వారం ఒక్క ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాల రూపంలో చేపట్టబడుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతీ రోజూ సుమారు రూ.2 వేల కోట్లు సైబర్ మోసాల ద్వారా నష్టం జరుగుతోందని తెలిపారు. దీనిని నివారించగల మార్గం ప్రజల్లో అవగాహన పెంపుదలేనని చెప్పారు. చదువుకున్న యువత సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటే తమ కుటుంబ సభ్యులకు, పరిసరాల్లోని ప్రజలకు కూడా తెలియజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరగాళ్లు లోన్ అప్స్, ఆన్లైన్లో లింక్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఫ్రాడ్ కాల్స్, ఓటీపీ స్కామ్స్, డిజిటల్ అరెస్ట్ వాట్సాప్/ట్విట్టర్ లింక్స్, ఆన్లైన్ స్క్రాచ్ కార్డ్స్, ఏపీకే ఫైల్స్ వంటి పద్ధతులతో మోసాలను చేస్తున్నారు కాబట్టి ఏ అనుమానాస్పద లింకులు, ఫైళ్ళు క్లిక్ చేయవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, అదేవిధంగా ఎన్‌సిఆర్ పి పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ తక్షణ చర్య తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీ నారాయణ,డిఎస్‌పి శివరాం రెడ్డి,టు టౌన్ సీఐ రాఘవరావు,వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్‌ఐ విష్ణు, టూ టౌన్ ఎస్‌ఐ సైదులు, కళాశాల విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలి కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోయాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తుఫాన్‌లో మునుగుతుంటే మేము ప్రకృతి అనుకున్నాం తప్ప ఆంధ్రప్రదేశ్‌ను తప్పుపట్టడం లేదు. అక్కడెక్కడో చెట్లు ఎండిపోతే మా దిష్టి తగిలిందని నిందించడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను వస్తె తెలంగాణలో కొన్ని ప్రాంతాలు మునిగిపోయినప్పటికీ అది ప్రకృతి వైపరీత్యం కింద భావించామే తప్పా మేము ఆంధ్రప్రజలను తప్పు పట్టలేదన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల భావంతో ఉండే రాష్ట్రాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిసి దేశంలో ఉన్నతంగా ఎదగాలని కోరుకోవలసిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాంటి వివక్షపూరిత మాటలు మాట్లాడటవద్దని, విజ్ఞతగా వ్యవహరించాలని సూచించారు. మిత్రపక్షంకు బాధ్యత వహిస్తున్న తెలంగాణ బీజేపీ నాయకత్వం పవన్ వ్యాఖ్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు కలిగేలా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఉన్నందున వాటిని సంహరించుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించాలని కోరారు.

## మూడవ విడత నామినేషన్‌లకు సర్వం సిద్ధం : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే మూడవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు చౌటుప్పల్, నారాయణపూర్, అడ్డగూడూర్, మోత్కూర్, గుండాల, మోటకొండూర్ మండలాలకు సంబంధించి 124 గ్రామపంచాయతీలు, 1086 వార్డులకు జరిగే మూడవ విడత నామినేషన్ ప్రక్రియకి సంబందించి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని, నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారికి మా త్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు.

## 7న ఐఎంఎ మెగా వైద్యశిబిరం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 7వ తేదీన సూర్యాపేట పట్టణంలోని వినూత్న గ్యాస్ట్రో న్యూరో హాస్పటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఉచిత వైద్య శిభిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎమ్ఏ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ కోరారు. మంగళవారం వినూత్న హాస్పటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ఉదరకోశ వ్యాధులకు, నరాలకు సంబంధించిన వ్యాధులపై అతిపెద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని అనేక రకాల ఖరీదైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మలబద్ధకం, రక్తవిరోచనాలు, తలనొప్పి, ఫిట్స్, కడుపు నొప్పి, నరాలకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు ఈనెల 7న ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందవచ్చన్నారు. ఈ శిభిరానికి ఈనెల 5, 6 తేదీలలో పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. త్వరలో క్యాన్సర్ రాకుండా ఉండేందుకు క్యాన్సర్ డిటెక్షన్ క్యాంప్‌ను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎమ్ఏ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ దాండ్గే, కార్యదర్శి డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ రామకృష్ణ, వినూత్న హాస్పటల్ వైద్యులు రిజ్వాన్ మహమ్మద్, వి ఉదయ్ సిబ్బంది పాల్గొన్నారు.



## బరిలో దిగేందుకు క్యూ కట్టిన ఆశావహులు

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారీ ఎత్తున స్పందించిన అభ్యర్థులు

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు భారీ ఎత్తున ఆశావహులు నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు భారీగా క్యూలో నిలబడి తమ భవితవ్యాన్ని తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 30న ప్రారంభం కాగా డిసెంబర్ 2 మంగళవారంతో ముగియనుంది. నామినేషన్ల ప్రక్రియకు చివరి రోజు కావడంతో గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డు సభ్యులు సైతం పోటీ పడి అధిక సంఖ్యలో నామినేషన్లలో పాల్గొనడం విశేషం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగే ఎన్నికల్లో ఎక్కువ శాతం యువత ఎన్నికల్లో బరిలో దిగుతుండడం విశేషం. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో మొత్తం పది మండలాలు ఉండగా గ్రామపంచాయతీలు 282 ఉన్నాయి. మొత్తం 1,77,564 మంది ఓటర్లు ఉండగా, అధికారులు 93 క్లస్టర్లుగా విభజించి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. మొత్తం 2418 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 917 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తొలి రెండు రోజులు మందకొడిగా సాగిన నామినేషన్ల పర్వం చివరి రోజు మంగళవారం ఊపందుకుంది. దీంతో పోలింగ్ అదికారులు ఒక్కసారిగా అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి రావడంతో ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. అదేవిధంగా అర్ధరాత్రి వరకు ఈ నామినేషన్లు ప్రక్రియ కొనసాగుతుండడంతో కొన్ని పోలింగ్ క్లస్టర్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగినట్లు దీంతో నామినేషన్ల స్వీకరణ సమయం అర్ధరాత్రి వరకు కొనసాగుతుందని సమాచారం.

## ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి

యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థలు సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులందరు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు తెలిపారు. ఆయన మంగళవారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా మోటకొండూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంను ఆయన సందర్శించారు. తహసిల్దార్, యంపిడిఒ, ఎస్‌ఐ తదితర సిబ్బందితో ఎన్నికల సామాగ్రి విషయంలో సూచనలు, సలహాలు చేశారు. నామినేషన్లు వేసినప్పటి నుండి పలితాలు వెలువడే వరకు అన్ని విధాలుగా బాధ్యత వహించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రతి విషయము సజావుగా జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, సబ్ రిజిస్టర్ తాసిల్దార్ నాగదివ్య, ఎస్పై అశోక్, ఎంపీవో చంద్రశేఖర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా లేఅవుట్ ప్రక్రియ



కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** లేఅవుట్ ప్రక్రియ పనులను నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు . మంగళవారం ఆమె తన చాంబర్లో లే ఇరిగేషన్,మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులు తహసిల్దార్లతో లేఔట్లపై సమావేశం నిర్వహించారు. లేఔట్లకు సంబంధించిన భూసేకరణ అనుమతులను జాగ్రత్తగా పరిశీలించాలని ,అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదన్నారు. భూ రికార్డులు, డ్రైనేజీ, రోడ్డు వేల్పులు, నీటిపారుదల మార్గాలన్ని శా)య పద్ధతిలో ఉండాలని చెప్పారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని అత్యవసర కాలువలు, ఫుల్ ట్యాంక్ లెవెల్ (FTL). పరిరక్షణపై రాజీపడకుండా, నీటి ముంపు ప్రమాదం లేకుండా మంజూరు చేయాలని,ముందు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. తాహసిల్దార్, మున్సిపల్ కమిషనర్లు అనుమతుల జారీ ప్రక్రియ వేగవంతం చేయడమే కాకుండా ఎవరైనా నియమాలను ఉల్లంగించి ఉంటే అలాంటి వారిపై పై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా ఇరిగేషన్ అఅధికారి నాగార్జున, ఆర్ అండ్ బి ఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, నల్గొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్,చిట్యాల మున్సిపల్ కమిషనర్, డిటిసిపిఓ కృష్ణవేణి హాజరయ్యారు.

**తిరస్కరించిన నామినేషన్లపై పరిశీలన**

గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా నల్లగొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్ల పై వచ్చిన అప్పీళ్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆర్‌డిఓ కార్యాలయంలో పరిశీలించారు. నల్లగొండ డివిజన్ పరిధిలోని 9 మండలాలలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్ల పై 19 అప్పీళ్లు రాగా, అప్పిళ్లపై నిబంధనల ప్రకారం ఆర్ ఓ ల సమక్షంలో పరిశీలించి ఆర్‌డిఓ రూపొందించిన జాబితాను, తీసుకోన్న నిర్ణయాలను ఆమె పరిశీలించారు. కాగా వచ్చిన 19 అప్పీళ్లలో 15 తిరస్కరణకు గురికాగా, 4 అప్పిళ్లు అంగీకరించినట్లు ఆర్ డి ఓ అశోక్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వివరించారు.కాగా చందూరు డివిజన్ కు సంబంధించి నామినేషన్ల పై 3 అప్పీళ్లు రాగా, రెండు తిరస్కరణ అయ్యాయని, ఒకటి అంగీకరించడం జరిగిందని చందూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పానాసోనిక్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ పానాసోనిక్ ఎక్స్‌ప్రెస్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో క్రికెట్ లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనిని తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. సంస్థ యొక్క ఎయిర్‌కండిషనర్ (హెచ్‌విఎసి) విభాగానికి ధోని ప్రతినిధిగా వ్యవహరించనున్నారని కంపెనీ ఈ సందర్భంగా అధికారికంగా వెల్లడించింది. కంపెనీ ప్రతినిధుల ప్రకారం, ధోని యొక్క శాంత స్వభావం, విశ్వసనీయత, స్థిరత్వం, పనితీరుపై నిబద్ధత వంటి లక్షణాలు పానాసోనిక్ బ్రాండ్ విలువలతో అనుసంధానంగా ఉన్నాయని తెలిపారు. వినియోగదారులలో నమ్మకాన్ని మరింత పెంచడం లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ముందుకు తెచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఎంఎస్ ధోని మాట్లాడుతూ, పానాసోనిక్ అనేది భారతీయ కుటుంబాల్లో దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న నమ్మకమైన బ్రాండ్ ఈ సంస్థతో అనుబంధం నాకు గౌరవం అని చెప్పారు. పానాసోనిక్ 2027 నాటికి దేశంలోని ఎయిర్‌కండిషనర్ మార్కెట్లో తన వాటాను రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ధోనితో భాగస్వామ్యం చేయడం వ్యూహాత్మక నిర్ణయమని సంస్థ తెలిపారు.

## కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పకు ఊరట

### పోక్సో కేసు విచారణపై 'సుప్రీం' స్టే



**న్యూఢిల్లీ :** కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి సీనియర్ నేత బిఎస్ యడ్యూరప్పకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఆయనపై దాఖలైన పోక్సో కేసు విచారణపై స్టే విధించింది. కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను యడ్యూరప్ప సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో మళ్లీ కర్నాటక హైకోర్టు విచారించాలని ఆదేశించాలా? వద్దా? అన్న అంశానికి మాత్రమే నోటీసులు జారీ చేసినట్లు బెంచ్ స్పష్టం చేసింది. పోక్సో చట్టం కింద చార్జిషీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడాన్ని సమర్థిస్తూ.. విచారణకు హాజరు కావాలని ఆదేశించిన కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్ చేస్తూ యడ్యూరప్ప స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సిజెఐ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. ఈ కేసులో ఏం జరుగలేదని చూపించే కీలకమైన ఆధారాలను హైకోర్టు విస్మరించిందని యడ్యూరప్ప తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఆయన నాలుగు సార్లు సిఎంగా పని చేశారన్నారు. 2024 మార్చి 14న ఓ మహిళ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. సహాయం కోసం యడ్యూరప్ప ఇంటికి వెళ్లిన సమయంలో తన 17 సంవత్సరాల కుమార్తెను లైంగికంగా వేధించారని, డబ్బు ఇచ్చి ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని సదరు మహిళ ఆరోపించింది. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జూలై 4, 2024న ట్రయల్ కోర్టు యడ్యూరప్పతో పాటు మరో ముగ్గురిపై కేసును అణగదొక్కేందుకు ప్రయత్నించారని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారంటూ అభియోగాలను నమోదు చేసింది. ఆ తర్వాత కర్నాటక హైకోర్టు కేసును పునః పరిశీలించాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఫిబ్రవరి 18న ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు యడ్యూరప్పతో పాటు ముగ్గురిని మార్చి 15న తన ఎదుట కావాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, కోర్టు ఇచ్చిన ఆదేశాలతో పాటు ఫిర్యాదు సైతం కొట్టివేయాలని యడ్యూరప్ప హైకోర్టులో సవాల్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమేనని మాజీ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే, ఇటీవల కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించడంతో మాజీ సిఎం సుప్రీంకోర్టు తలుపు తట్టారు.





## ప్రధానాంశాలపై చర్చించకుండా మోదీ పారిపోతున్నారు

● ఇండియా కూటమి నేతలు మండిపాటు ● పార్లమెంట్ వెలుపల 'సర్'కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)కు వ్యతిరేకంగా, ఎన్నికల సంస్కరణలపై చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. పార్లమెంట్ భారత ప్రజలకు చెందినదని ప్రధాని చెబుతున్నప్పటికీ, ప్రజల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను చర్చించకుండా ఆయన నిరంతరం తప్పుకుంటారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కంటే పెద్ద ప్రజా సమస్య ఏముంటుందని నిరసన తర్వాత రాహుల్‌గాంధీ హిందీలో ఫేస్‌బుక్ పోస్ట్ చేశారు. సర్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్లమెంట్ భవనం వెలుపల బలమైన నిరసన నిర్వహించిందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి సర్‌పై తీవ్రమైన చర్చ పార్లమెంటులో జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ప్రతి పౌరుడి హక్కులు ఓటులో ఉంటాయి, దేశంలోని పేద, బహుజన సమాజం ఓట్లను కత్తిరించడానికి, ఎన్నికలను ఏకపక్షంగా చేయడానికి సర్ ఒక ఆయుధమని రాహుల్‌గాంధీ అన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కలిసి సర్ ద్వారా ఓట్ల దొంగతనం అమలు చేస్తున్నాయని నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. 'ఇది లక్షలాది మంది దళిత, వెనుకబడిన, గిరిజన, అణగారిన సోదరసోదరీమణుల ఓటు హక్కులను హరించడానికి ఒక వ్యవస్థీకృత ప్రయత్నం. అన్ని ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ఎన్నికల కమిషన్ వాటిలో దేనికీ సమాధానం ఇవ్వడం లేదు. ప్రభుత్వం కమిషన్‌ను బహిరంగంగా సమర్థిస్తోంది' అని ఆమె నిరసన తర్వాత ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. 'ఇది ప్రజాస్వామ్యాన్ని మరియు రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి, నియంతృత్వాన్ని స్థాపించడానికి చేసిన కుట్ర. ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగడానికి మేము అనుమతించము' అని ప్రియాంక గాంధీ చెప్పారు. డిఎంకెకు చెందిన కె కనిమొళి, టిఆర్ బాలు, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ పార్లమెంటు మకర్ ద్వార్ ముందు జరిగిన నిరసనలో పాల్గొన్న ఇతర ప్రతిపక్ష నాయకులలో ఉన్నారు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో సర్‌కు వ్యతిరేకంగా నాయకులు పోస్టర్లు, ప్లకార్డులను పట్టుకున్నారు. 'స్టాప్ సర్–స్టాప్ ఓటు చోరీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌ను కూడా వారు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఇది రాజకీయ ప్రతీకారం

### నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్ నమోదుపై ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. ఇది రాజకీయ ప్రతీకారం అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం, ఇడి కలిసి కొత్త ఆరోపణలు లేక ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని పాత కేసులను తిరిగి తెరపైకి తీసుకువస్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '12 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా గాంధీ కుటుంబంపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎందుకంటే మోదీ ప్రభుత్వం, ఇడి వద్ద కొత్త ఆరోపణలు లేవు. వాస్తవాలు తక్కువగా ఉన్నప్పుడు నాటకీయ అంశాలు రంగంలోకి దిగాయి. రాజకీయ ప్రతీకార చర్య, పాత ఆరోపణలు తీసుకురావడం అన్నీ ప్రత్యర్థులను ప్రత్యర్థులను వేధించే ప్రయత్నం. ఇది రాజకీయ ప్రతీకార చర్య. దీనిని న్యాయవ్యవస్థ కచ్చితంగా గుర్తిస్తుందని మేం విశ్వాసిస్తున్నాం' అని ఖర్గే పేర్కొన్నారు. అటు నేషనల్ హెరాల్ కేసులో ఇడి దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునే విషయంపై ఢిల్లీ కోర్టు తన నిర్ణయాన్ని డిసెంబర్ 16కు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్ పత్రికను ప్రచురిస్తున్న అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్(ఎజెఎల్ )కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువ చేసే ఆస్తుల్ని నిందితులు తమ హస్తగతం చేసుకున్నారని ఇడి ఆరోపిస్తోంది. ఈ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతోపాటు యంగ్ ఇండియన్ అనే ఒక ప్రైవేటు కంపెనీ కుట్రకు, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఇడి ఆరోపిస్తోంది.

## సమస్యల వలయంలో గుజరాత్ రాష్ట్రం

### డ్రగ్స్,అక్రమ మద్యం,రైతుల కష్టాలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై రాహుల్ విమర్శ




**న్యూఢిల్లీ:** డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాదక ద్రవ్యా లు, అక్రమ మద్యం, రైతుల కష్టాలతో గుజరాత్ రాష్ట్రం కునారిల్లిపోతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ బిజెపి పాలనపై తీవ్రస్థాయి లో విమర్శలు చేశారు. గుజరాత్‌లో ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ ''జన్ ఆక్రోశ్ యా త్ర'' కొనసాగుతున్న తరుణంలో రాహుల్‌గాంధీ మంగళవారం గుజరాత్ రాష్ట్ర సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హిం దీలో ఒక పోస్టింగ్ పెట్టారు. తమ యాత్రలో ఈ విధంగా ఎన్నో సమస్యలు పార్టీ దృష్టికి వస్తున్నాయని ప్రజలు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా రైతులు తమ సమస్యలను ఈ యాత్రలో కాంగ్రెస్‌పార్టీ దృష్టికి తీసుకువస్తున్నారని ఎక్స్ వేదికగా తెలియజేశారు. వరదలవల్ల రైతుల పంటలు నాశనమయ్యాయని, వారి జీవితాలు తలక్రిందులయ్యాయని పేర్కొన్నారు. ప్రజల బాధలను, వారి సమస్యలను కాంగ్రెస్‌పార్టీ తెలుసుకుంటుందని, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం వైఫల్యాలను, వారి అవినీతిని దేశ ప్రజల దృష్టికి తీసుకువస్తామని పేర్కొన్నారు. గుజరాత్‌లో ప్రత్యేకించి రైతులు, మహిళలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకూ మాదక ద్రవ్యాల ప్రమాదం పెరిగిపోతోందని, అక్రమ మద్యం వరదలా ప్రవహిస్తోందని, నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గుజరాత్ ప్రజా జీవితంలో అభద్రత లోతుగా విస్తరిస్తోందన్నారు. ''మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ వంటి మహోన్నత నాయకులు నడయాడిన ప్రాంతం గుజరాత్, సత్యం, నైతికత, న్యాయం వంటి ఉన్నత విలువలకు నిలయం గుజరాత్. కానీ గడచిన కొద్ది సంవత్సరాలుగా ఆ రాష్ట్రంలో యువకుల భవితవ్యం చీకటి ప్రపంచంలోకి జారుకుంది. మాదక ద్రవ్యాలు, నేరాలు రాజ్యమేలుతున్నాయి'' అని విమర్శించారు. గుజరాత్‌లో మహిళలు పెద్దసంఖ్యలో వీధుల్లోకి వస్తున్నారు, న్యాయం కావాలని కోరుతున్నారు, ఎందుకంటే నేరస్థులు అధికార శక్తుల రక్షణ పొందుతున్నారు, మహిళలు, సాధారణ ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు, కష్టాలపాలవుతున్నారు'' అని రాహుల్‌గాంధీ ఆ పోస్టింగ్‌లో విమర్శించారు. ''ఇన్ని జరుగుతున్నాగానీ, బిజెపి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోంది. ఎందుకని బిజెపి మంత్రి ఈ విషయాలన్నింటినీ దాచిపెడుతున్నారు? గుజరాత్ ద్రోహులను ఎందుకు కాపాడుతున్నారు? అని రాష్ట్రం ప్రశ్నిస్తోంది'' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ''ఇటీవల గుజరాత్‌లో వరదలు బీభత్సం సృష్టించాయి. దారుణ విలయం సృష్టించాయి, పంటలు నాశనం కావడంతో వరదలవల్ల వేలాది కుటుంబాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు సహాయ పథకాలు ఎప్పటికీ ఆగవని, అవి నిరంతయారంగా కొనసాగుతూనే ఉంటాయని రేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో చెప్పారు, కానీ ఈనాడు గుజరాత్ రాష్ట్రం డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పరిపాలనలో సమస్యల వలయంలో చిక్కుకుని కునారిల్లిపోతోంది, ఆ రాష్ట్రానికి చెందిన నేటి ప్రధానమంత్రి వారిని పట్టించుకోవడంలేదు, వారికి తగినంత సహాయం అందజేయడంలేదు, కనీసం వారిపట్ల సానుభూతి కూడా చూపించడంలేదు'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు.

## అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే... అప్పుడే శివకుమార్ సిఎం

● ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన ● శివకుమార్ నివాసంలో సిఎం అల్పాహారం



**బెంగళూరు :** తనకు, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య పునరుద్ఘాటించారు. ఇద్దరమూ సోదరులం మాదిరిగా ఐక్యంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నామని, భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. నాయకత్వ అంశంపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయానికి ఇద్దరమూ కట్టుబడి ఉంటామని, అధిష్టానం నిర్ణయించినప్పుడు శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని సిద్ధరామయ్య ప్రకటించారు. అధికార పోరు నేపథ్యంలో ఇద్దరూ ఇప్పటికే బ్రేక్‌ఫాస్ట్ మీట్ కాగా, ఐక్యతకు నిదర్శనంగా, సిద్ధరామయ్య మంగళవారం శివకుమార్ నివాసానికి అల్పాహారం కోసం వెళ్లారు. అల్పాహారం తర్వాత మీడియాతో మాట్లాడుతూ తామిద్దరం, మొత్తం పార్టీ ఐక్యంగా ఉన్నామని పేర్కొన్నారు. 'ఈ అవగాహన ఎల్లప్పుడూ ఉంటుంది. ఎటువంటి తేడాలు లేవు. డికె శివకుమార్, నేను ఐక్యంగా ఉన్నాము; మేము ప్రభుత్వాన్ని ఐక్యంగా నడుపుతాము. భవిష్యత్తులో కూడా మేము ప్రభుత్వాన్ని ఐక్యంగా నడుపుతాము' అని సిద్ధరామయ్య అన్నారు. నాయకత్వ అంశంపై, శనివారం సిఎం నివాసంలో నిర్వహించిన మునుపటి అల్పాహార సమావేశంలో నిర్ణయించినట్లుగా, తామిద్దరం హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. అయితే ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారో ఇప్పటివరకు హైకమాండ్ నుండి ఎటువంటి సమాచారం లేదు. ఒక ప్రశ్నకు సమాధానంగా సిఎం స్పందిస్తూ హైకమాండ్ మమ్మల్ని పిలిస్తే, కచ్చితంగా వెళ్లి వారిని కలుస్తామని, తమ ఇద్దరినీ ఆహ్వానించే కార్యక్రమంలో తాను ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌ను కలుస్తానన్నారు. శివకుమార్ ఎప్పుడు సిఎం అవుతారని అడిగినప్పుడు, 'హైకమాండ్ చెప్పినప్పుడు' అని బదులిచ్చారు. శివకుమార్ తనను అల్పాహారానికి ఆహ్వానించారని, అల్పాహారం తర్వాత 8 నుండి బెళగావిలో ప్రారంభమయ్యే శాసనసభ సమావేశం, అనుసరించాల్సిన వ్యూహం గురించి, అలాగే రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి ఢిల్లీలో కర్ణాటక ఎంపిల సమావేశాన్ని నిర్వహించడంపై చర్చించామని ఆయన అన్నారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ గురించి ప్రశ్నించగా, దానిపై హైకమాండ్ నిర్ణయం తీసుకోవాలని సిద్ధరామయ్య అన్నారు. మీడియా నివేదికల ప్రకారం, ప్రతిపక్ష బిజెపి, జెడి(ఎస్) ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాయని, అనేక అంశాలను లేవనెత్తుతున్నాయని, ప్రభుత్వం వాటిని దూకుడుగా ఎదుర్కొంటుందని సిఎం అన్నారు. తమ ప్రభుత్వం రైతు అనుకూలమన్నారు. రాష్ట్రంలో చెరకు, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి పరిపాలన తీసుకున్న చర్యలను ఆయన హైలైట్ చేశారు. ఈ విషయంలో కేంద్రం తగినంతగా చేయడం లేదని ఆయన ఆరోపించారు. కాగా, ముందుగా, సిద్ధరామయ్య డిప్యూటీ సిఎం సదాశివనగర్ నివాసానికి వెళ్లారు. అక్కడ ఆయనను శివకుమార్, ఆయన సోదరుడు, మాజీ కాంగ్రెస్ ఎంపి డికె సురేష్, కునిగల్ ఎమ్మెల్యే హెచ్‌డి రంగనాథ్ (శివకుమార్ బంధువు) స్వీకరించారు. వారు కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఇందులో ఇడ్లీ నాటుకోడి చికెన్‌తో సహా వెజ్, నాన్‌వెజ్ వంటకాలు ఏర్పాటు చేశారు. శివకుమార్ శాఖాహారిగా ఉన్నప్పటికీ, చికెన్‌తో అల్పాహారంగా మాంసాహారం ఉండేలా చూసుకున్నారని సిద్ధరామయ్య చెప్పారు.



## కాశ్మీర్‌లోని ఎత్తయిన ప్రాంతాలలో హిమపాతం

**శ్రీనగర్ :** కాశ్మీర్‌లోని చాలా చోట్ల కనిష్ట ఉష్ణోగ్రత తగ్గి ఘనీభవన స్థానం కంటే తక్కువగా స్థిరపడింది. అయితే ఈ వారం చివరిలో ఎత్తయిన ప్రాంతాలలో తేలికపాటి హిమపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసిందని అధికారులు మంగళవారం తెలిపారు. శ్రీనగర్‌లో సోమవారం రాత్రి కనిష్టంగా మైనస్ 2.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది, ఇది మునుపటి రాత్రి మైనస్ 1.9 డిగ్రీల సెల్సియస్ నుండి తగ్గిందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, దక్షిణ కాశ్మీర్‌లోని షోపియన్ పట్టణం లోయలో అత్యంత శీతల ప్రదేశం, కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 5 డిగ్రీల సెల్సియస్ అని వారు తెలిపారు. లోయకు ప్రవేశ ద్వారం పట్టణం, ఖాజిగుండ్‌లో కనిష్టంగా మైనస్ 2.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది, ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారాలో పాదరసం మైనస్ 3.1 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడింది. దక్షిణ కాశ్మీర్‌లోని కోకర్‌నాగ్‌లో కనిష్టంగా మైనస్ 0.6 డిగ్రీల సెల్సియస్ నమోదైందని అధికారులు తెలిపారు. దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గామ్ టూరిస్ట్ రిసార్ట్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 2.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, ఉత్తర కాశ్మీర్‌లోని గుల్‌మార్గ్ స్కీయింగ్ రిసార్ట్‌లో సున్నా డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం వరకు వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది, అయితే గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ఎత్తైన ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలలో స్వల్పంగా మంచు కురిసే అవకాశం ఉంది. శ్రీనగర్–కార్గిల్ రహదారి వెంబడి జోజిలా పాస్ సమీపంలో ఆదివారం రాత్రి స్వల్పంగా తాజా హిమపాతం నమోదైంది. డిసెంబర్ 6–7 తేదీల్లో వాతావరణం సాధారణంగా పొడిగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది, అయితే డిసెంబర్ 8న ఎత్తైన ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలలో స్వల్పంగా మంచు కురిసే అవకాశం ఉంది.

## శాంతికోసం మతాలు ఐక్యంగా వ్యవహరించాలి

### హింస– అసహనాలపై పోరాటానికి పోప్ లియో పిలుపు



**బీరూట్:** హింస–అసహనాలపై పోరాటం చేయాలని, శాంతి కోసం మతాలన్నీ ఐక్యంగా వ్యవహరించాలని పోప్ లియో–14 మతగురువులకు పిలుపు ఇచ్చారు. మానవ జాతి భవిష్యత్‌కు ఎదురయ్యే ప్రమాదాల గురించి హెచ్చరి క చేశారు. లెబనాన్‌లో శాంతి సాధన–అభివృద్ధి కోసం జ రుగుతున్న కృషిని, ప్రయత్నాలను సంరక్షించి మద్దతు ఇ వ్వాలని కోరారు. టర్కీలో పర్యటన అనంతరం పోప్–14 హోలీమాస్ సెలబ్రేషన్స్‌కోసం లెబనాన్‌కు వెళ్ళారు. బీరూ ట్ పోర్టు వద్ద 2020 ఆగస్టులో జరిగిన భారీ పేలుడు, వి ధ్వంసం సృష్టించిన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ పేలుడు ఘటనలో 218 మంది మరణించగా 7,000 మంది గాయపడ్డారు. మూడు లక్షలమంది నిరాశ్రయులయ్యారు. 15 బిలియన్ డాలర్ల మేరకు ఆస్తినష్టం జరిగింది. పోప్ కొద్దిసే పు అక్కడ మౌనంగా నిలబడి ప్రార్థనలు చేశారు. బీరూట్ లో పర్యటన చేశారు. సెయింట్ ఛార్బల్ టోంబ్‌ను సందర్శించారు. లక్షమంది ప్రజలతో కలిసి సామూహిక ప్రార్థనల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు. సెంట్రల్ మార్టిర్స్ స్క్వేర్‌లో అన్ని మతాలకు చెంది న మత గురువులు, ప్రముఖులతో సమావేశమయ్యారు. 1975–90 మధ్యకాలంలో జరిగిన అంతర్యుద్ధంలో బీ రూట్ తూర్పు(క్రైస్తవ)–పశ్చిమ (ముస్లిం) ప్రాంతాలుగా వి డిపోయిన గ్రీన్‌లైన్ వద్ద ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలలో పోప్ లియో–14 మాట్లాడుతూ, రక్తపాతం అల్లకల్లోలంతో నిండిన లెబనాన్‌లో శాం తియుత సహజీవనానికి పిలుపు ఇచ్చారు. యువతరం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆశాభావ దృక్పథాన్ని కోల్పోకూడదన్నారు. ప్రపంచంలో యువతరం తమ కలలు నెరవేర్చేకోవాలని, అందుకోసం సానుకూలమైన,ఆశాభావ దృక్పథాన్ని కోల్పోకూడదని హితవు చెప్పారు. పశ్చిమ ఆసియాలో సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ, మానవతావాదంపై మానవాళికున్న ఉమ్మడి దృక్పథం ఆశలు రేకెత్తించిందని అన్నారు. పశ్చిమ ఆసియాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న హింసాత్మక పరిణామాలను ప్రపంచం దీనముఖంతో పరిశీలిస్తూ ఉండిపోయిందని, దేవుడు మానవాళికి ఇచ్చిన శాంతి అనే గొప్ప వరాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఏ మత ఆలయంలో గంట మోగినా ఎక్కడ ప్రార్థన జరిగినా మానవాళి అభ్యున్నతి కోసం ఆ ప్రార్థనలన్నీ ఏకం కావాలన్నారు. సిరియాలో అలవైట్–డ్రూజ్ వర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ సమావేశంలో ఈ రెండు వర్గాలకు చెందిన ప్రతినిధులు ప్ర సంగించారు. సమాజానికి శాంతి, గౌరవం, రక్షణ అవసరమని అలవైట్ ప్రతినిధి మొమ్మద్ సలేహ్ అన్నారు. మధ్యప్రాచ్యంలో ఉన్న అలవైట్ సమాజాన్ని ప్రార్థనల సమయం లో గుర్తుంచుకోవాలని సవినయంగా పోప్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. మత గురువుగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పురాతన బైబిల్ భూమిలో పోప్ తన మొదటి పర్యటన చేశారు.

## చొరబాటుదారులకు 'రెడ్‌కార్పెట్' పరవాలా?

● రోహింగ్యాల అక్రమ వలసలపై 'సుప్రీంకోర్టు' గరం
అదృశ్యమైన రోహింగ్యాలను తీసుకురావాలని దాఖలు చేసిన పిటిషన్‌పై సిజెఐ సూర్యకాంత్ బెంచ్ పదునైన వ్యాఖ్యలు ● 16కు విచారణ వాయిదా

**న్యూఢిల్లీ :** భారతదేశంలో నివసిస్తున్న రోహింగ్యాల చట్టపరమైన స్థితిని మంగళవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశ పౌరులు పేదరికంతో సతమతం అవుతుండగా 'చొరబాటుదారులకు' 'రెడ్‌కార్పెట్ స్వాగతం' ఇవ్వాలా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇక్కడ అధికారుల కస్టడీ నుంచి కొంతమంది రోహింగ్యాలు అదృశ్యమయ్యారని ఆరోపిస్తూ హక్కుల కార్యకర్త రీటా మంచంద దాఖలు చేసిన హెబియస్ కార్పస్ (వ్యక్తిని తీసుకురావాలని) పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పదునైన వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ ఈ నెల 16కు వాయిదా పడింది. మే నెలలో కొంతమంది రోహింగ్యాలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ప్రస్తుతం వారెక్కడ ఉన్నారనే విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదని పిటిషన్ తరుపు న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. 'వారికి భారతదేశంలో ఉండటానికి చట్టపరమైన హోదాలేకపోతే, మీరు చొరబాటుదారు అయితే, ఉత్తర భారతదేశం వైపు మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. ఎవరైనా చొరబాటుదారు వస్తే మీకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి మేము వారికి రెడ్ కార్పెట్ స్వాగతం పలకాలా' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అడిగారు. వారిని వెనక్కి పంపించడంలో సమస్య ఏమిటి?' అని కూడా సిజెఐ ప్రశ్నించారు. భారతదేశం చాలా మంది పేదలు ఉన్న దేశం అని, మనం తప్పకుండా వారిపై దృష్టి పెట్టాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. 'ముందుగా మీరు లోపలకు ప్రవేశిస్తారు. చట్టవిరుద్ధంగా సరిహద్దు దాటుతారు. మీరు సొరంగం తవ్వుతారు. కంచె దాటి భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తారు. అప్పుడు మీరు చెబుతారు. ఇప్పుడు నేను ప్రవేశించానని. మీ చట్టాలు నాకు వర్తిస్తాయి. మేం అర్హులం. నాకు ఆశ్రయం పొందే హక్కు ఉంది. నా పిల్లలు ఇక్కడ విద్యకు అర్హులు. మనం చట్టాన్ని ఈ తరహాలోనే సాగదీయడాన్ని మనం కోరుకుందామా?' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. 2020లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తావించిన పిటిషనర్ రోహింగ్యాలను ఈ ప్రక్రియ ప్రకారం మాత్రమే బహిష్కరించాలని కోరారు. మన దేశంలో పేదలు కూడా ఉన్నారని, వారు ఈ దేశ పౌరులుగా ఉన్నారని, అలాంటప్పుడు వారు కొన్ని ప్రయోజనాలు, సౌకర్యాలు పొందేందుకు అర్హులు కాదా?, మనం వారిపై ఎందుకు దృష్టి పెట్టకూడదని?, ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవేశించినట్లయితే మనం వారికి థర్డ్ డిగ్రీ పద్ధతులు వర్తింపచేయకూడదా?, మీరు హెబియస్ రిట్ వేసి వారిని తిరిగి వెనక్కి తీసుకురావాలని కోరుతున్నారా? అంటూ సిజెఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. స్వదేశానికి తిరిగి పంపించాలని కోరితే అది లాజిస్టికల్ సమస్యలకు దారితీయవచ్చని ధర్మాసనం పేర్కొంది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ఈ పిటిషన్‌ను బాధిత వ్యక్తి దాఖలు చేయలేదని, పిటిషనర్‌కు అలాంటి పిటిషన్‌ను దాఖలు చేయడానికి ఎలాంటి అర్హత లేదని ధర్మాసనానికి తెలియజేశారు. జులై 31న దేశంలోని కొన్ని రోహింగ్యాలకు సంబంధించిన పిటిషన్ల బ్యాచ్‌ను విచారిస్తున్న సుప్రీంకోర్టు రోహింగ్యాలకు సంబంధించిన కేసుల్లో మొదట పరిష్కరించాల్సిన ప్రధాన సమస్య వారు శరణార్థులా లేదా అక్రమ ప్రవేశకులా అనే అంశమని పేర్కొంది. అది నిర్ణయించిన తర్వాత పర్యవసానంగా ఇతర సమస్యలు కూడా తలెత్తవచ్చని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది. రోహింగ్యాలకు సంబంధించిన పిటిషన్లలో పరిశీలన కోసం తలెత్తిన విస్తృత సమస్యలను ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది. ధర్మాసనం ఈ పిటిషన్లను మూడు గ్రూపులుగా విభజించింది. ఒకటి రోహింగ్యాలకు సంబంధించినది, మరొకటి రోహింగ్యాలకు సంబంధించినది కాదని, మరొకటి వేరే విషయానికి సంబంధించినదని వర్గీకరించింది. మూడు గ్రూపుల విషయాలను విడివిడిగా నిర్ణయిస్తామని, వరుసగా బుధవారాలలో ఈ పిటిషన్ల విచారణను నిర్ణయిస్తామని తెలిపింది. అక్రమంగా ప్రవేశించిన వారి విషయంలోనూ, వారిని బహిష్కరించే రాష్ట్రాల బాధ్యతపై అది సూత్రాలను మాత్రమే నిర్దేశించగలదని ధర్మాసనం సూచించింది. పిటిషనర్ మహమ్మద్ ఇస్మాయిల్, ఇతరులు ప్రస్తావించిన విషయం ప్రామాణికతను ధర్మాసనం ప్రశ్నించింది. రోహింగ్యాల బహిష్కరణను నిలిపివేయడానికి నిరాకరించింది. గతంలో ఇలాంటి ఉపశమనాన్ని కోర్టు తిరస్కరించిందని వివరించింది. మే 8న రోహింగ్యా శరణార్థి దేశం భారత చట్టాల ప్రకారం విదేశీయులని తేలితే, వారిని బహిష్కరిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది.

ప్రజాపక్షం
బుధవారం, 03 డిసెంబరు

# 'సర్'పై స్తంభించిన పార్లమెంటు

భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ఏకపక్షంగా, నిరంకుశంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రక్షాళన (ప్రత్యేక ముమ్మర రివిజన్ – ఎస్ఐఆర్) కార్యక్రమం రెండోరోజూ పార్లమెంట ఉభయసభల సమావేశాలను స్తంభింపజేసింది. 'ఓట్ చోరీ'గా ఆరోపింపబడుతున్న ఎన్నికల కమిషన్ నిర్వాకాన్ని తక్షణం చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం తమకు అభ్యంతరం లేదంటూనే ఇప్పుడు కాదు తర్వాత చూదాం అంటున్నది. సభా వ్యవహారాల సలహా కమిటీ తొలి సమావేశంలో ప్రభుత్వం 'వందేమాతరం గీతం–150 ఏళ్ల'పై చర్చను ప్రతిపాదించిందని, అందువల్ల దానికన్నా ముందు 'సర్'పై చర్చ కుదరదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అర్థంగా వాదించారు. వందేమాతరంపై చర్చను ప్రతిపక్షాలు వ్యతిరేకించనప్పుడు దానికి పోటీపెట్టటంలోనే ప్రభుత్వ ఉద్దేశం వెల్లడవుతున్నది. వందేమాతరం జాతీయ మనోభావాలతో ముడిపడివున్న అంశం. ఆ గీతం రచన 150వ వార్షిక దినాన్ని ప్రభుత్వం ఘనంగానే జరిపింది. 'సర్' వర్తమానానికి సంబంధించి వేధిస్తున్న సమస్య. ఎన్నికల ఫలితాలను పాలకపార్టీకి అనుకూలంగా తారుమారుచేస్తున్న ప్రక్రియగా ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న సమస్య. ప్రతిపక్షాల పోరాటాన్ని త్రోసిరాజని బీహార్‌లో నిర్వహించిన 'సర్' అనేక లక్షలమంది ఓట్లు తొలగించింది, చేర్పులు చేసింది. ఇది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందని అనుమానిస్తున్నారు. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో – కొద్ది మాసాల ముందుగా ఇసిఐ ఈ కార్యక్రమం చేపట్టటం, తమ నివాసార్హత, పౌరసత్వాన్ని డాక్యుమెంట్ల ఆధారంగా నిరూపించుకునే బాధ్యతను పౌరులపై పెట్టటమే దాని ఉద్దేశాలను శంకింపజేస్తున్నది. బీహార్ అనుభవంతో ఇసిఐ 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత రాష్ట్రాల్లో 'సర్'కు ఉత్తర్వు చేసింది. వాటిలో 4 రాష్ట్రాలు, 1 యుటిలు 2026 తొలి అర్ధభాగంలో ఎన్నికలకు వెళ్తున్నాయి. అవి విధించిన టైమ్ షెడ్యూలును పాటించలేక కేరళ, బెంగాల్ రాష్ట్రాల్లో పలువురు బూత్ లెవల్ పోలింగ్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) మరణించారు. వ్యవధి పొడిగించాలని పశ్చిమ బెంగాల్ బిఎల్ఓలు పెద్దగా ఆందోళన చేసినా ఇసిఐ దిగిరాక, పార్లమెంటు కూడా ప్రారంభమవుతున్న సందర్భంలో ఇసిఐ మేలుకుని ఒక వారం రోజులు వ్యవధి పొడిగించింది. కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఇసిఐ పై కేసులు వేశాయి.

పార్లమెంటు శీతాకాల సమావేశాలను కేవలం డిసెంబర్ 1 నుంచి 19వ తేదీవరకు మాత్రమే నిర్వహిస్తూ, 15సిట్టింగ్‌లకు పరిమితం చేసింది ప్రభుత్వం. 11 ముఖ్యమైన బిల్లులు ఆమోదించాలని ఎజెండాగా పెట్టుకుంది. అటువంటప్పుడు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న 'సర్' చర్చను వెంటనే చేబట్టి తమ ఎజెండాలోకి వెళ్లవచ్చు. చర్చ లేకుండానే – గందరగోళం మధ్య బిల్లులను ఆమోదం పొందే అలవాటునే ప్రభుత్వం ఇష్టపడి అనుసరించవచ్చు.

ఇసిఐ రాజ్యాంగం ద్వారా ఏర్పడిన స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. ఓటర్ల జాబితాల సవరణ, సజావుగా, స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణ దాని బాధ్యత. ఎన్నికల షెడ్యూలు ప్రకటించాక యావత్ అధికార యంత్రాంగం దాని అజమాయిషీలో పనిచేస్తుంది. నిజాయితీ, నిష్పాక్షికత దానికి భూషణాలు. ఇదే ప్రశ్నార్థకమవుతున్నప్పుడు మొత్తం ఎన్నికల ప్రక్రియ క్రమంగా విలువ కోల్పోతుంది. ఒకనాటి ఏకసభ్య ఎన్నికల కమిషన్‌ను త్రిసభ్య కమిషన్‌గా మార్చి, ప్రజాస్వామ్యయుతం చేయాల్సిన కమిషనర్ల నియామకాన్ని మోదీ ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకుంది. ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడితో కూడిన ఎంపిక కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ప్రధానికి తోడుగా హోంమంత్రిని చేర్చుతూ చట్టం చేయటంలోనే మోదీ ప్రభుత్వ స్వార్థచింతన సంశయాత్మకం.

హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి వారు ఓటర్ల జాబితాలను తారుమారుచేసిన ఉదంతాలను ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సంపూర్ణ ఆధారాలతో దేశం ముందు ఉంచినా ప్రధాన ఎన్నికల కమిషన్ దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గుతేల్చలేదు. తదుపరి బీహార్ వంతు. ఇప్పుడు తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వాల మార్పుపై గురిపెట్టి 'సర్'ను ఆదేశించారని ప్రతిపక్షాలు అనుమానిస్తున్నాయి. ఎన్నికలు రెండు–మూడు సంవత్సరాల దూరంలో ఉన్న రాష్ట్రాల్లో ఇసిఐ 'సర్' నిర్వహించుకుంటూ క్రమంగా దేశం మొత్తాన్ని కవర్ చేయవచ్చు. అప్పుడు తగిన వ్యవధి ఉంటుంది – ఓటర్లకు, బిఎల్ఓలకు, ఇసిఐ కి కూడా. తద్భిన్నంగా ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో ఐదారు మాసాల ముందు ఈ ప్రక్రియ ప్రారంభించటమే అనుమానాలకు తావిస్తున్నది. దానిపై తమ అభిప్రాయాలతో ప్రభుత్వాన్ని పార్లమెంటులో నిలదీసే హక్కు ప్రతిపక్షాలకు ఉంది. ప్రభుత్వం సమయం వృథాచేయకుండా సానుకూలంగా స్పందించాలి. వందేమాతరం, సర్‌లపై చర్చపై ప్రభుత్వం–ప్రతిపక్షం అంగీకారానికి రావటం శుభపరిణామం.

# నయా ఫాసిజం దిశగా భారతదేశ పాలన



మన్నవ హరిప్రసాద్
అడ్వొకేట్
8247728296

ఈనాడు గతంలో ఎన్నడూ లేనంతగా ఫాసిజంపైన చర్చ సాగుతున్నది. అదేవిధంగా భారత రాజ్యాంగం భారత పౌరులకు ఇచ్చిన హక్కులపై చర్చ సాగుతున్నది. దానికి కారణం గత 11 సంవత్సరాలకు పై గా భారతదేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం అనుసరిస్తున్న హిందుత్వ మత తత్వ, కార్పొరేటు కాషాయ విధానాలు కారణం.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ గా 1949 నవంబరు 26వ తేదీన భారత రాజ్యాంగ సభ ఆమోదించిన రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన భారతీయ జనతా పార్టీ గత 11 సం.గా నిరాటంకంగా మూడోసారి అధికారంలోకి రావడం జరిగింది. రాజ్యాంగం ఆమోదించిన మరుసటి రోజే అంబేద్కర్‌చే రూపొందించబడిన భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నామని, త్రివర్ణ జాతీయపతాకాన్ని వ్యతిరేకిస్తున్నామని, కాషాయ జెండా జాతీయ జెండాగా ఉండాలని ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్‌లో, అంతేకాకుండా భారత రాజ్యాంగంగా 'మనుస్మృతి' ఉండాలని ఉంది అని రాసింది. స్వతంత్ర పోరాటంలో ఎటువంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఏమీ అనలేదు. దాని నాయకుడు వీర్ సర్కార్ ప్రభుత్వానికి అనేక లొంగుబాటు ఉత్తరాలు రాశాడు. లౌకిక విలువల కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసింది. త్రివర్ణజెండాను వాజ్‌పేయ్ ప్రధానమంత్రిగా అయినంతవరకు ఎగురవేయలేదు. ప్రజల మత విశ్వాసాలను నిరంతరం రెచ్చగొట్టి అయోధ్యలో రామ జన్మభూమి రథయాత్రతో అమాంతం సీట్లు పెంచుకున్న బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే హిందుత్వం వైపు ప్రయాణం కట్టింది.

భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26న ఆమోదించిన 'భారత రాజ్యాంగం' భారత ప్రజలు తమకు తాము సమర్పించుకున్నారని ప్రవేశికలో రాసుకోవడం జరిగింది. భారత రాజ్యాంగం సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యమని పొందుపరచుకోవటం జరిగింది. లౌకిక, సామ్యవాద అనే పదాలు 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చడం జరిగింది. పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక రాజకీయ న్యాయం, ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం పట్ల స్వేచ్ఛ, పౌరులందరికీ హోదా, అవకాశాలు అన్నిటిని కూడా అందరకు సమానంగా ఇవ్వబడతాయి. ప్రతివ్యక్తికి హుందాతనానికి, జాతి ఐక్యతకు సౌభ్రాతృత్వానికి, రాజ్యాంగం హామీ ఇస్తున్నది. భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులు ఇచ్చింది. భారతదేశ పాలన ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ఉండాలని రాజ్యాంగంలో స్పష్టపరుచుకున్నాం.

కొన్ని ప్రాథమిక హక్కులు, జీవించే హక్కు, స్వేచ్ఛ, భావ స్వాతంత్రం, నమ్మకాలపట్ల విశ్వాసం, వాటికి సంబంధించి ఏపరిస్థితుల్లో ఉల్లంఘించరాదని భారత అత్యున్నత న్యాయస్థానం ఏకే గోపాలన్ కేసులో(1950,AIR,SC 27) స్పష్టపరిచింది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్స్ 14 నుండి 18 వరకు పౌరుల సమానత్వ హక్కును వివరించాయి. అదేవిధంగా 19 నుండి 22 వరకు పౌరుల స్వేచ్ఛగురించి సవివరంగా వివరించాయి. ఆర్టికల్ 14 రాజ్యాంగం ముందు అందరూ సమానమే అని, అందరికీ చట్టప్రకారంగా సమాన హక్కులు ఇవ్వబడతాయని, వ్యక్తి స్వేచ్ఛకు, వ్యక్తి స్వాతంత్ర్యానికి, వ్యక్తి రక్షణకు ఆర్టికల్ 21 రక్షణ నిచ్చింది. ఆర్టికల్ 22 ప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా ఏ వ్యక్తిని అక్రమ నిర్బంధం, అరెస్టు చేయరాదని స్పష్టం చేసింది. వారి ఇష్టమైనటువంటి మత స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ఆర్టికల్స్ 25 నుండి 28 వరకు స్పష్టంగా రాజ్యాంగంలో పొందుపరిచారు. మాట్లాడే భావ వ్యక్తీకరణ హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, సభలను నిర్వహించుకునే హక్కు, ఉద్యమించే హక్కు, నివసించే హక్కు, ఇష్టమైన చట్టబద్ధమైన వృత్తి చేసుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికలు 19 స్పష్టపరిచింది. 1978లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక, సామ్యవాద పదాలను రాజ్యాంగ ప్రవేశికలో చేర్చారు. అదేవిధంగా ప్రాథమిక హక్కుల నుండి ఆస్తి హక్కును ఆర్టికల్ 19 క్లాస్ 1, ఉప క్లాసు(యఫ్) నుండి తొలగించారు. ఆర్టికల్ 31లో చెప్పినటువంటి ఆస్తి హక్కును పూర్తిగా తొలగించి కేవలం చట్టబద్ధమైన హక్కుగానే ఉంచారు.

మన రాజ్యాంగంలో ఇన్ని మంచి విషయాలు ఉండగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు రాజ్యాంగం అమలు చేసేవారు చెడ్డవారైతే రాజ్యాంగం చెడ్డగానే ఉంటుందని మనకు గత 11 సంవత్సరాల నుండి నరేంద్ర మోదీ పాలన వలన తెలుస్తున్నది.

అధికారంలోకి 2014లో రావటానికి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ చేయని వాగ్దానమంటూ లేదు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్నాడు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బును తీసుకొచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఎకౌంట్లో పది లక్షలు జమచేస్తానన్నాడు అన్ని రకాల పంటలకు మద్దతు ధర ఇస్తానన్నాడు. తెలంగాణ నుండి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పది సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇస్తానన్నాడు. ఒకటి ఏమిటి ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రానికి సంబంధించిన సకల సమస్యలను పరిష్కరిస్తానని చేయని వాగ్దానం అంటూ లేదు.

కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు దఫాలుగా అంచెలంచెలుగా రాజ్యాంగ స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ వచ్చాడు. రాజకీయ ప్రత్యర్థులపై ఇడి, ఇన్కమ్ టాక్స్, మొదలకు డిపార్ట్మెంట్లను ప్రయోగించి ప్రత్యర్థులను లొంగదీసుకుంటున్నారు. జీఎస్టీ(వస్తువుల సేవల పన్ను) పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చాడు. కోటి ఉద్యోగాల మాటే లేదు. నల్ల డబ్బును వెలికి తీస్తానని నోట్ల డిమానిటైజేషన్ పేరుతో ధనికుల నల్లడబ్బును తెల్ల డబ్బుగా మార్చుకోవటానికి అవకాశం ఇచ్చాడు. రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత మరింతగా రెచ్చిపోయి పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ), జాతీయ ప్రజా పట్టిక(యన్‌పిఆర్), జాతీయ పౌర పట్టిక( ఎన్‌సిఆర్), జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించిన 370,35ఎ ఆర్టికల్స్ రద్దు, కార్పొరేట్లకు వ్యవసాయరంగాన్ని అప్పజెప్పే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకురావడం, వందల సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లకు తీసుకొచ్చి అమలుకు పూనుకోవడం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్), ఓట్ల చోరీ, ప్రశ్నించే వారిపై ఉపా (యుఏపిఏ)లాంటి నల్ల చట్టాలను ప్రయోగించడం, జాతీయ బ్యాంకులను ప్రైవేటు చేయడం, ఎల్ఐసి ని ఆశ్రిత కార్పొరేట్ ఆదాయానికి అప్పజెప్పటం, రైల్వేలు, పెట్రోలు, ఇంధన వనరులు, విమానాలు, విమానాశ్రయాలు, విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలు, ఒకటి ఏమిటి అన్ని రంగాలను అంబానీ, ఆదాని లాంటి ఆశ్రిత కార్పొరేట్ పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థను అప్పచెబుతున్నారు. భారత రాజ్యాంగంలో 'ప్రవేశిక' లో చెప్పిన లౌకిక రాజ్యాంగ వ్యవస్థ అనే విషయాన్ని త్రోసిపుచ్చి సాక్షాత్తు ప్రధానమంత్రి అయోధ్యలో రామాలయం నిర్మాణం ప్రారంభోత్సవములు అంతా తానే నిర్వహించాడు. నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని కూడా ప్రక్కన పెట్టాడు. మావోయిస్టుల ఏరివేత పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టు నాయకులను, కార్యకర్తలను, ఎన్కౌంటర్ల పేరుతో 400 మంది మావోయిస్టులను చంపారు. ఈ లెక్క అంత సరైనది కాకపోవచ్చు. ఉజ్జాయింపు మాత్రమే. ప్రభుత్వ లెక్కల ప్రకారం గత 25 సంవత్సరాలలో 6140 మంది నక్సలైట్లను చంపినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. హోం మంత్రి అమిత్ షా 2026 మార్చి చివరి నాటికి మావోయిస్టు రహిత భారతదేశం ఏర్పడుతుందని పదేపదే ప్రకటిస్తున్నారు. ఛత్తీస్‌గడ్, ఆంధ్ర, ఒరిస్సా, బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లోని సహజ వనరులను బాక్సైట్, అల్యూమినియం, ఐరన్ మొదలగు సహజ వనరులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగించటమే ప్రభుత్వ పనిగా ఉన్నది. భారత రాజ్యాంగాన్ని ప్రతి నిమిషం ఉల్లంఘిస్తున్నారు. మావోయిస్టులను అణచివేసే పేరుతో రాజ్యం గిరిజనులను, వారికి మద్దతుగా ఉన్నవారిని కాల్చి చంపుతున్నది. హక్కుల కార్యకర్తలను 'ఉపా'లాంటి చట్టాలు పెట్టి నిర్బంధిస్తున్నది. స్టాన్ స్వామి లాంటి వారు జైల్లోనే మగ్గి చనిపోయారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇటలీ ముస్సోలినీ, జర్మన్ హిట్లర్‌ల ఫాసిజాన్ని సాంప్రదాయ ఫాసిజమని, నేడు ప్రపంచంలో వివిధ దేశాల్లో ఉన్నటువంటిది నయా ఫాసిజమని వ్యాఖ్యానిస్తున్నారు. భారతదేశంలోని పాలన కూడా నేడు నయా ఫాసిజం రూపం తీసుకున్నదని, ప్రపంచంలో ఎక్కడైనా సరే ఫాసిజం యొక్క ప్రధాన లక్షణం మెజార్టీ మతాన్ని ఆధారం చేసుకుని, ఆమతాన్ని ఆశ్రయించి, జాతీయోన్మాదాన్ని ప్రజల మధ్య రెచ్చగొట్టి, మైనార్టీ మతాలపై విద్వేషాన్ని రగిల్చి, మెజార్టీ శ్రామిక ప్రజలను దోపిడీ చేస్తూ, వారి బ్రతుకులకు కారణం పూర్వజన్మ సుకృతం అనే దైవచింతన భావన విశిష్ట ప్రచారంలో పెట్టి, శ్రామికుల సృష్టించే అదనపు విలువే 'పెట్టుబడి' అనే అంశాన్ని మభ్యపెట్టి పెట్టుబడిదారులకు, ఆశ్రిత పెట్టుబడిదారులకు, కార్పొరేట్ పెట్టుబడిదారులకు సంపదను వారి వద్ద కేంద్రీకరించడమే నయా ఫాసిస్టు లక్షణం అని రాజకీయార్థిక శాస్త్రవేత్తలు నిర్వచిస్తున్నారు.

గత 11 సంవత్సరాలుగా ఈ దేశాన్ని భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా పాలన సాగిస్తున్నది. భారతీయ జనతా పార్టీ అనేది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం యొక్క రాజకీయ విభాగం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లేదా ఆర్ఎస్ఎస్ తనకు తాను సాంస్కృతిక సంస్థనని చెప్పుకుంటుంది. 1925 సెప్టెంబరు 27న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని కేశవ్ బలరాం హెగ్డేవార్ స్థాపించారు. దాని ప్రధాన కేంద్రం నాగపూర్. హెగ్డేవారు రాజకీయ గురువు డాక్టర్ బి ఎస్ మూంజె. దేశస్థి ఋగ్వేద బ్రాహ్మణ కుటుంబంలో బి ఎస్ మూంజే (బాలకృష్ణ శివరాం మూంజే) బిలాస్ పూర్‌లో జన్మించారు. బాల గంగాధర్ తిలక్ మరణానంతరం కాంగ్రెస్ పార్టీని వీడాడు. హిందూ మహా సభను స్థాపించాడు. 1927 నుండి 1937 వరకు అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్షుడుగా ఉన్నాడు. 1937లో వినాయక దామోదర్ సావర్కార్ కు హిందూ మహాసభ బాధ్యతలు అప్పజెప్పాడు. నాగపూర్‌లో డైలీ మహారాష్ట్ర అనే మరాఠీ వార్తాపత్రికను కూడా నడిపాడు. ముస్లింలు మెజార్టీ ఉన్న ప్రాంతాల్ని ప్రోవిన్సులుగా ఏర్పాటు చేయడానికి వ్యతిరేకించాడు. డాక్టర్ బి.ఎస్.మూంజె 1930, 1931 సంవత్సరాల్లో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాల్లో గాంధీ మహాత్ముడు ప్రబోధించిన లేదా వాదించిన లౌకికతత్వం మరియు అహింసా సిద్ధాంతాలను గట్టిగా వ్యతిరేకించాడు. 1931లో ఇటలీ ఫాసిస్టు నియంత ముస్సోలినీ ఏర్పాటుచేసిన అకాడిమియా ఫర్నెసి, ఇతర సైనిక స్కూళ్లను సందర్శించి వాటిని అధ్యయనం చేసి వచ్చాడు. ఇటలీ నుండి ఇండియాకు వచ్చి ప్రభుత్వాన్ని బలపరిచే పారా మిలిటరీ స్కూల్లను భోన్సాలోనూ, నాశిక్‌లోను 1937లో స్థాపించాడు.

ఆర్ఎస్ఎస్ లక్ష్యం భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని. అందుకు తన రాజకీయ సాధనమైన భారతీయ జనతా పార్టీ ద్వారా ఎన్నికల వ్యవస్థను ఉపయోగించుకొని ఫాసిస్టు తరహా పరిపాలన సాగిస్తున్నది. దీనినే మనం నయా ఫాసిజం అంటున్నాం. ఈ దేశంలో ఉన్న హిందుయేతర మతాలు ముస్లింలు, క్రైస్తవులు, రాజకీయంగా కమ్యూనిస్టులు వారి ప్రధాన శత్రువులు. జైన, బౌద్ధ, సిక్కు మతాలను వారు హిందూమతంలో అంతర్భాగంగా భావిస్తారు. భారతదేశం భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు కలిగిన దేశం. ఫాసిజం నుండి భారత రాజ్యాంగాన్ని, శ్రామిక వర్గాన్ని, రక్షించుకోవాల్సిన కర్తవ్యం, అవసరం మన భుజస్కందాల మీద ఉన్నది.

# ఒత్తిడి రాజకీయాలతో ప్రజాస్వామ్య స్ఫూర్తి కనుమరుగు

స్థానిక సంస్థల ఎన్నికలంటేనే గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యానికి పండుగ. అయితే, ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ వ్యవస్థను కొందరు ప్రభావశీల వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటూ, బలహీన అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా విత్‌డ్రా చేయిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని ఫలితంగా, గ్రామ స్వరాజ్యం అనే మూల సిద్ధాంతమే ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకం అవుతోంది.

సాధారణంగా, నామినేషన్ల ఉపసంహరణ అవకాశం, పోటీ చేయాలనే ఉద్దేశం లేనివారికి లేదా అనివార్య కారణాల వల్ల తప్పుకోవాలనుకునే వారికి ఒక వెసులుబాటు. కానీ, ఇక్కడ ఉద్దేశం మంచిదైనా, అమలు తీరు మాత్రం గందరగోళంగా మారిందనేది ఓటర్ల అభిప్రాయం. 'ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశం ఉండాలి. కానీ ఇప్పుడు డబ్బు, అంగబలం ఉన్నవారికే విజయం దక్కుతోంది. ఉపసంహరణ గడువు ముగిసే వేళ అసలు నిజాలు బయటకు రావట్లేదు' అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ల ఘట్టం ముగిసిన కొద్ది రోజుల్లోనే, ఊహించని విధంగా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ నుంచి వెనక్కి తగ్గడం గ్రామాల్లో చర్చనీయాంశమైంది. ఈ సామూహిక ఉపసంహరణల కారణంగా అనేక గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనివల్ల, ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ''ఓటు హక్కు'' కు విలువ లేకుండా పోతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజలకు ప్రత్యామ్నాయ ఎంపికలు లేకుండా పోతున్నాయి. ప్రస్తుత అభ్యర్థులపై వ్యతిరేక అభిప్రాయాలు ఉన్నా, తమకు నచ్చని నాయకుడిని ఎన్నుకునే పరిస్థితి లేకపోయినా, ఓటువేసే అవకాశం కోల్పోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోంది. 'భయంతోనా? ఒత్తిడితోనా? లేక డీల్‌తోనా? ఎవరికీ అర్థం కావడం లేదు' అని ప్రజలు ఒక్క కంఠంగా ప్రశ్నిస్తున్నారు.

ఈ బలవంతపు ఉపసంహరణలు కేవలం తాత్కాలిక ఎన్నికల సమస్య మాత్రమే కాదు, గ్రామ పాలన యొక్క దీర్ఘకాలిక నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఒత్తిడికి లొంగి గెలిచిన అభ్యర్థులు ప్రజలకు జవాబుదారీగా ఉండకపోవచ్చు, దీనివల్ల గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడే అవకాశం ఉంది. ఎన్నికల అధికారులు మాత్రం ఉపసంహరణ ప్రక్రియ మొత్తం క్రమబద్ధంగానే జరుగుతుందని ప్రకటిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, వెల్లువెత్తుతున్న ఆరోపణలు చూస్తుంటే, వారి వివరణపై ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే, ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఉపసంహరణ ఫారమ్ సమర్పించే సమయంలో అభ్యర్థి వీడియో రికార్డింగ్‌తో కూడిన ప్రమాణ స్వీకారం (Affidavit) తీసుకోవడం, ఒత్తిడికి గురైన అభ్యర్థులు గోప్యంగా ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయడం వంటి కట్టుదిట్టమైన చర్యలను అమలు చేయాలి. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి అభ్యర్థులను బెదిరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే, గ్రామస్థాయి రాజకీయాల్లో పారదర్శకత నెలకొంటుంది. లేదంటే, 'గ్రామ స్వరాజ్యం' అనేది కేవలం పుస్తకాల్లోని పదానికే పరిమితమైపోయే ప్రమాదం ఉంది.

వెంకగారి భూమయ్య,
9848559863

# సమాన హక్కుల కోసం ఒక రోజు




అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 3న జరుపుకుంటారు. 1981లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తుల హక్కులు, గౌరవం, వారు ఎదుర్కొనే సమస్యలపై ప్రపంచానికి అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ సంవత్సరం థీమ్ సామాజిక పురోగతికి వికలాంగుల చేర్పు, అంటే ప్రతి వ్యక్తికి సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం. ఈ సంవత్సరం కార్యక్రమాలు దోహా, ఖతార్‌లో జరిగిన సామాజిక అభివృద్ధి ప్రపంచ సదస్సు నుంచి ప్రేరణ పొంది మరింత విస్తృతంగా నిర్వహించబడుతున్నాయి. ఆ సదస్సులో ప్రపంచ నాయకులు అందరినీ చేర్చుకునే న్యాయమైన సమాజాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. దేశాల స్థిర అభివృద్ధికి ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తులకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమని వారు గుర్తు చేశారు. అయితే వాస్తవంగా, ప్రపంచవ్యాప్తంగా వారి జీవితాల్లో ఇంకా అనేక అవరోధాలు ఉన్నాయి. విద్య, ఉపాధి, వేతనాలు, సహాయక పరికరాలు, చేరుకోలేని వాతావరణం వంటి సమస్యలు రోజూ వారికి అడ్డంకులుగా మారుతున్నాయి. కాబట్టి పేదరికాన్ని తగ్గించడం, మంచి ఉపాధికి అవకాశాలిచ్చే విధానాలు తయారుచేయడం, సమాజంలో అందరికీ సమాన స్థానం కల్పించడం అత్యవసరం.

డిసెంబరు 3న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది. ఇందులో సభ్యదేశాల ప్రతినిధులు, UN అధికారులు, హక్కుల కోసం పనిచేసే ఉద్యమకారులు, యువజనాలు పాల్గొని వారికి ఎదురయ్యే సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనే దిశగా చర్చిస్తారు.

2006లో ఆమోదించబడిన వ్యక్తుల వికలాంగుల హక్కుల కన్వెన్షన్ (Convention on the Rights of Persons with Disabilities) కూడా ప్రతి వ్యక్తి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సమాన అవకాశాలు పొందాలని స్పష్టంగా చెబుతుంది. అడ్డంకులను తొలగించడం, గౌరవంతో జీవించే వాతావరణం కల్పించడం దేశాల బాధ్యతగా భావిస్తుంది. 2030 సుస్థిరాభివృద్ధి అజెండా కూడా ఎవరూ వెనుకబడకూడదు అనే సిద్ధాంతంపై ఆధారపడింది. ఆరోగ్యం, విద్య, సేవలు, మరియు మౌలిక వసతులు అందరికీ చేరేలా చూడాలని ఇది చెబుతుంది. ఈ చర్యలు సమాజంలో నిజమైన సమానత్వాన్ని కల్పిస్తాయి.

అంతర్జాతీయ వికలంగుల దినోత్సవం మనకు ప్రత్యేక అవసరాలు ఉన్నా, లేకపోయినా ప్రతి వ్యక్తికి విలువ ఉందని గుర్తు చేస్తుంది. వారికి అడ్డుగా నిలిచే అవరోధాలను తొలగించడం, సౌకర్యవంతమైన జీవితంకోసం మద్దతు కల్పించడం, ఉద్యోగం నుంచి కళల వరకు అన్ని రంగాల్లో అవకాశాలు ఇవ్వడం మనందరి బాధ్యత. ఈ రోజు ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు అందే ప్రపంచాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
vepakrish1956@gmail.com

# 'స్వయం శిక్షణ ప్రయోగ్' ద్వారా పాడి పరిశ్రమ పురోగతి

గ్రామీణ పాడి విలువ గొలుసులను బలోపేతం చేయడం, కల్తీని నివారించడం, మహిళా రైతులను అసంఘటిత పాడి రైతులను సాధికారత చేయడం వైపు ఒక విప్లవాత్మక అడుగుగా, 'స్వయం శిక్షణ ప్రయోగ్' దేశంలోని నీటికొరత ఉన్న ప్రాంతాలలో 100 సోలార్ ఆధారిత పాల చిల్లింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్న ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించింది. ఈ ప్రాజెక్టు చిన్న, మధ్యమ తరగతి రైతులకు శీతల కేంద్రాలు ఏర్పాటు చేయడం, నిల్వ సౌకర్యాన్ని అందించడానికి, అనిశ్చితమైన విద్యుత్ సరఫరాపై ఆధారపడ టం తగ్గించడానికి, అలాగే శుభ్రమైన పునరుత్పాదక శక్తి వినియోగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రోత్సహించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రతి చిల్లింగ్ యూనిట్ కోసం అధిక సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థలను సరఫరా, ఏర్పాటు మరియు కమిషన్ చేయగల అర్హతగల తయారీదారులు, వెండర్ల ను స్వయం శిక్షణ ప్రయోగ్ ఆహ్వానిస్తోంది. ప్రతి కేంద్రంలో 2.6 KWp సోలార్ ప్యానెల్స్, 5 KVA ఇన్వర్టర్ (డ్యూయల్ ట్రాకర్లతో), 5 కిలోవాట్స్ ఆఫ్‌గ్రిడ్ పవర్ కంCRష నింగ్ యూనిట్ ఉంటాయి. ఇవన్నీ కేవలం 120 చదరపు అడుగుల చిన్న ప్రదేశంలో అమర్చబడతాయి. వెండర్లకు కనీసం ఐదేళ్ల అనుభవం, దృఢమైన సాంకేతిక నైపుణ్యం, నాణ్యత హామీ, స్వయం శిక్షణ ప్రయోగ్ యొక్క స్థిరత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయగల సామర్థ్యం అవసరం.

1998లో లాతూర్ భూకంపం అనంతరం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా ప్రారంభమైన స్వయం శిక్షణ ప్రయోగ్, సంవత్సరాలకొద్దీ దేశంలోని అత్యంత ప్రభావవంతమైన మహిళా నాయకత్వ సంస్థగా ఎదిగింది. మహారాష్ట్రలోని కరువు ప్రభావిత మరాఠ్వాడ ప్రాంతాన్ని కేంద్రీకరించుకుని, ఏడు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న SSP ఇప్పటివరకు 3,274 గ్రామాల్లో 30 జిల్లాలను ఆవరించి, 3.5 లక్షలకు పైగా మహిళా నాయకులను సాధికారత చేసి, 60 లక్షల మందికి పైగా ప్రజల జీవితాల ను ప్రభావితం చేసింది. వాతావరణ అనుకూల వ్యవసాయం, శుభ్రమైన శక్తి, నీరు, శానిటేషన్, ఆరోగ్యం, పోషణ, మహిళా వ్యాపారాభివృద్ధి ఎస్ఎస్‌పి ప్రధాన రంగాలు.

**పాడి పరిశ్రమలో సోలార్ శక్తి**

పాల ఉత్పత్తి దాదాపు 2.76 కోట్ల గ్రామీణ భారతీయుల ఆదాయానికి ప్రధాన మూలం. అయితే అనిశ్చితమైన విద్యుత్, సరైన చల్లని నిల్వ అందుబాటులో లేకపోవడం వంటి సవాళ్ల కారణంగా రైతులు నష్టపోతున్నారు. చాలామంది ఖరీదైన, కాలుష్యకరమైన డీజిల్ జనరేటర్లపై ఆధారపడాల్సి వస్తోంది. స్వయం శిక్షణ ప్రయోగ్ ప్రవేశపెట్టిన ఈ సోలార్ చిల్లింగ్ హబ్‌లు ఈ సమస్యలను నేరుగా పరిష్కరిస్తాయి. ప్రతి కేంద్రం సంవత్సరానికి సుమారు ఆరు టన్నుల కార్బన్ డైయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే సామర్థ్యం కలిగి ఉండటంతో పాటు నిరంతర చిల్లింగ్ సౌకర్యం, ఆపరేటింగ్ ఖర్చు లు తక్కువ, మహిళా రైతులకు మెరుగైన మార్కెట్ ప్రాప్యతను అందిస్తుంది. అంతేకాక, ఈ కార్యక్రమం మహిళల డిజిటల్ సాక్షరత వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారికి పాడిరంగంలోని పోటీ మార్కెట్లో భాగస్వామ్యం చేసే అవకాశాలను సృష్టిస్తుంది.



ఈ ప్రాజెక్టు కోసం ఎంపికైన వెండర్ 100 సోలార్ పాల చిల్లింగ్ యూనిట్లను సరఫరా చేసి, వాటిని ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి ఆపరేషన్ స్థాయికి చేరవేయాలి. స్థానిక ఆపరేటర్లు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, సంపూర్ణ సాంకేతిక మాన్యువల్స్ అందించడం, అన్ని పరికరాలు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం వెండర్ బాధ్యత. సమయపాలనతో డెలివరీ, బహుళ ప్రదేశాల్లో ఇన్‌స్టలేషన్ పర్యవేక్షణ, కనీసం ఐదేళ్ల వారంటీ , నిర్వహణ సేవలు అందించాలి. చెల్లింపు నాలుగు దశల్లో జరుగుతుంది ఒప్పందం సంతకం సమయంలో, పరికరాల డెలివరీ సమయంలో, ఇన్‌స్టలేషన్ పూర్తయ్యే సమయంలో, మూడు నెలల విజయవంతమైన ఆపరేషన్ తరువాత అభిరుచి చూపిన దరఖాస్తుల ఆధారంగా ముగ్గురు వెండర్లను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని సాంకేతిక నైపుణ్యం, నాణ్యత హామీ, స్థిరత్వ పద్ధతులు, ఆర్థిక ప్రతిపాదనల పోటీ సామర్థ్యాల ఆధారంగా పరిశీలిస్తారు.

**భారత పాడి రంగంలో సాంకేతిక పురోగతులు**

చల్లని నిల్వ సదుపాయాల అభివృద్ధితో పాటు, పాల నాణ్యత పరీక్షల్లో పారదర్శకత, న్యాయం కల్పించే సాంకేతిక పరిష్కారాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, పాల నాణ్యతలో అసమానతలు,మాన్యువల్ కాలిబ్రేషన్ తప్పులు, కొవ్వు/ఎస్ఎన్ఎఫ్ కొలతల్లో నిర్దిష్టత లేకపోవ డం వంటి సమస్యలు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయి. చాల క్లౌడ్ బేస్డ్ సంస్థలు అభివృద్ధి చేసిన ఐటి ఆధారిత స్మార్ట్ మిల్క్ అనలైజర్లు ఈ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆన్లైన్ కాలిబ్రేషన్, బ్లూటూత్, క్లౌడ్ కనెక్టివిటీ, భద్రతాయుత లాగ్ మేనేజ్మెంట్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ వంటి లక్షణాలతో ఇవి పాల పరామితుల కొలతలో అత్యంత నిర్దిష్టతను నిర్ధారిస్తున్నా యి. దీంతో రైతులకు న్యాయమైన చెల్లింపులు, డేటా ఆధారిత నిర్ణయాలు, విలువ ఆధారిత పాడి ఉత్పత్తు ల నాణ్యతలో పెరుగుదల సాధ్యమవుతోంది.

స్వచ్ఛ శక్తి పరిష్కారాలను ఆధునిక డిజిటల్ పరికరాలతో కలిపిన స్వయం శిక్షణ ప్రయోగ్ కార్యక్రమం గ్రామీణ మహిళా రైతుల పాడి వ్యవస్థను పూర్తిగా మార్చగలదు. ఈ ప్రాజెక్టు ఆదాయాన్ని పెంచడం, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించడం, పాలు విలువ గొలుసులో పారదర్శకతను పెంపొందించడం వంటి ప్రయోజనాలను అందిస్తుంది. భారత గ్రామీణ పాడి రంగానికి నాయకత్వం వహిస్తున్న వేలాది మంది మహిళల జీవితాలను మార్చే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి వినూత్న సోలార్ తయారీ సంస్థలను స్వయం శిక్షణ ప్రయోగ్ ఆహ్వానిస్తోంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో గల మాంజీరా నది ఒడ్డు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు నిజాంసాగర్ సబ్ ఇన్స్పెక్టర్ శివకుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎలాంటి అనుమతులు పొందకుండానే ఇష్టారీతిన ట్రాక్టర్లలో ఇసుకను రాత్రివేళ అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని పోలీస్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గ్రామాల్లో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ఎన్నికల విధుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌పై తహసీల్దార్లు, ఎంపీఓలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ట్రైనర్లు పీ పీ టీ ద్వారా మంగళవారం శిక్షణ ఇచ్చారు. గరిమ అగ్రవాల్ మాట్లాడుతూపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని తెలిపారు. సంబంధిత అప్లికేషన్లు ఎంపీడీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని వివరించారు.



## ఎన్నికల విధులపై అప్రమత్తం

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




ప్రజాపక్షం/కరీంనగర్:గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలని స్పష్టం చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో పోలింగ్ జరగనున్న దృష్ట్యా పిఒ, ఏపిఒ, సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, జోనల్ అధికారుల నియామకంపై చర్చించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, నియమ నిబంధనలను క్షుణ్ణంగాపరిశీలించుకోవాలనిహెచ్చరించారు. డిఆర్ఒ వెంకటేశ్వర్లు, జడ్పి సిఇఒ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ పాల్గొన్నారు.

## నామినేషన్ పత్రాల పరిశీలన



ప్రజాపక్షం /మల్లాపూర్ : సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కోసం అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను డిపిఓ రఘువరన్ పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం మల్లాపూర్ కుస్తాపూర్ క్లస్టర్ లోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి పత్రాలను పరిశీలించి తగుచూచనను అందించారు. పకడ్బందీగా ఎన్నికల నియామవలిని అమలు చేయాలని సూచించారు. ఈయన వెంట ఎంపీడీవో ఆలువల శ్రీకాంత్ ఎంపీఓ జగదీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రిటర్నింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

## జూడోలో 'పారమిత' విద్యార్థికి కాంస్యం



ప్రజాపక్షం/కరీంనగర్ : హైదరాబాద్ వేదికగా జరిగిన పదో రాష్ట్రస్థాయి సీనియర్ జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో పారమిత హెరిటేజ్ పాఠశాల పదో తరగతివిద్యార్థి ఎ.అభినవ్ సాయి కాంస్య పతకం సాధించాడు. తెలంగాణ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 29, 30 తేదీల్లో ఈ పోటీలు జరిగాయని పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు తెలిపారు. 73 కిలోల విభాగంలో అభినవ్ సాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకం సొంతం చేసుకున్నాడన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థిని పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వి.యు.ఎం.ప్రసాద్, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపి కృష్ణ, సమన్వయకర్త రబీంద్రపాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు గోలి సుధాకర్, సరిగొమ్ముల రాజు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌కు 'మానేరు' విద్యార్థి




ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో కరీంనగర్ మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపల్ జి. సరితా రెడ్డి తెలిపారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో జరిగినప్రదర్శనలో సుస్థిర వ్యవసాయం విభాగంలో డి. అమర్ నాథ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రిక్రియేషనల్ గణిత విభాగంలో పి.సంజన్ తేజ్ ద్వితీయ స్థానం, సైన్స్ సెమినార్‌లో జోహా ఆనం తృతీయ స్థానంలో నిలిచారు. మంగళవారం పాఠశాలలో విజేతలను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్‌లో ట్రినిటీ సిబిఎస్ఇ విద్యార్థులు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : రాష్ట్రస్థాయి సాఫ్ట్ వాల్ పోటీల్లో ట్రినిటీ సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొనగా ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి మమతా ప్రశాంత్ రెడ్డి అభినందించారు.ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాఫ్ట్ బాల్ సీనియర్ అసోసియేషన్ మీట్ నవంబర్ 28, 29, 30 అదిలాబాద్ లో ఇచ్చోడలో జరిగిన ఆటలలో పెద్దపల్లి డిస్ట్రిక్ట్ తరుపున అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని పెద్దపల్లి సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ బసబోయిన వాసుదేవ్ ఎంపిక చేసిన విద్యార్థులు కౌశిక్, అక్షయ్, కీర్తన్, సాయిరాం, సాత్విక్, శ్రీనాకుల్, శ్రీరామ్, రాజు కుమార్, నితీష్ వర్మ హార్తిక్, విష్ణువర్ధన్, సంకేత్, హర్షవర్ధన్, అవినాష్, రాంచరణ్‌లను ఆమె అభినందించారు.పాఠశాల ప్రిన్సిపల్ సబర్ ముఖర్జీ,వైస్ ప్రిన్సిపాల్ రాహుల్ పర్మర్, పిటీలు అజయ్ ,మౌనిక మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన ఉండాలి

ప్రజాపక్షం/ ముస్తాబాద్ : ముస్తాబాద్‌పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను షీ టీమ్ బృందం మంగళవారం సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు.సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని,గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



### కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్:మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా వారి కోసం ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేసి సేవలు అందిస్తామని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వారధి సొసైటీ సహకారంతోమున్సిపల్ కార్మికులకు పిపిఇ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు విధిగా పిపిఇ కిట్లను ధరించాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇప్పటికేమున్సిపల్,పంచాయతీకార్మికులకు జిల్లా యంత్రాంగం తరపున ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం కార్మికులతో సహా జవాన్లు, ఇన్స్పెక్టర్లు, శానిటేషన్, ఎలక్ట్రిసిటీ సిబ్బందికి రూ.30 లక్షల ప్రమాద బీమా చేయించామని వివరించారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసే వైద్య కేంద్రంలో వైద్యుడు, మందులు అందుబాటులో ఉంటాయని, కుటుంబ సభ్యులు కూడా ఈ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ కార్మికులు తమ కెవైసి వివరాలు సమర్పించాలని సూచించారు. కార్మికుల కోసం ప్రతి నెలా ఈఎస్ఐ చెల్లిస్తున్నామని, అనారోగ్య రీత్యా సెలవులు అవసరమైన వారు ఇఎస్ఐద్వారాజీతాలు పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహినుద్దీన్, వేణు మాధవ్, మెడికల్ ఆఫీసర్ సుమన్, వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

### కలెక్టర్ పమేలా సత్పతికి ఘన సన్మానం



కరీంనగర్:ప్రజాసేవ, పరిపాలనలో విశిష్ట కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక భారత్ గౌరవ్ అవార్డు అందుకున్న కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని మంగళవారం టిఎన్‌జిఓ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదలు, అనాథలు, బలహీన వర్గాల అభ్యున్నతికి కలెక్టర్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనాథ బాలికకు వివాహం చేయడం, శుక్రవారం సభ పేరిట మహిళల సమస్యలు పరిష్కరించడం అభినందనీయమని అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా రూ.50 వేల విలువైన ఉచిత వైద్య పరీక్షలు చేయిస్తున్నారని గుర్తుచేశారు. పదో తరగతిలో విఫలమైన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారని, బధిర విద్యార్థుల కోసం సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నారని ప్రశంసించారు.టిఎన్‌జిఓ జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు,కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులురాగి శ్రీనివాస్,కార్యదర్శిసర్దార్‌ఆర్మిందర్‌సింగ్, తిరుమల శారద, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట రామస్వామి, శంకర్, లవ్ కుమార్,కమలాకర్,కరుణాకర్ పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి




ప్రజాపక్షం/కరీంనగర్ : బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలని, అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. స్నేహిత 2 అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిమ్మాపూర్, గన్నేరువరం కెజిబివి పాఠశాలలను ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా స్నేహిత కార్యక్రమం ప్రాముఖ్యత, గ్రీవెన్స్ బాక్స్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు నిర్భయంగా హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. బాలికలు భయపడకుండా ధైర్యంగా ముందుకెళ్లాలని, సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు వివరించాలని పేర్కొన్నారు. జాతీయ స్థాయి కలోత్సవ్ పోటీలకు ఎంపికైన తిమ్మాపూర్ కెజిబివి విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రత్యేక అధికారులు పడాల కిరణ్ జ్యోతి, కాచగాని మధులత, సిడిపిఒ శ్రీలత, సిపిఎస్ డిసిపియు సభ్యుడు రమేష్, ఎఇఒ అర్చన, పిహెచ్‌సి వైద్యురాలు జావేరియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ప్రలోభాలకు గురికావొద్దు

### చందుర్తి ఎస్ఐ జిల్లెల్ల రమేష్



ప్రజాపక్షం / చందుర్తి : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మద్యం, నగదు, ఉచితాలకు ప్రజ లు లోనవ్వకూడదని చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాం డు ఆవరణలో ప్రజలకు ఎన్నికల నియమావళి పై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు అయ్యేంత వరకు ప్రజలు సంయనం తో ఉండాలని , మండలం లో ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు పూర్తి అయ్యేలా పోలీసులకు సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషకర పోస్టులు పెట్టినా, గ్రామాల్లో విభేదాలు సృష్టించాలని ప్రయత్నించినా, ప్రజలను రెచ్చగొట్టాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావాళి దృష్ట్యా క్షణికావేశాలకు గురై ప్రజ లు కేసుల బారిన పడకూడదన్నారు. ఎన్నికల్లో మద్యం , నగదు పంపిణీ లాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే తమకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మండలంలో ప్రజలు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## నెల రోజుల్లోగా బోధన పద్ధతుల్లో మార్పు రావాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలలో నెల రోజులలో బోధన పద్ధతులలో మార్పు కనిపించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అకాడమిక్ ప్యానెల్ బృందాల పాఠశాలల పరిశీలనపై సంబంధితఅధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ అభ్యాసన పద్ధతులను మెరుగు పరిచేందుకు పెద్దపల్లి జిల్లా లోని ఉన్నత పాఠశాలల్లో నవంబర్ 12 నుంచి డిసెంబర్ 12 వరకు మొదటి విడుతలో 30 పాఠశాలల తనిఖీ చేయాలని నిర్ణయించామన్నారు. మనం ఇప్పటి వరకు 16ఉన్నత పాఠశాలలో అకాడమిక్ ప్యానల్ బృందాలు తనిఖీ చేసి తాము పరిశీలించిన పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్య అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యం, విద్యార్థుల హాజరు సంఖ్య వంటి వివరాలను అందించారని కలెక్టర్ తెలిపారు. అకాడమిక్ ప్యానెల్ అందించిన సమాచారం మేరకు పాఠశాలల్లో బోధన పద్ధతుల్లో చేస్తున్న మార్పుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల టి.ఎల్.ఎంపైప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పిల్లలకు పాఠాలు అర్థం అవుతున్నాయో లేదో పరిశీలించాలని, రాబోయే నెల రోజుల వ్యవధిలో ఉపాధ్యాయుల పని తీరు మార్చుకోవాలని లేని పక్షంలో కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని కలెక్టర్ అన్నారు. పాఠశాలలకు పిల్లలు రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలన్నారు.సిలబస్ సకాలంలో పూర్తి చేస్తూనే పిల్లలకు పాఠాలు అర్థమయ్యేలాబోధన ఉండాలని,పిల్లల విద్యా ప్రమాణాలుపట్లప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కలెక్టర్ అన్నారు. ప్రతి తరగతి గదిలో కనీసం 80% విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల అవగాహన ఉండాలని, అవసరమైతే పాఠశాల స్థాయిలో అదనపు తరగతుల నిర్వహణకు చర్య లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిఎం. షేక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం పరిశీలన



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ బిఎస్ఎస్ వర ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ట్యాబ్ ఎంటర్ చేసి రైస్ మిల్లుకు పంపాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం రాజరాజేశ్వర రైస్ మిల్ ను తహసిల్దార్ వర ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా తూకం అయిన వరి ధాన్యం దిగుమతి చేసుకొని ఆన్లైన్ ప్రొక్యుమెంట్ మేనేజ్మెంట్ సిస్టంలో త్వరగా క్లియర్ చేయాలని రైస్ మిల్‌యజమానిని తహసిల్దార్ ఆదేశించారు. తాసిల్దార్ వెంట ఆర్ ఐ రమేష్, మిల్లు యజమాని ఉన్నారు.

## మంత్రి అడ్లూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ప్రజాపక్షం/ధర్మపురి: రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో మంగళవారం తీగల ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తీగల ధర్మారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ పందిరి అశోక్,గుల్ల గంగన్న, మహమ్మద్ శంషోద్దీన్, రషీద్‌వారి అనుచరులకు కాంగ్రెస్ కండువా కప్పిలక్ష్మణ్ కుమార్ ఆహ్వానించారు.కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్, ఎఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు తదితరులు ఉన్నారు.

## రామగుండంలో కమీషన్ల పాలన నడుస్తోంది

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రజాపక్షం/పెద్దపల్లి:రాష్ట్రంలో రామగుండంలో కమిషన్ల పాలన నడుస్తోందనీ, ప్రశ్నించిన ప్రతిపక్షాలను బద్నాం చేసే కుట్రలు చేస్తున్నారనీ రామగుండం మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లోమంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ ఇకపై థర్మల్ పవర్ ప్లాం ట్ పెట్టం, గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌లు నెలకొల్పుతామని చెప్పారని, సిఎం మాట్లాడిన విషయంపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడితే రామగుండంలో హరీశ్ రావు పవర్‌ప్లాంట్ వద్దంటున్నారని అబద్ధపుమాటలుచెబుతూ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి,స్థానిక ఎమ్మె ల్యే, మాజీ మంత్రి హరిష్‌రావు అడిగిన వాటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకానీ రూపాయికి పావలా కూడా పలుకని నాయకులు మాజీ మంత్రిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఒక యూనిట్‌కు 4 రూపాయల 70 పైసలకే ఇవ్వడానికి సిద్ధంగా ఉండగా, మంత్రివర్గ కేబినెట్ ఇచ్చినడిపిఆర్10,800కోట్ల ప్రకారం యూనిట్‌కు 7 రూపాయల 40పైసలు పడు తుందని,అలాంటప్పుడు కమిషన్ల కోసమేనా థర్మల్ పవర్ ప్లాంట్‌లు అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించడం జరిగిందన్నారు. నాయకులు కౌశిక హరి గోపు ఐలయ్య యాదవ్, బాదే అంజలి, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, కవితా సరోజినీ, నూతి తిరుపతి, నారాయణదాసు మారుతి బుర్రి వెంకటేష్ సట్టు శ్రీనివాస్, కోడి రామకృష్ణ, కిరణ్ జీ, జక్కుల తిరుపతి, నిమ్మరాజుల సాగర్ తిమోతి, గుంపుల లక్ష్మి , గుర్రం పద్మ, కనకలక్ష్మి పాల్గొన్నారు.

## సిఎం సారూ.. ఇటు చూడరూ!

### 'గౌరవెల్లి'కి నిధుల కష్టాలు



మనుగడలోకి రాని గండిపల్లి ప్రాజెక్టు

### ఏళ్లు గడుస్తున్నా అక్కన్నపేటలో కానరాని ప్రగతి

ప్రజాపక్షం/అక్కన్నపేట: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో అభివృద్ధి పనుల్లో పురోగతి మందగిస్తోంది. ప్రధానంగా మెట్టప్రాంత హుస్నాబాద్ రైతాంగ వరప్రదాయినిగా నిలవాల్సిన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు నిధుల కొరత, కాల్వల భూసేకరణతో ముందుకు సాగడంలేదు. 2007లోనాటిముఖ్యమంత్రివైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి,గండిపల్లి ప్రాజెక్టులు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా సాగినా వాటికి పర్యావరణఅనుమతులు,నిర్వాసితులపునరావాస ప్యాకేజీ, కోర్టు కేసులు కారణాలతో రిజర్వాయర్ పనులు నిలిచిపోవడంతో రైతాంగం ఆందోళన చెందారు. తాజాగా హుస్నాబాద్‌లో పొన్నం శాసనసభ్యుడిగా గెలుపొంది రెండేళ్లు పూర్తయింది. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల నిర్మాణ పనులకు ని ధులు కేటాయింపు జరిగి అభివృద్ధి పనులు ప్రగతి బాట పట్టాయి. కాగా ఎన్నికల ముందు గండిపల్లి ప్రాజెక్టును స్వయంగా రేవంత్‌రెడ్డి సందర్శించి అభివృద్ధికి నోచుకోని ప్రాజెక్టులపై నాటి బీఆర్ఎస్ పాలన,కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 18 ఏళ్లుగా పెం డింగ్‌లో ఉన్న అక్కన్నపేట మండలం శ్రీరాంసాగర్ వరదకాలువ గండిపల్లి రిజర్వాయర్ పనులపై కాంగ్రెస్ అధికారంలోకి రా వడంతో రైతుల్లో మళ్ళీ ఆశలు చిగురించాయి. బీఆర్ఎస్ హయాంలో నిరాధారణకు గురైన గౌరవెల్లి ,గండిపల్లి ప్రాజెక్టులతోపాటు జిల్లాల పునర్విభజనలో భాగంగా నాడు కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలో కొనసాగిన కోహెడ, హుస్నాబాద్,అక్కన్నపేట మండలాలను సిద్దిపేట జిల్లాలో, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలను హన్మకొండ జిల్లాలో, చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను కరీంనగర్‌లో చేర్చడంతో ఈ ప్రాంత రైతాంగం, ప్రజానీకం విసిగిపోయారు. కొత్త మండలాన్నీ ఏర్పాటు చేసి నేటికి తొమ్మిది ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కల్పించలేక నిధులు మంజూరు చేయకపోవడంతో అరకొర పాలనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

### హుస్నాబాద్ ప్రజలకు నాడు ప్రకటించిన రేవంత్ హామీలు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో వివక్షకు గురైన గండిపల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మార్చి 2,2023న గండిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించినపుడురే వంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మూడు ముక్కలైన హుస్నాబాద్ కరీంనగర్‌లో కలవాలంటే హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురాలని కోరడంతో అనుకున్నదే తడువుగా ఈ ప్రాంత ఓటర్లు పొన్నంకు పట్టం కట్టారు. సమస్యలన్నీ పరిష్కారమవుతాయనే ధీమతో ప్రజలు ఉన్నారు.అలాగే అక్కన్నపేట మండలం ఏర్పడి తొమ్మిదేండ్లు కావస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడం గమనార్హం.ఈ ప్రాంత సమస్యలు నేడు హుస్నాబాద్‌కు విచ్చేస్తున్న సీఎం రేవంత్ రాకతో చిగురిస్తాయో..లేదో చూడాలి మరీ..

### సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

రెండేళ్ళ ప్రజాపాలన విజయోత్సవ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి హుస్నాబాద్ పట్టణంలోని అమరవీరుల స్థూపం మైదానంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం చేరుకుంటారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. బహిరంగ సభలో ప్రసంగిస్తారని మంత్రి పొన్నం వెల్లడించారు.

## నిర్మల్‌లో కూచాడితో మంత్రి జూపల్లి చర్చలు..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నాడు ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో పర్యటించ నున్న నేపథ్యంలో,జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిర్మల్ జిల్లాకు చేరుకున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇన్‌చార్జికూచాడి శ్రీహరి రా వు నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటి విం దుకు మంత్రి హాజరయ్యారు.అక్కడ కాంగ్రెస్ పార్టీ నాయ కులు మంత్రికి పుష్పగుచ్ఛం అం దించి ఘన స్వాగతం పలికారు.అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి జూపల్లి కృష్ణా రావు,శ్రీహరిరావు తో చర్చించారు.



## మీడియా సెంటర్, ఎంసిఎంసి కేంద్రాల్లో కలెక్టర్ పరిశీలన

ప్రజాపక్షం/నిజామాబాద్ :గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) సెల్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఎన్నికల సందర్భంగా ఎంసిఎంసి ద్వారా చేపడుతున్న పనులపై అడిగి తెలుసుకున్నారు. ఎంసిఎంసి కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కంట్రోల్ రూమ్‌ను సందర్శించి ఎన్నికలతో ముడిపడిన అంశాలను సంబంధించి ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంసిఎంసి కమిటీ మెంబర్ సెక్రటరీ పద్మశ్రీ లున్నారు.



## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



ప్రజాపక్షం/తాండూర్:సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ కోరారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాండూర్, అచలాపూర్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వీడియోలు పోస్ట్ చేస్తే గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తప్పవన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో 100 శాతం పోలింగ్ జరిగేలా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట తాండూర్ సిఐ దేవయ్య, ఎస్ఐ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులలో ఆత్మస్థైర్యానికే....




ప్రజాపక్షం/నస్పూర్:దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. క్రీడల ద్వారా దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అంధులు, బధిరులు, శారీరక దివ్యాంగులు, బుద్ధి మాంద్యం గల వారికి రన్నింగ్, షార్ట్ పుట్, చెస్, జావెలిన్ త్రో, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో కోతుల బెడద

### పట్టించుకోని అధికారులు

ప్రజాపక్షం/మోర్తాడ్:మోర్తాడ్ మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు కోతులు ప్రయాణికులను భయపెడుతున్నాయి. అలాగే ఉదయం పూట జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలపై అటు ఇటు వచ్చి పోవు ప్రయాణికులపై ఎగబడుతున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. అలాగే పోలీస్ స్టేషన్ ముందు గల బ్రిడ్జిపై నుంచి ఉదయం పూట ప్రజలు వెళ్లడానికి జంకుతున్నారు. కాగా నిత్యం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వివిధ పనులపై ఎంతో మంది వస్తూ వెళ్తున్నారు. అక్కడ కూడా కోతుల బెడద ఎక్కువైందని అక్కడికి వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి, విద్యాశాఖ కార్యాలయానికి, వ్యవసాయ శాఖ కార్యాలయానికి, ఐకెపి కార్యాలయానికి వెళ్లాలంటే ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఈ కోతుల బెడదను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.ఏది ఏమైనా ప్రభుత్వ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు గ్రామంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కోతులను పట్టి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టాలని స్థానిక ప్రజలు అటవీ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## నేటి నుండి 3వ విడత నామినేషన్ల స్వీకరణ: కలెక్టర్

ప్రజాపక్షం/నిజామాబాద్ :గ్రామపంచాయతీ 3వ విడత నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండవ విడతలలో బోధన్, నిజామాబాద్ డివిజన్లలోని మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్‌ను అనుసరిస్తూ సజావుగా పూర్తి చేయటం జరిగిందన్నారు. ఈనెల 3 నుండి 5 వరకు 3 విడతగా ఆర్మూర్ డివిజన్‌లోని ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీమ్‌గల్, డొంకేశ్వర్, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలోని 165 గ్రామపంచాయతీలు, 1620 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించటం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామమపత్రాలు దాఖలు చేయవచ్చని డిసెంబర్ 5 అని కలెక్టర్ సూచించారు. అన్ని కేంద్రాలలో హెల్ప్ డెస్కులు అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా అన్ని వర్గాల వారు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## ఇసుక తరలింపుదారులు అరెస్ట్



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో గల మాంజీరా నది ఒడ్డు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు నిజాంసాగర్ సబ్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎలాంటి అనుమతులు పొందకుండానే ఇష్టారీతిన ట్రాక్టర్లలో ఇసుకను రాత్రివేళ అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని పోలీస్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# ప్రజారోగ్యమే ముఖ్యం

### ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యం* నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా



ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:ఇచ్చిన హామీలు నెరవేర్చుటయే లక్ష్యంగా ప్రజారోగ్యమే ముఖ్యంగా పనిచేస్తున్నానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. మంగళవారం నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ పరిధిలోని నాగారం డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బయోమైనింగ్ ద్వారా శుభ్రపరిచే పనులు వేగంగా కొనసాగేలా చేశామన్నారు. రెండు యంత్రాల సాయంతో బయో మైనింగ్ పద్ధతిలో పాత చెత్తను వేరుచేసి, శుభ్రపరిచి, భూమిని తిరిగి ఉపయోగించుకునేలా చేస్తారన్నారు. నిజామాబాద్ నగర అవసరాల నిమిత్తం 3,51,500 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసే ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందన్నారు. ఈ చర్యలతో చెత్త శుభ్రపడి, నాగారం డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. నిజామాబాద్ ప్రజలకు, నాగారం ప్రజలకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన ఇందూరు లక్ష్యం దిశగా పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## రోకలిబండతో మోది అన్నను హత్య...

### నిందితుడి అరెస్ట్:సిఐ శశిధర్ రెడ్డి



ప్రజాపక్షం / మందమర్రి:కుటుంబ కలహాల నేపథ్యంలో సొంత అన్నను తమ్ముడు రోకలిబండతో మోది దారుణంగా హత్య చేసిన ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ శశిధర్ రెడ్డి మంగళవారం తెలిపారు. మందమర్రికి చెందిన మెండ్రపు గోపాల్, మెండ్రపు కుమార్ అన్నదమ్ములు. గోపాల్ నిత్యం మద్యం సేవించి గొడవ పడుతుండటంతో కుమార్ భార్య ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీనికి అన్నే కారణమని కుమార్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి గోపాల్ మరోసారి గొడవకు దిగడంతో ఆగ్రహించిన కుమార్ రోకలిబండతో అన్న తలపై బలంగా కొట్టాడు. దీంతో గోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేయగా సిఐ దర్యాప్తు చేపట్టారు.

## చైనా మాంజా విక్రయంపై ప్రత్యేక తనిఖీలు

### జిల్లా ఎస్‌పి జానకి షర్మిల



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :జిల్లాలో చైనా మాంజా విక్రయా న్ని నిరోధించేందుకు జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చే పట్టారు.పతంగులు ఎగరేసే సీజన్ దగ్గరపడుతున్న నేపథ్య ంలో ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చైనా మాంజా వినియోగం,రవాణా,నిల్వ,విక్రయాలను పూర్తిగా అరికట్టడమే ల క్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.ఈ స ందర్భంగా పోలీసులు నిర్మల్ పట్టణంలోని కిరాణా దుకాణా లు,చిన్న పాటి వ్యాపార కేంద్రాలను సందర్శించి అక్కడ చైనా మాంజా నిల్వ లేదా విక్రయం జరుగుతోందా అని పూర్తి స్థా యిలో తనిఖీలు నిర్వహించారు.దుకాణదారులకు చైనా మాం జా విక్రయం చట్టపరంగా నిషేధించబడిందని,దీనికి విరుద్ధ ంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా తెలియజేశారు.పర్యావరణానికి హానికరంగా ఉండే ఈ మాంజా ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేసే ఘటనలు అనేక ప్రాంతాల్లో నమోదవుతున్న నేపథ్యంలో,నిర్మల్ జిల్లా పోలీస్ తమ పరిధిలో ఈ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు సంకల్పబద్ధంగా చర్యలు చేపడుతోంది.పోలీసులు ప్రజలను కూడా అప్పమత్తం చేస్తూ చైనా మాంజా అమ్మకం,కొనుగోలు,ఉపయోగం వంటి వాటిని ఎక్కడ గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.పతంగులు ఎగరేసేటప్పుడు సురక్షిత మాంజానే ఉపయోగించాలి,చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ అధికారులు సూచించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పట్టణ ఎస్ఐ ,స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సజావుగా నామినేషన్ల ప్రక్రియ

### కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / చెన్నూరు :రాష్ట్రంలో మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామపంచాయతీలో బుధవారం నుంచి జరగనున్న నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను ఎంపిడిఓ మోహన్, సిఐలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనల మేరకు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను స్వీకరించవద్దని స్పష్టం చేశారు. అభ్యర్థులు నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని తెలిపారు. అనంతరం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు.చెన్నూరులో పట్టణ ఆరోగ్య కేంద్రం, సమీకృత కూరగాయల మార్కెట్, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలన్నారు. గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్లోని తన ఛాంబర్లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో మూడు దశల్లో నిర్వహించబోయే సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికలను ఎటువంటి లోటుపాటు లేకుండా నిర్వహించాలన్నారు.ఇందుకు తగ్గట్టుగా అధికారులంతా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.సిబ్బంది కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వివరించారు.ఎన్నికల కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి,సిబ్బంది తరలింపునకు సరిపడినన్ని వాహనాలను సమకూర్చుకోవాలని పేర్కొన్నారు.తగిన పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు తగు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.ఎన్నికల సామాగ్రి తరలింపులో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.పలువురు అధికారులకు మరోసారి శిక్షణ నిర్వహించాలని వివరించారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఆర్డిఓ రత్నకళ్యాణి,డిపిఓ శ్రీనివాస్,జెడ్పీ సీఈవో శంకర్,డీఈవో భోజన్న,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట మండలంలో జోరుగా నామినేషన్లు



ప్రజాపక్షం/రామాయంపేట:సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చివరి రోజు మంగళవారం పెద్ద ఎత్తున తమ అనుచరులతో కలిసి వచ్చారు. మండలంలోని కాట్రియాల సర్పంచు అభ్యర్థి బిఆర్ఎస్ మద్దతుతో బిల్లం అనిత శ్యాంరెడ్డి గ్రామం నుండి వందలాది మందితో తరలి వచ్చి నామినేషన్ వేశారు. సుతారిపల్లి గ్రామం నుండి సునీల్, జాన్సీలింగాపూర్ నుండి మానెగాల్ల రామకిష్టయ్య, మానెగాల్ల వెంకటి, ప్రగతి ధర్మారం నుండి ముస్కుల సిద్దరాంరెడ్డితో పాటు దామరచెరువు, అక్కన్నపేట, తొనిగండ్ల, లక్ష్మాపూర్, పర్వతాపూర్, కిషన్ తండా, జమ్లా తండా కోనాపూర్, రాయిలాపూర్, ఆర్. వెంకటాపూర్, శివాయిపల్లి, దంతెపల్లి గ్రామాల నుండి సర్పంచు, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున మండల పరిషత్ కార్యాలయానికి తరలి వచ్చి నామినేషన్లు వేశారు. సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారిని మాత్రమే అధికారులు నామినేషన్‌కు అనుమతించారు. మండలంలో 16 సర్పంచు స్థానాలు, 138 వార్డు స్థానాలు ఉండగా రెండవ రోజు రాత్రి వరకు సర్పంచు అభ్యర్థులు 59 మంది, వార్డు సభ్యుల అభ్యర్థులు 118 మంది నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా చివరి రోజు సమయం ముగిసినప్పటికి నామినేషన్ ప్రాంగణం లోపల పెద్ద ఎత్తున అభ్యర్థులు బారులు తీరారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అక్రమ ఆయుధాలతో హత్యాయత్నం..

### నిందితుడి అరెస్టు: ఎస్‌పి



ప్రజాపక్షం/కౌటాల:అక్రమ ఆయుధాలు కొనుగోలు చేసి బెదిరింపు లేఖలు రాసి ఓ వ్యాపారిపై హత్యాయత్నం చేసిన నిందితుడిని అరెస్టు చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి నితికా పంత్ తెలిపారు. కౌటాల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కౌటాల మండలం కౌటి–సాండ్గావ్‌కు చెందిన కుర్బంకర్ అజయ్ సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బీహార్ వెళ్లి పిస్టోల్, తపంచా కొనుగోలు చేశాడు. స్థానిక ఫెర్టిలైజర్ వ్యాపారిని రూ. 50 లక్షలు ఇవ్వాలని లేఖల ద్వారా బెదిరించాడు. అక్టోబరు 15న బాధితుడి సోదరుడిపై కాల్పులు జరిపి గురితప్పడంతో పరారయ్యాడు. మంగళవారం ఉదయం మళ్లీ దాడికి యత్నిస్తుండగా ముత్తంపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి పిస్టోల్, తపంచా, రెండు మ్యాగజైన్లు, తూటాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన కాగజ్‌నగర్ డిఎస్‌పి వహిదుద్దీన్, కౌటాల సిఐ బి. సంతోష్ కుమార్, ఎస్ఐలు డి. చంద్రశేఖర్, సందీప్, సిబ్బంది రమేష్, సాయిరాజ్, దుర్గ ప్రసాద్, దీపక్‌లను ఎస్‌పి అభినందించారు.

## ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలి




ప్రజాపక్షం/పిట్లం:ఎన్నికల్లో విధు లు నిర్వహించే వారు తమ ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ అన్నారు. మంగళవారం పిట్లం మండలంలోని ధర్మారం వద్ద ఎస్ఎస్‌పి రహదారిపై ఎన్నికల్లో భాగం గా వాహ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీ బృందం వాహనాన్ని ఆ మె తనిఖీ చేసి విధులు నిర్వహిస్తు న్న సిబ్బందికి పలు సలహాలు చేశారు. నిబంధనల కు లోబడి నగదు తరలించే వారు మినహా అతిగా నగదు, మద్యం బాటిళ్ళు తరలించే ఎంతటి వా రైనా వదిలిపెట్టరాదన్నారు. ఉన్నతాధికారులకు స హకరిస్తూ తోటి శాఖల అధికారులను సమన్వ యం చేసుకుంటూ తనిఖీలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి

### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ప్రజాపక్షం /పటాన్‌చెరు: అభివృద్ధి కార్యక్రమాల అంశంలో పరిశ్రమల తమ సామాజిక సేవ పథకం ద్వారా మరిన్ని నిధులు కేటాయింల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పటాన్చెరు శాసనసభ్యుడుగూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలలోని ముత్తంగిలో శాండ్వీక్ పరిశ్రమ సౌజన్యంతో కోటి రూపాయలతో చేపట్టిన ఆర్‌విటిఎం బయో కంపోసిట్ కేంద్రం అంగన్వాడీ ప్రాథమిక పాఠశాల పై ఏర్పాటు చేసిన సోలర్ విద్యుత్ సోలార్ స్టేట్ లైట్స్ ఎలక్ట్రికల్ చెత్త సేకరణ ఆటోలను ఆయన ప్రారంభించారు. అనంతరం ముత్తంగి డిఎస్ కాలనీ నుండి పాశమైలారం 100 పిట్ల రహదారి వరకు రెండు కోట్ల పది లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి ,బీట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముత్తంగి అభివృద్ధి కోసం శాండ్విక్ పరిశ్రమ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. రాబోయే రోజుల్లో గ్రామాభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అంతర్గత రహదారులు నిర్మాణానికి ప్రాదాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్ ,తెల్లాపూర్, మున్సిపల్ కమీషనర్, అజయ్‌రెడ్డి, శాండ్వీక్, పరిశ్రమ సిఎస్ఆర్ రెడ్డి, రవి ఆరోరా, సీనియర్ నాయకులు శ్రీనివాస్ ,శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఫిర్యాదులు , సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్కులు

### కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం/సంగారెడ్డి:ఎన్నికలఫిర్యాదులు,సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్ ,హల్ప్ డెస్క్ లను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి,ప్రావీణ్య తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ,హెల్ప్ డెస్క్‌లను ప్రజలు వినియోగంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులు సందేహాలు ఉంటే ప్రజలు కంట్రో ల్ రూమ్ ఫోన్ నెంబర్ "08455 276155" హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ 8125352721లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# క్రీడ

## వరల్డ్ క్రికెట్‌లో విషాదం..

### హఠాత్తుగా కన్నుమూసిన దిగ్గజ ఆటగాడు!

ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ రాబిన్ స్మిత్ కన్నుమూశాడు. ఒకప్పుడు ఇంగ్లాండ్ విజయాల్లో కీలకమైన ఈ దిగ్గజ ఆటగాడు 62 ఏళ్ల వయసులో ఆయన మరణించాడు. రాబిన్ మరణవార్తను మంగళవారం కుటుంబసభ్యులు వెల్లడించారు. సౌత్ పెర్త్‌లోని తమ ఇంట్లోనే డిసెంబర్ 1 సోమవారం రాబిన్ హఠాత్తుగా





ప్రాణాలు విడిచారని వారు చెప్పారు. ప్రపంచంలోని మేటి బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఈ లెజెండరీ ఆటగాడి మృతిపట్ల ఇంగ్లాండ్ బోర్డు సంతాపం తెలిపింది. ది జడ్జ్‌గా పేరొందిన రాబిన్ స్మిత్ మరణం ఇంగ్లాండ్ క్రికెట్ అభిమానులను విషాదంలోకి నెట్టింది. 'గుండెల నిండా బాధ, మనసు నిండా వేదనతో రాబిన్ స్మిత్ మరణించాడనే వార్తను మీతో పంచుకుంటున్నాం. డిసెంబర్ 1న మా ఇంట్లోనే అతడు హఠాత్తుగా మరణించాడు. రాబిన్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రేమించే తండ్రిగా.. సోదరభావంతో మెలిగే వ్యక్తిగా ఆయన మా హృదయాల్లో నిలిచే ఉంటాడు' అని రాబిన్ కుటుంబం పేర్కొంది. 'ప్రపంచంలోని అరవీర భయంకర బౌలర్లకు వెరవకుండా బ్యాటింగ్ చేసిన రాబిన్ మరణం ఇంగ్లాండ్ క్రికెట్‌కు తీరని లోటు' అని ఈసీబీ ఒక ప్రకటనలో వెల్లడించింది.



## హార్దిక్ రీఎంట్రీ అదుర్స్..

### తొలి మ్యాచ్‌లోనే చెలరేగిన ఆల్‌రౌండర్

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దుమ్మురేపాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు సన్నాహకంగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడుతున్న హార్దిక్ పాండ్యా తన తొలి మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులతో 77 పరుగులతో అజేయంగా నిలిచి తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. ఆసియా కప్ 2025 సందర్భంగా గాయపడ్డ హార్దిక్ పాండ్యా.. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనతో పాటు సౌతాఫ్రికాతో వన్డే సిరీస్కు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్న అతను మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరపున బరిలోకి దిగాడు. పంజాబ్‌తో మంగళవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో బరోడా విజయంలో కీలక పాత్ర పోషించాడు. హార్దిక్ విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో బరోడా 5 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 222 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 50), అన్మోల్‌ప్రీత్ సింగ్(32 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులతో 69) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. బరోడా బౌలర్లలో హార్దిక్ పాండ్యా, రసిక్ సలామ్, అతిత్ షేత్ తలో వికెట్ తీయగా.. రాజ్ లింబానీ(3/36) మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బరోడా 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 224 పరుగులు చేసి గెలుపొందింది. హార్దిక్ పాండ్యా(42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులతో 77 నాటౌట్), శివాలిక్ శర్మ(31 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 47 నాటౌట్) పరుగులతో రాణించాడు. అశ్వని కుమార్, రమణ్‌దీప్ సింగ్ తలో వికెట్ తీసారు. తాజా ఇన్నింగ్స్‌లో హార్దిక్ పాండ్యా రీఎంట్రీకి మార్గం సుగుమమైంది. డిసెంబర్ 9 నుంచి సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. డిసెంబర్ 9న కటక్ వేదికగా, డిసెంబర్ 11న న్యూ చండీఘర్‌లో రెండో టీ20, డిసెంబర్ 14న ధర్మశాల వేదికగా మూడో టీ20, డిసెంబర్ 17న లక్నో వేదికగా నాలుగో టీ20, డిసెంబర్ 19న అహ్మదాబాద్ వేదికగా ఐదో టీ20 జరగనుంది. ఈ సిరీస్‌కు భారత సెలెక్టర్లు ఇంకా జట్టును ప్రకటించలేదు.

## వైభవ్ సరికొత్త రికార్డు



భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మరో రికార్డు నెలకొల్పాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతిపిన్న వయసు (14 ఏళ్ల 250 రోజులు)లో సెంచరీ చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మంగళవారం మహారాష్ట్ర, బిహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ (108*; 61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులు) సెంచరీ బాదాడు. అంతకుముందు ఈ రికార్డు విజయ్ జోల్ పేరిట ఉండేది. మహారాష్ట్ర తరపున ఆడిన విజయ్ 2013లో ముంబయితో జరిగిన 63 బంతుల్లో సెంచరీ చేశాడు. అప్పుడు అతని వయసు 18 ఏళ్ల 118 రోజులు. వైభవ్‌కు ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇది తొలి శతకం. అతను 15 ఏళ్లు నిండకముందే టీ20ల్లో మూడో సెంచరీ సాధించడం విశేషం. అంతకుముందు ఐపిఎల్ 2025, ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025లోనూ వైభవ్ శతకాలు బాదిన సంగతి తెలిసిందే. ఇక, మహారాష్ట్ర, బిహార్ మ్యాచ్ విషయాని కొస్తే.. వైభవ్ సెంచరీతో చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన బిహార్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని మహారాష్ట్ర ఐదు బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి ఛేదించిది. కెప్టెన్ పృథ్వీ షా (66; 30 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) మెరిశాడు. అతను 21 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. నీరజ్ జోషి (30), రంజిత్ (27), నిఖిల్ నాయక్ (22) రాణించారు.

# ఫోకస్


# మహిళ



## మహిళల సాధికారతే నేటి అవసరం..

పేదరికం కేవలం ఆర్థిక లోపం మాత్రమే కాదు. ఇది వ్యక్తుల గౌరవం, స్వేచ్ఛ, జీవన అవకాశాలను కూడా తగ్గిస్తుంది. 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన ప్రతి వ్యక్తికి ఆహారం, నివాసం, వైద్య సేవలు, సామాజిక భద్రత హక్కుగా ఉన్నాయని స్పష్టంగా ప్రకటించింది. 2030 నాటికి పేదరిక నిర్మూలనను ప్రపంచ అభివృద్ధికి అత్యవసర కర్తవ్యంగా గుర్తించాయి. మహిళల సాధికారత, స్వాతంత్ర్యం, హక్కులు అనేవి లింగ సమానత్వ సాధనలో పునాదులుగా ఉంటాయి. ఇవి పరస్పరపూరకాలు కూడా. మహిళలకు సమాన అవకాశాలు, సమాన వేతనం, నిర్ణయాధికారం కల్పించడం కేవలం పేదరికాన్ని తగ్గించడం మాత్రమే కాక, కుటుంబాలు, సమాజం, దేశం స్థిర అభివృద్ధి వైపు ముందుకు సాగడానికి పునాదులు సిద్ధం చేయడం అత్యవసరం. ఒక అంచనా ప్రపంచంలో ప్రతి పది మహిళల్లో ఒకరు అత్యంత పేదరికంలో జీవిస్తున్నారు. 2030 నాటికి 3.42 కోట్ల మంది ఇంకా పేదరికంలో ఉండవచ్చు. పేదరికం, మహిళల ఆర్థిక వేరువేరు వ్యవస్థలు, లింగ వివక్షతో ముడిపడ్డాయి. మహిళలు రోజూ ఉచిత గృహపని, సంరక్షణ పనుల్లో ఎక్కువ సమయం గడుపుతున్నారు, ఇది కుటుంబాలు, సమాజం, ఆర్థిక వ్యవస్థలకు కీలకం. ఈ కృషికి గుర్తింపు, వేతనం ఇవ్వడం, మహిళల సాధికారతకు మద్దతు ఇవ్వడం అత్యవసరం. 2030 స్థిర అభివృద్ధి కార్యసూచీ ఎవరూ వెనకబడరని, ముఖ్యంగా అత్యంత వెనకబడినవారిని ముందుగా చేరుస్తామని స్పష్టంగా ప్రకటించింది. దీన్ని సాధించడానికి సుస్థిర, సమగ్ర, సమానమైన ఆర్థిక వృద్ధి, పూర్తిస్థాయి ఉపాధి, గౌరవప్రదమైన పని, సామాజిక సమగ్రత, అసమానత తగ్గింపు, అనుకూల పర్యావరణం అవసరం. ఆఫ్రికా, అత్యల్ప అభివృద్ధి చెందిన దేశాలు, చిన్న దీవి రాష్ట్రాలు, సంక్షోభభరిత ప్రాంతాల్లో పేదరికం ఇంకా పెద్ద సవాలుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు తగిన విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, గృహం, రవాణా, ఉద్యోగ అవకాశాల లేమి కారణంగా పేదరికాన్ని ఎదుర్కొంటున్నారు. గృహపరమైన ఉచిత సేవల బాధ్యతలు, పిల్లల సంరక్షణ, కుటుంబ బాధ్యతలు వారి ఆర్థిక స్వావలంబనను తగ్గిస్తున్నాయి. ఈ కృషికి సరైన గుర్తింపు లేకపోవడం సామాజిక అసమానతను పెంచుతుంది. ఆర్థిక సమగ్రత స్థితి నివేదిక 2024 ప్రకారం, ఆర్థిక సమగ్రత కేవలం ప్రభుత్వ పెట్టుబడిగా కాక, లక్షలాది జీవితాలను నిజంగా మార్చే శక్తివంతమైన మార్గం. పాలసీ రూపకర్తలు, అభివృద్ధి భాగస్వాములు ఈ కార్యక్రమాలను సాధ్యమైనంత విస్తృతంగా విస్తరించాలి. సమగ్రత, సమానత్వం,సుస్థిరత కలిగిన భవిష్యత్తును సృష్టించడం అత్యంత ప్రధానం. మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించినప్పుడు, కుటుంబాలు బలపడతాయి. పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం లభిస్తుంది, సమాజం స్థిర అభివృద్ధి వైపు ముందుకు కదులుతుంది. సమాన వేతనం, సురక్షిత వాతావరణం, విద్యా అవకాశాలు, నాయకత్వ హక్కులు ప్రతి మహిళకు అందించడం సమాజ అభివృద్ధికి కీలక మార్గం. లింగ అసమానత, భద్రతా లోపం, అవకాశాల అసమానత తదితర అంశాలే పేదరికానికి ప్రధాన కారణాలు. ఆ సమస్యల నుంచి బయటపడినప్పుడే మహిళల సాధికారత సాధ్యమవుతుంది.

## హాట్ ఫ్లాషెస్‌పై అపోహలు తొలగించుకోవాలి



మహిళల జీవితంలో మెనోపాజ్ (నెలసరి ఆగిపోవడం) అనేది సహజ దశ. అయితే ఈ సమయంలో వచ్చే హాట్ ఫ్లాషెస్ (హఠాత్తుగా వేడి పెరగడం, చెమటలు పడటం, గుండె వేగంగా కొట్టుకోవడం లాంటి లక్షణాలు) చాలా మంది మహిళలకు గందరగోళాన్ని, అసౌకర్యాన్ని కలిగిస్తాయి. ఒక ప్రముఖ మెనోపాజ్ పరిశోధకురాలి ప్రకారం, హాట్ ఫ్లాషెస్ గురించి మనం సాధారణంగా చేసే 5 పొరపాట్లు ఇవి:

1. హాట్ ఫ్లాషెస్ కొద్దిసేపు మాత్రమే ఉంటాయి అనుకోవడం
వాస్తవానికి హాట్ ఫ్లాషెస్ కొన్ని నెలలు కాదు— కొన్ని సంవత్సరాలు కూడా కొనసాగవచ్చు. కొంతమందికి ఇవి చాలా తేలికగా ఉండవచ్చు.. మరికొందరికి రోజూ, వరుసగా, జీవిత నాణ్యతను ప్రభావితం చేసేలా రావచ్చు.

2. హాట్ ఫ్లాషెస్ రాత్రివేళ మాత్రమే వస్తాయి అనుకోవడం
రాత్రివేళ వచ్చే వాటిని నైట్ స్వెట్స్ అంటారు. కాని హాట్ ఫ్లాషెస్ రోజులో ఎప్పుడైనా రావచ్చు. పని సమయంలో, ప్రయాణంలో, బయట ఉన్నప్పుడు— ఎప్పుడు వచ్చినా మహిళలు చాలా అసౌకర్యంగా ఫీలవుతారు.

3. మనశ్శాంతి కోల్పోవడం వల్ల వస్తాయి అనుకోవడం
అవును, ఒత్తిడి ఒక కారకం కావచ్చు. కానీ హాట్ ఫ్లాషెస్ యొక్క ప్రధాన కారణం హార్మోన్ మార్పులు.. ప్రత్యేకంగా ఎస్ట్రోజెన్ తగ్గడం. ఇది శరీరంలోని ఉష్ణ నియంత్రణ వ్యవస్థను అస్థిరం చేస్తుంది. కాబట్టి ఇవి కేవలం స్ట్రెస్ సమస్యలు కాదు.

4. హార్మోన్ థెరపీ మాత్రమే పరిష్కారం అనుకోవడం
హార్మోన్ థెరపీ కొందరికి మంచి ఫలితం ఇస్తుంది. కానీ అందరికీ అది సరిపోదు. కొంతమంది ఆరోగ్య పరిస్థితుల కారణంగా హార్మోన్ మందులను వాడలేరు. అందుకే హార్మోన్ కాకుండా ఇతర చికిత్సల అవసరం పెరిగింది.

5. వయస్సు ఎక్కువైనప్పుడు మాత్రమే వస్తాయి అనుకోవడం
మెనోపాజ్ లక్షణాలు 40 ఏళ్ల వయసు దాటినపుడే వస్తాయని అనుకుంటాం. కానీ వాస్తవానికి పెరిమెనోపాజ్ అనే దశ (మెనోపాజ్‌కు కొన్ని సంవత్సరాల ముందే ప్రారంభమయ్యే మార్పులు) 35–45 సంవత్సరాల మధ్యే మొదలై, హాట్ ఫ్లాషెస్ అప్పుడే కనిపించవచ్చు.

## హమాలీ కార్మికులకు లైసెన్సులు, గుర్తింపుకార్డు, ఇన్సూరెన్స్ సౌకర్యం


### సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్ డిమాండ్




**ప్రజాపక్షం/నర్సంపేట :** హమాలీ కార్మికులకు లైసెన్సులు గుర్తింపు కార్డు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వ్యవసాయ మార్కెట్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కార్యాలయం ప్రాంగణంలో వ్యవసాయ గ్రేన్ మార్కెట్ హమాలీ, దాడువాయి, స్వీపర్, చాట, ఎడ్లబండ్ల కార్మికులు మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తూ లైసెన్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ఉన్న హమాలీ కార్మికులు 300 మంది కార్మికులు మార్కెట్లో పనిచేస్తుండేవారని, కొత్తగా వచ్చిన హమాలీ కార్మికులకు లైసెన్సులు, గుర్తింపు కార్డు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ లో పనిచేసే సమయంలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, యూనిఫామ్, విశ్రాంతి గదులు,సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్లో పనిచేసేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే పది లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియూసి నర్సంపేట డివిజన్ అధ్యక్షులు ఎడ్ల నాగులు, కోశాధికారి ఓదెల కనకమల్లు, కార్యదర్శి ఎల్లబోయిన రవి, చిన్నాల సారంగం, సోమయ్య, మొగిలి, సాయిలు, అనిల్, రమేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## ఆర్‌కెపి ఓసి ఫేజ్–2 ప్రాజెక్టుతో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లక్ష్మణ్



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** ఆర్‌కెపి ఓసి ఫేజ్–2 ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో ప్రజలకు, కాలనీలకు ఇబ్బందులు కలిగితే సిపిఐ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓసి వల్ల ఆర్‌కె–4 ప్రాంత నివాసులు కాలుష్యం, బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు దెబ్బతిని అనారోగ్యంతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని, స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఎంఎఫ్‌టి, సిఎస్‌ఆర్ నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, బోర్వెల్స్ ఏర్పాటు చేసి ఏరియాను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, కాదండి సాంబయ్య, నక్క వెంకటస్వామి, ఏగుడ మొండి, నాయకులు ఈరవేణి రవీందర్, మామిడాల సత్యనారాయణ, బోయ పోతుల కొమురయ్య, తోకల రాజన్న, మురళి పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి కార్మికులకు రూ.26వేలు వేతనం

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్

### ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలు, వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సి కేంద్రాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. గడువు ముగిసిన పాత టెండర్ ఏజెన్సీలను రద్దు చేసి తక్షణమే నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, కార్మికులకు జాతీయ పండుగ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులు విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నాయకులు కార్మికులు, బి.చెన్నయ్య, జే.నరసింహ, జి.మొగులప్ప, బుచ్చన్న, రాఘవేందర్, అంజి, వీరాంజనేయులు, శ్రీను, మున్నా, మన్యం, కృష్ణ, రాఘవేందర్, యాదగిరి, రామస్వామి, వెంకటయ్య, రాకేష్, వసంతదేవి, సత్యమ్మ, మల్లమ్మ, మంగమ్మ, లక్ష్మమ్మ, శిరీష, అరుణ, అలివేల, సునీత, పద్మ, చిట్టెమ్మ, నాగలక్ష్మి, ఇందిరా, జ్యోతి, సుధా, రాధా, లక్ష్మి, అంజమ్మ, సవిత, మంజుల, మమత, దేవానంద్, శేఖర్ బాలరాజ్, శంకర్, ప్రకాష్, ఆంజనేయులు, వివేక్ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో...

### నూతన టెండర్లు వెంటనే పిలవాలి

**వరంగల్ :** ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, నూతన టెండర్లను వెంటనే పిలవాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వరంగల్ సికెఎం ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన గేట్ ఎదుట, ఎంజిఎం హాస్పిటల్ లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి దామర కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్, బొట్ల శ్రీనివాస్, సికెఎం హాస్పిటల్‌కార్యదర్శి ఎం.శంకర్, సక్కుబాయి, సంధ్య, ఎంజిఎం హాస్పిటల్ కోశాధికారి మంద సంజీవ, గడల రమేష్, శ్యామ్, కోమల, మహేష్, రాజ్వీర్, రమ, లక్ష్మణ్, రజిత, రవిందర్, లక్ష్మి, లావణ్య, స్వరూప, రాజు, కమలాకర్, అకిల్, రాము, బాబు, రాజు, రమ సిబ్బంది పాల్గొన్నారు.

### కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం

**ఘట్‌కేసర్ :** ఐహెచ్‌ఎఫ్‌ఎం ఎస్ కాంట్రాక్టు శానిటేషన్ కేర్,సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్‌కు మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ టెండర్ల కాలపరిమితి ముగిసిందని వెంటనే నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం చెల్లించాలని కోరుతూ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయూస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని జయచంద్ర తెలిపారు.

### కాంట్రాక్టు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**నిజామాబాద్ అర్బన్ :** కాంట్రాక్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పాత కాంట్రాక్టు రద్దుచేసి మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాన్ని పెంచాలని ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట గేట్ ధర్నా రాష్ట్ర మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు అనారోగ్యంతో వచ్చే పేద బలహీనవర్గాల ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కార్మికుల వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు డి. చక్రపాణి, మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, కవిత, రాధాకుమార్, వెంకటేశ్, సాయి, నరసయ్య పాల్గొన్నారు.

### పాత ఏజెన్సీల టెండర్లు రద్దుచేయాలి

**భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌లో కాలం చెల్లిన పాత ఏజెన్సీల టెండర్లను రద్దుచేసి సానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందే విధంగా నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి కార్మికుల వేతనాలు పెంచాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ పాండు నాయక్‌కి కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త టెండర్లు పిలిచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు గుండు వాణి, నీలం నరసింహ, సోమ నరసయ్య, బట్టుపల్లి లావణ్య, శారదా, లలిత, సులోచన, భారతమ్మ, హేమలత, విజయలక్ష్మి, సురేఖ, శేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లో..



ఘట్‌కేసర్‌లో..




నిజామాబాద్‌లో..




యాదాద్రి భువనగిరిలో..

## సిపిఐలో 20 కుటుంబాలు చేరిక

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/మునుగోడు :** నల్లగొండ జిల్లా మునుగోలు మండలంలోని కొరటికల్ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 20కుటుంబాలు గ్రామ సిపిఐ నాయకులు దండు వెంకటరమణ, మందుల పాండు. మునుగోటి దయాకర్ ఆధ్వర్యంలో మంగళవారం సిపిఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఎర్రకండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరటికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల వారు పార్టీపై విశ్వాసంతో సిపిఐలో చేరడం శుభ పరిణామం అన్నారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు గ్రామానికి చెందిన నీతి నిజాయితీతో గ్రామ అభివృద్ధికి పాటుపడే నాయకులను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో దండు వెంకటరమణ, స్వప్న, అనంతమ్మ, భీమనపల్లి నరసింహ, కుప్పటి భూపాల్, దండు నవీన్, దండు సైదులు, దండు శ్రీను, ఆరెకంటి యుగంధర్, భీమనపల్లి నవీన్ ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, దండు యాదయ్య. రొమ్ముల యాదయ్య, మిర్యాల యాదయ్య, అద్దంకి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.






# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఉపాధ్యాయుడు ఎస్‌కె యాకూబ్ పాషాకు అభినందనల వెల్లువ



**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన షేక్ నాసన్ తృతీయ పుత్రుడు ఎస్‌కె యాకూబ్ పాషా ప్రైవేట్ పాఠశాలల జిల్లా సంఘం నిర్వహించిన ఎంపికల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ గుర్తింపు మరొక మైలురాయిగా నిలిచింది. యాకూబ్ పాషా సుదీర్ఘకాలంగా బోధనలో నిబద్ధత, శ్రద్ధ, విద్యార్థులపై మానవీయ దృక్పథంతో సేవలందిస్తూ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా నెక్కొండ మండలంలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయనను అభినందిచారు. ప్రత్యేకంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్న కేశవులు తన శుభాకాంక్షలు తెలియజేస్తూ యాకూబ్ పాషా వంటి యువ ఉపాధ్యాయులు విద్యారంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తారని అన్నారు.

## మధ్యాహ్న భోజనం ప్రారంభం

సిబ్బంది సహకారంతో పరీక్షల వరకూ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిసెంబర్ ఒకటవ తేదీ నుండి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ప్రారంభించారు. విద్యార్థులు రోజు వివిధ ప్రాంతాల నుండి వస్తూ ఆకలితో ఉండలేక మధ్యలోనే వెళ్ళిపోతున్నారని, వారి పరిస్థితిని గమనించిన ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఆర్థిక సహాయంతో స్వచ్ఛందంగా మధ్యాహ్న భోజనం ప్రారంభించారని తెలిపారు. కళాశాలలో ప్రథమ సంవత్సరం 60 మంది, ద్వితీయ సంవత్సరం 30పైగా విద్యార్థులుండగా అందరి ఆకలి తీర్చడానికి అధ్యాపకులే ముందుకు రావడాన్ని ప్రశంసించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సాయంత్రం వరకు స్టడీ పీరియడ్‌లో పాల్గొని అధిక మార్కులు సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు సురేందర్, నాన్ టీచింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడిగా నియామక పత్రం



**ప్రజాపక్షం / భూపాలపల్లి :**హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఇటీవలే నూతన జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన బట్టు కర్ణాకర్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్, పిసిసి అధ్యక్షలు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. బట్టు కర్ణాకర్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకం ఉంచి నాకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అదిష్టానానికి పెద్దలకు కర్ణాకర్ దన్యవాదాలు తెలిపారు.

## దివ్యాంగ ఉద్యోగులకు 3న ఆన్ డ్యూటీ సౌకర్యం

దేవా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**ప్రజాపక్షం/మంగపేట:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాల్లో పాల్గొనేందుకు దివ్యాంగులైన ఉపాధ్యాయ ఉద్యోగులకు ప్రభుత్వం ఈ నెల 3న ఆదర్ డ్యూటీ ఓడీ మంజూరు చేసిందని ములుగు జిల్లా దేవ గ్రూపు జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ దేవా గ్రూపు రాష్ట్ర కమిటీ చేసిన పోరాట ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సిఎస్ రామకృష్ణారావు సోమవారం నాడు జీవోను 1683 ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకుగాను ములుగు జిల్లా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ దేవా జిల్లా శాఖ ప్రభుత్వానికి వ్యక్తం చేశారు.

## పదవీ విరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది సేవా కార్యక్రమాలకు సమయం కేటాయించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల మంగళవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సుధీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖ కు సేవాలందించిన పదవీ విరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని. పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ, సురేంద్ర, ఆర్.ఐ సతీష్, స్పర్జన్‌తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్



**ప్రజాపక్షం/ములుగు:** మేడారం మహాజాతర కోసం వచ్చే భక్తులు ముందుగా జాకారం సమీపంలోని గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించుకుంటారని, ఆ సమయంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకుగాను, ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా ఏర్పాట్లు చేయాలనిన ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపిఎస్ అన్నారు. నూతన రహదారుల ఏర్పాట్ల విషయమై, రోడ్డు విస్తరణ పనుల విషయమై అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖల అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి రవీందర్, ములుగు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శంకర్ నాయక్, ములుగు సిఐ సురేష్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా సిఎం సభాస్థలి ఏర్పాట్లు

సిఎం సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సిపి సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 5న నర్సంపేట పట్టణంలోని సుమారు వేయి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రానుండడంతో సభాస్థలి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్‌లు మంగళవారం పరిశీలించారు. స్థభ స్థలాన్ని, శంకుస్థాపన జరిగే ప్రదేశాలను, హెలిపాడ్ తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్, ఎసిపి పున్నం రవీందర్ రెడ్డి, ఎస్‌బి ఎసిపి జితేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, డాక్టర్ పులి అనిల్, నర్సంపేట పిఎసిఎస్ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి చింతల సాంబరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ ఎంపిపి కేతిడి వీరారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఓర్సు అంజలి, గంధం నరేష్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్ కుమార్, మాజీ పిఏసిఎస్ వైస్ చైర్మన్ పాలాయి రవికుమార్, కాట ప్రభాకర్, పబ్బతి సతీష్ రెడ్డి, పోతారబోయిన చంద్రమౌళి, బాణాల శ్రీనివాస్, మేరుగు కిరణ్, గద్ద అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్ట్‌ను సదర్శించిన పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/ఖానాపూర్:**గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో వరంగల్ జిల్లా సరిహద్దు ఖానాపురం మండలంలోని వేపచెట్టు తండా చెక్‌పోస్ట్‌ను వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడానికి, శాంతి భద్రతలను అదుపులో ఉంచడానికి అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్‌శాఖ అధికారులకు కీలక సూచనలు సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత పకడ్బందీగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు, ప్రజలు ఎలాంటి వక్రీ లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపి సన్ ప్రీత్ సింగ్, ఈస్ట్ జోన్ డిసిపి బి రాజేంద్ర నాయక్, నర్సంపేట ఏసిపి పి రవీందర్ రెడ్డి, దుగ్గొండి సిఐ ఎం సాయి రమణ, ఖానాపురం ఎస్ఐ సిహెచ్ రఘుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బయో మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ రాంపూర్ మున్సిపల్ డంపింగ్ యార్డు సమీపంలో నూతనంగా బయోమైనింగ్ ప్రాజెక్టును మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులతో కలిసి మంగళవారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మడికొండ డంపింగ్ యార్డు అంశంపై తాను అసెంబ్లీలో ప్రసంగించాన ని, హైదరాబాద్ నగరం నుండి ఓరుగల్లుకు వస్తుంటే ముఖద్వారం మడికొండ అని, డంపింగ్ యార్డ్‌తో చాలాసార్లు ఫాగ్ మాత్రమే కనిపించేదని, డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అనేకమార్లు ధర్నాలు చేశారని, తనకు వి నతి పత్రాలు అందజేశారని, బయో మైనింగ్ మిషన్ల ద్వారా చె త్త నియంత్రణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే మడికొండ డంపింగ్ యార్డ్ సమస్య శాశ్వతంగా పరిష్కరించ బడుతుందని, ఎంపి ఎన్నికల ప్రచారంలో భాగంగా డం పింగ్ యార్డ్ సమస్యపై సిఎం మాట్లాడారని, డంపింగ్ యార్డ్ వల్ల ఫామ్ అయ్యే ఫాగ్ తో ప్రమాదాలు జరుగుతున్నాయని, డంపింగ్ యార్డ్ సమస్య గుది బండగా మారిందని, త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.వరంగల్ నగర సమగ్ర అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన ఓరుగల్లును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతుందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, మామునూరు ఎయిర్ పోర్టు, స్పోర్ట్స్ స్కూల్, ఇతర అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఓరుగల్లులో జరుగుతున్నాయని, ఓరుగల్లు ప్రజలు ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాం గ్రె స్ అధ్యక్షుడు కెఆర్ దిలీప్ రాజ్, మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘు చందర్, మండల పార్టీ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, నాయకులు, కార్యకర్తలు మడికొండ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికి కేంద్రం కీలక చర్యలు

పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయ సంబంధిత పథకాల పురోగతి, లబ్ధిదారుల వివరాలు, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. రైతుల సమస్యలను తాను పార్లమెంట్ వేదికగా నిరంతరం ప్రస్తావిస్తానని ఎంపి కడియం కావ్య స్పష్టం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేం ద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానం ఇచ్చారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌కు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలలో సాధారణ వరి రూ. 2,369, మధ్యస్థరకం పత్తి రూ.7,710 క్వింటాల్‌కు నిర్ణయించబడినట్లు తెలిపారు. 2024–25లో వరంగల్ జిల్లాలో 2.95లక్షల బేళ్ల పత్తి, 15.56 లక్షల టన్నుల వరి సేకరణ జరగడం రైతులకు నేరుగా ఆదాయ భద్రత కల్పించిందని పేర్కొన్నారు. పిఎంకెఎస్ వై కింద నీటిపారుదల పురోగతి ద్వారా 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకంతో దేశవ్యాప్తంగా 106.75 లక్షల హెక్టార్లలో సూక్ష్మ నీటిపారుదల అమలు చేయబడిందని, చిన్న రైతుల కు 55% వరకు సబ్సిడీ అందుతోందని తెలిపారు. ఎఐబిపి కింద 2016 తర్వాత 70 ప్రాజెక్టులు పూర్తికాగా, 29.22లక్షల హెక్టార్ల సాగు సామర్థ్యం పెరిగిందని తెలిపారు. హర్ ఖేత్ కో పాని ద్వారా 22.21 లక్షల హెక్టార్లలో కమాండ్ ఏరి యా అభివృద్ధి జరిగిందన్నారు. పిఎంఎఫ్ బివై కింద భారీ బీమా క్లెయిమ్‌లు 2024–25 సంవత్సరంలో ప్ర ధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రూ. 12,256 కోట్ల పరిహారం రైతులకు అందించిన ట్లు, 622 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి బీమా కవరేజిలో ఉండగా 1,514 లక్షల మంది రైతులు లబ్ధి పొందినట్లు మంత్రి ప్రస్తావించారు. పరంపరాగత్ కృషి వికాస్ యోజన కింద ఇప్పటివరకు 16.90 లక్షల హెక్టార్లలో సేంద్రీయ సాగు ప్రోత్సహించబడిందని, 28.24 లక్షల మంది రై తులు ప్రయోజనం పొందుతున్నారని, మూడు సంవత్సరాలకు హెక్టారుకు 31,500 సహాయం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. రైతుల కోసం నా పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపి స్పష్టం చేశారు.

## నేటితో ముగియనున్న విత్‌డ్రాలు

**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్ :** గ్రామపంచాయ తీ ఎన్నికల ప్రారంభం నుంచి నేటివరకు గ్రా మాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎప్పు డు రిజర్వేషన్లు వస్తాయి.. మాకు అవకాశాలు కలుస్తాయా అంటూ ఆశావాహులు ఎంతో ఎదురుచూశారు. అయితే కొన్ని గ్రామాల్లో ఆశావాహులకు నిరుత్సాహమే మిగిలింది. నాకు కాకపోయినా నా మిత్రులకు, నా సన్నిహితులకు వస్తాయని ఆశపడ్డారు. అది కూడా నిరాశ మిగిల్చిం ది. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రె స్, బిఆర్‌ఎస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో ఉ న్నారు. అధికార పార్టీలో ఉన్నవారు తప్పకుండా గెలుస్తారని ఒక నమ్మకం. అదే రీతిలో ప్రతిపక్ష పార్టీలో ఉన్న నాయకులు సైతం ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత ఉంది తప్పకుండా మేమే గెలుస్తామనే రీతిలో ఆశ పడుతున్నారు. పార్టీలో పనిచేసి న నాయకులు మాత్రం రిజర్వేషన్ల ప్రకారం నా మినేషన్లు వేశారు. కాని కడియం శ్రీహరి మా త్రం గ్రామం నుంచి ఒక్కరికి మాత్రమే అవకా శం ఇవ్వాలని గ్రామ కమిటీ, సమన్వయ కమిటీలు మాత్రం ఒకరిని నిలబెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీనికి వ్యతిరేకంగా కొన్ని గ్రామాల్లో రెబల్ అభ్యర్థులు ఉన్నారు. ఇలా ఉంటే బిఆర్‌ఎస్ కొన్ని సీట్లు దక్కుతాయి. రేపటితో ముగియనున్న నామినేషన్ల విత్‌డ్రా కోసం గ్రామాల్లో నానా తంటాలు పడుతున్నారు. ఇదే తరహాలోనే బిఆర్‌ఎస్ నాయకులు కొన్ని గ్రామాల్లో ఉపసంహరించుకోవాలని కోరుతుంటే అభ్యర్థులు మాత్రం ససేమిరా అంటున్నారు. ఇటు కడియం శ్రీ హరి.. అటు డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక విత్‌డ్రా తరువాత గ్రా మాల్లో ప్రచారం ఎలా ఉంటుందో కాని ఇప్పుడు మాత్రం ప్రతీ గల్లీలో.. ప్రతీ గ్రామంలో వాడివేడిగా చర్చలు సాగుతున్నాయి. బిఆర్‌ఎస్‌కు ఒక సర్పంచ్ ఏకగ్రీవమైతే అధికార పార్టీకి మరో రెండు సర్పంచులు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల విత్‌డ్రా చేసుకుంటే బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు వస్తాయి. అప్పుడు ఆట మొదలవుతుందంటూ సర్పంచులు అభ్యర్థులు అంటున్నారు. ఈ ఆటలో గెలిచేది ఎవరో 11 సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే మరీ.

# గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం

ముగిసిన రెండో విడత

నేటి నుంచి మూడో విడత నామినేషన్లు



**ప్రజాపక్షం / జనగామ :**గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం చివర దశకు వచ్చింది. మొదటి విడత ముగిసి స్క్రూటిని సైతం పూర్తి కాగా రెండో విడత నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగిసింది. మూడో విడత బుధవారం ప్రా రంభం కానుంది. మూడు రోజులు నామినేషన్లు పూర్తి కాగానే ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం పోలింగ్ జరగనుంది. మొదటి విడత పోలింగ్ 11న, రెండో విడత 14న, మూడో వి డత 17న జరగనుంది. కాగా కొన్ని చోట్ల ఏకగ్రీవం కాగా మరికొన్ని చోట్ల ప్రయత్నాలు జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వేడి రోజు రోజుకు పెరుగుతుంది. జనగామ జిల్లాలో 280 పంచాయతీలు, 2వేల 534 వార్డులు ఉండగా మొదటి విడతతో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్, స్టేషన్‌ఘనపూర్, రఘునాథపల్లి, జఫర్‌గడ్, లింగాలఘనపురం మండలాల్లోని 110 పంచాయతీలు, 1024 వార్డులకు, రెండో విడత జనగామ నియోజకవర్గంలోని జనగామ, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల్లోని 79 పంచాయతీలు710 వార్డులకు, మూడో విడత దేవరుప్పు ల, పాలకుర్త, కొడకండ్ల, మండలాల్లోని 91 పంచాయతీలు 800 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

**నేటి నుండి మూడో విడత :**రెండో విడత నామినేషన్ల పర్వం ముగిసింది. మంగళవారం చివరిరోజు కావడంతో పెద్ద సం ఖ్యలో నామినేషన్లు వచ్చాయి. అర్ధరాత్రి వరకు నామినేషన్ల స్వీ కరణ జరిగింది. ఐదు గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న వారికి మాత్రమే టోకెన్స్ ఇచ్చి నామినేషన్లు స్వీకరించారు. కాగా మూడో విడత బుధవారం ప్రారంభం కానుంది. మూడో విడత నామినేషన్ల పర్వం శుక్రవారం వరకు జరగనుంది.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఎన్నికల పరిశీలకులు రవికిరణ్‌లు నత్యం పరిశీలిస్తున్నారు.

**మూడో విడత నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు : కలెక్టర్**

మూడో విడతలో 91 పంచాయతీలు, 800 వార్డులకు నామినేషన్ల స్వీకరణ జరగనుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో నామినేషన్ల స్వీకరణ జరగనుండగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నామినేషన్ల కేంద్రాల వద్ద సాయంత్రం 5 గంటలకే గేట్లు మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# టిబి నియంత్రణకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్




**ప్రజాపక్షం/హనుమకొండ :** టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పరిధిలోని బోడగుట్ట, సోమిడి వడ్డేపల్లి, లష్కర్ సింగారం, పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హసన్ పర్తి, కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారిని పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించవలసి ఉండగా1,30,049 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం, కడిపికొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఇందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దేశంలో టిబి నిర్మూలన లక్ష్యంగా ఈ కార్యక్రమం టిబి ముక్త్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో టిబి నియంత్రణ కార్యక్రమాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని దానికి అనుగుణంగా స్క్రీనింగ్, ఎక్స్ రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన మొబైల్ ఎక్స్ రే మిషన్ ను పరిశీలించి ప్రణాళిక ప్రకారం ఎక్కడైతే ఎక్స్ రే పరీక్షలు తక్కువగా నిర్వహించారో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య టిబి ముక్త్ భారత్, గర్భిణి నమోదు , ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల ఎఎన్‌ఎంలు, ఆశాలవారీగా సమీక్షించి కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మో హన్ రావు, టిబి నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, పిఒడిటి డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో వి అశోక్ రెడ్డి, ఎఎన్‌ఎంలు,ఆశాకార్యకర్తలుపాల్గొన్నారు.

## పంట పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందం



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని వివిధ గ్రామాలలో మొక్కజొన్న, కంది పంటలను మంగళవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన వరంగల్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త కోఆర్డినేటర్ డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ యాసంగి మొక్కజొన్న తొలి దశలో ఆశించే కత్తెరపురుగు నివారణకు వేపనూనె(1500పిపిఎం) 5 మిలీ. ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న విత్తే రైతులు జంట సాళ్ల పద్ధతిలో సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. కంది పంట పూత, కాయ దశలో కందిలో ఆశించే మారుక మచ్చల పురుగు నివారణకు ఆసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మిలీ, వేపనూనె 5 మిలీతో పాటు ఒక లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలిపారు. శనగపచ్చ పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మిలీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని, ఎకరానికి 4 నుండి 6 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు వరికొయ్యలను కాల్చకుండా సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను వేసుకొని కలియదున్నాలని సూచించారు. వారి నార్లు డిసెంబర్ 20వ తేదీ లోపల వేసుకోవాలని సూచించారు. ఈ బృందంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి వెంకట రాజకుమార్, బి మాధవి, మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం, వ్యవసాయ విస్తరణ అధికారి సాయి, రైతులు రెంటాల గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట మండలంలోని కట్రీయాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సుల్తాన్ దుర్గమ్మతో పాటు 10 మంది వార్డు సభ్యుల గెలుపె లక్ష్యంగా ముందుకు పోవడం జరుగుతుందని వర్ధన్నపేట మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్యఅన్నారు. మంగళవారం ఎడు, ఎనిది వార్డులో కాంగ్రెస్ పా ర్టీ గ్రామశాఖ అధ్యక్షులు బండారి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ బిఆర్ స్ పార్టీకి చెందిన ముఖ్య కార్యకర్తలు దళిత కాలనీ నుండి 10 కుంటుంబాలు, ఇరుకు శ్రీధర్, ఇరుకు యకయ్య, తుమ్మల రమేష్, ముత్యాల అశోక్, తుమ్మల నాగేంద్ర, సంతోష్, ముత్యాల సంజీవపోషెలెయ్య, 50 మంది ఓటర్లు కాంగ్రెస్‌లో చేరడం గ్రామ అభివృద్ధికి సాధ్యంగా మారుతుందని తెలిపారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల నాయకురాలు తీగల సునీత గౌడా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తాటికాయల కుమారస్వామి,కోండేటి మధుకర్ ఎండి వలి పాషా, నాంమ పెల్లి రవీందర్ రషీద్, వార్డు సభ్యులు ఇటికాల శ్రీలత కార్యకర్తలు ఎండి వలి పాషా,శ్రీనివాస్, బండారి వెంకన్న భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నామినేషన్ కేంద్రాల ఏర్పాట్లు, రికార్డులు పరిశీలించిన అబ్జర్వర్

ప్రజాపక్షం/ములకలపల్లి/అన్నపురెడ్డిపల్లి:గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు వి సర్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాలలోని పలువురు నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. సంబంధిత మండలాల్లో నామినేషన్ల స్వీకరణ పద్ధతి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వంటి అంశాలను ఖచ్చితంగా పరిశీలించిన పరిశీలకుడు, అభ్యర్థులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిష్పక్షపాత వాతావరణంలో నామినేషన్ కార్యక్రమాలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. ములకలపల్లి మండల పరిధిలోని సీతారాంపురం, ములకలపల్లి, జగన్నాథపురం గ్రామ పంచాయితీలను, మండలంలోని అన్నపురెడ్డిపల్లి, నరసాపురం, పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయితీలను సందర్శించి నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న పనితీరును సమీక్షించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## సిపిఐకి దక్కిన మరో పంచాయతీ

### ఊటుకూరు గ్రామ పంచాయతీ ఏకగ్రీవం



ప్రజాపక్షం/ ఖమ్మం : రెండవ దశ ఎన్నికల్లో సిపిఐ మరో పంచాయతీని ఏకగ్రీవంగా గెలుచుకుంది. కామేపల్లి మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీని ఇతర పార్టీల సహకారంతో సిపిఐ గెలుచుకుంది. మొత్తం 10 వార్డులు ఉండగా కాంగ్రెస్ నాలుగు, బిఆర్ఎస్ మూడు, సిపిఎం రెండు, సిపిఐ ఒక వార్డు తీసుకుని సర్పంచ్ స్థానాన్ని సిపిఐకి కేటాయించారు. సర్పంచ్ అభ్యర్థిగా ఈసం హన్మంతరావు ఒక్కరే నామినేషన్ వేయడంతో పంచాయతీ ఏకగ్రీవమైంది. 1986లో సిపిఐకి చెందిన ఈసం బుచ్చయ్య గ్రామ పంచాయతీని ఏకగ్రీవంగా గెలుచుకోగా దాదాపు 39 సంవత్సరాల తర్వాత సిపిఐ తిరిగి ఆ పంచాయతీని ఏకగ్రీవంగా దక్కించుకుంది.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి స్వగ్రామం ఊటుకూరు కావడం విశేషం.సిపిఐ అభ్యర్థిని ఏకగ్రీవంగా గెలిపించిన అన్ని రాజకీయ పార్టీలకు, ఊటుకూరు గ్రామ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని ఆమె తెలిపారు.

## ఏకగ్రీవాలపై కసరత్తు

### ఉపసంహరణలపై నాయకుల దృష్టి




ప్రజాపక్షం/ రఘునాథపాలెం : తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావడంతో వివిధ పార్టీల నాయకులు నామినేషన్ల ఉపసంహరణలపై దృష్టి సారించారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీల పరిధిలో 308 వార్డులు ఉన్నాయి. డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండడంతో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసిన వారిని ఉపసంహరించేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలను ఏకగ్రీవం చేసేందుకు పార్టీలు ఓ అవగాహనను కుదుర్చుకుంటున్నారు.మండలంలో ఐదారు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా ఎక్కువ నామినేషన్లు వేసిన గ్రామాల్లో అభ్యర్థులను ఉపసంహరించేందుకు ఆయా పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఏకగ్రీవం చేసుకుంటే ఎన్నికల ఖర్చు కూడా ఉండదంటూ నాయకులు ఆలోచిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో త్రిముఖ, ద్విముఖ పోటీలు ఉండే అవకాశం ఉంది.

## 'సర్వజ్ఞ'లో కాలుష్య నివారణ దినోత్సవం




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో జాతీయ కాలుష్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.కాలుష్యం నియంత్రణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. స్థానిక స్థాయిలోనే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు కాలుష్యం నియంత్రణ అనే అంశంపై చిన్న నాటిక ప్రదర్శించి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించారు. కాలుష్యం నియంత్రణ మార్గాలు, చెట్ల ప్రాధాన్యం, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులచే కాలుష్య నివారణకి తీసుకునే జాగ్రత్తలపై పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి నామినేషన్ స్వీకరణ



ప్రజాపక్షం/పెనుబల్లి: డిసెంబర్ 17 న జరగనున్న పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ ల పర్వం మొదలు అయింది. మంగళవారం ఉదయం పదిన్నర నుండి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. మండలంలో మొత్తం 32 పంచాయతీలకు గాను 290 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఎన్నికల అధికారులు నామినేషన్ కేంద్రాల్లో తగు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం లోపు పూర్తి చేయనున్నారు. మండలంలో మొత్తం తొమ్మిది నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో సాయంత్రం 5 గంటలకు నామినేషన్ కేంద్రం ప్రాంగణంలో ఉన్న అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అనుమతిస్తారు. అభ్యర్థులతో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉన్నట్లు అధికారులు తెలిపారు. లింగగూడెం, పెనుబల్లి, తాళ్లపెంట, లంకపల్లి, రామచంద్రరావు బంజార, తెలగవరం, చింతగూడెం, బయ్యనగూడెం, కోండ్రుపాడు పంచాయతి కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలు గుంపులు గుంపులుగా రాకుండా శాంతి పద్ధతులకు భంగం కలగకుండా ఎన్నికల అధికారులకు సహకరించాలని పోలీస్ శాఖ సూచించింది.

## ముగిసిన రెండవ విడత నామినేషన్లు

### నేడు మొదటి విడత ఉపసంహరణకు గడువు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండవ విడత నామినేషన్ల స్వీకరణ మంగళవారంతో ముగిసింది. రెండవ విడతలో కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలకు సంబంధించి 183 గ్రామ పంచాయతీల పరిధిలోని 1686 వార్డులకు రెండవ విడత ఈనెల 14న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి నవంబర్ 30 నుంచి డిసెంబర్ రెండు వరకు నామినేషన్లను స్వీకరించారు. సోమవారం వరకు 183 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 428, 1686 వార్డు స్థానాలకు 931 మంది నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. మూడవ విడత (తుది)కు సంబంధించి ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సింగరేణి మండలాల పరిధిలోని 191 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు, 1742 వార్డు స్థానాలకు బుధవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. మూడవ విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ఈనెల ఐదు వరకు గడువు ఉంది. ఈనెల 17న తుది విడతకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి.

# నిబంధనల మేరకు..
# అత్యధిక పరిహారం

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం నిర్ధారణకు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చర్చలు జరిపారు. సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది అక్కడి భూములు సారవంతమవుతాయన్నారు. ఉన్న దానిలో మంచి ధర ఇచ్చేవిధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. బాజుమల్లాయిగూడెం గ్రా మంలో ఎకరానికి రూ.2.70 లక్షలు ఉందని భూ సేకరణ చ ట్టం ప్రకారం రెండింతలు అనగా రూ. 5.40 ల క్షలు చెల్లించాల్సిం ఉండగా ప్రభుత్వం దానిపి పె ంచి రూ. 10.80 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందని, ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ. 64వేలు కలిపి మొత్తం రూ. 11.44 ల క్షలు ఒ క ఎకరానికి చెల్లించనున్నట్లు కలెక్టర్ తె లిపారు. అదేవిధంగా రేలకాయలపల్లి గ్రా మంలో ఎ కరానికి రూ. 2.92లక్షలు ఉందని భూ సేకరణ చ ట్టం ప్రకారం రెండింతలు అనగా రూ. 5.85 ల క్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పె ంచి రూ. 11.70 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందని, ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ. 70 390 కలిపి రూ.12, 40, 390 ఎకరానికి చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్లు, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సపరేటుగా పరిహారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

## సిఎం సభలో ఆకట్టుకున్న తుమ్మల తీరు



ప్రజాపక్షం/ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లోనూ ప్రస్తుత వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావుది ప్రత్యేక శైలి. మాట తీరుతోనే కాదూ తనకున్న ప్రత్యేకమైన ఎజెండాతో తన కంటూ ప్రత్యేకతను చాటుకుంటారు. మంగళవారం కొత్తగూడెంలో భారత మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ప్రారంభం సందర్భంగా సభా అధ్యక్షునిగా సభను నడిపించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకుంది. హెలీకాప్టర్ సాంకేతిక లోపం కారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు 3 గం. ఆలస్యంగా వచ్చారు. తగిన సమయం లేకున్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విశిష్టతను తెలుపుతూనే ఇక్కడి ప్రజల సామూహిక అవసరాలను, ప్రాజెక్టులు, రైల్వే లైను, విమానాశ్రయం, థర్మల్ విద్యుత్ కేంద్రం, మొదలగు వాటి ఏర్పాటు ఆవశ్యకతను సభ దృష్టికి తీసుకొచ్చారు. 40సం.లకు పైగా రాజకీయ అనుభవం ఉన్న తుమ్మల ఏ విషయంలోనైనా నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెబుతారు. అది మంత్రివర్గ సమావేశం అయినా, పార్టీసభ అయినా, బహిరంగ సభ అయినా తన అభిప్రాయాన్ని చెప్పేందుకు వెనుకాడరు. ప్రభుత్వ పథకాల్లో లోటుపాట్లను సైతం ఎత్తి చూపడంలోనూ తన దైన శైలిని తుమ్మల ప్రదర్శిస్తుంటారు. ఛలోక్తులను సైతం సానుకూలంగా విసరడంలో ఆయన దిట్టా. ఆయన తొలి ప్రాధాన్యతను వ్యవసాయ రంగానికి ఇస్తారు. గ్రామీణ నేపథ్యం గల వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన తుమ్మల ఏ ప్రభుత్వంలో అయినా, ఏ శాఖ ను నిర్వహించినా ఆయన ప్రాధాన్యత మాత్రం వ్యవసాయ పురోభివృద్ధికే అన్నది అందరికీ తెలిసిందే. అందుకే తుమ్మల అంటే తుమ్మలే అంటుంటారు. దట్ ఈజ్ తుమ్మల.

## జిల్లా అధ్యక్షుడిని చేసినందుకు కృతజ్ఞతలు

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా అవకాశం కల్పించినందుకు ఏఐసిసి బాధ్యులకు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా డిసిసి అధ్యక్షులుగా తాను పదవి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా అంటే కాంగ్రెస్ కంచుకోట అని స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి మరోమారు రుజువు చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అత్యధిక పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాను రోల్ మోడల్‌గా నిలపాలన్నారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఏలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పిసిసి సభ్యులు మహ్మద్ జావిద్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కార్పోరేషన్ ఛైర్మెన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సిలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మినారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

## కీలక ఘట్టం కానున్న నామినేషన్ల ఉపసంహరణ



ప్రజాపక్షం/అశ్వాపురం: స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో భద్రాద్రి జిల్లాలో మొదటి విడతగా జరుగుతున్న మండలాల్లో భాగంగా అశ్వాపురం మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు ముగిసిన తర్వాత నేడు జరగనున్న ఉపసంహరణ దశ ఎంతో కీలక ఘట్టంగా ఉంటుంది. ఈ దశలో రాజకీయ పార్టీలకు అతీతంగా కొన్ని శక్తులు, స్థానిక ప్రభావంతులు, గుంపులు లేదా వర్గ ప్రయోజనాలు పని చేస్తున్నాయని అనేక ప్రాంతాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి ప్రభావంతో అభ్యర్థులపై ఒత్తిడి పెరగడం, బలవంతపు ఉపసంహరణలు జరిగే అవకాశాలు కనిపించడం వంటి పరిస్థితులు ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయనడంలో సందేహం లేదు. పార్టీల స్వతంత్రతకు అతీతంగా ఆధిపత్యం, భూవివాదాలు, వ్యాపార ప్రయోజనాలు, గ్రామ రాజకీయాలు లేదా వ్యక్తిగత విరోధాలు వంటి కారణాలతో జోక్యం చేసుకుంటాయని ఈ జోక్యం వల్ల నిజాయితీగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు వెనక్కి తగ్గక తప్పని పరిస్థితి. ఇలా ఏర్పడే అస్వస్థ వాతావరణం ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీయడమే కాకుండా, గ్రామ అభివృద్ధి దశలో ప్రజలు తగిన ప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని కూడా తగ్గిస్తుంది. మండలంలో బుధవారం ఉపసంహరణ ఘట్టం కీలకం కానున్నందున అభ్యర్థులకు రక్షణ కల్పించడం, బెదిరింపులు, ఒత్తిడులపై వెంటనే చర్యలు తీసుకోవడం, గ్రామ స్థాయి ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛా, నిష్పాక్షికంగా కొనసాగించేందుకు చర్యలు సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటే మంచిదని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## సింగరేణి మండలంలో స్థానిక ఎన్నికల నామినేషన్‌కు సర్వం సిద్ధం

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలో ఉన్న 41 గ్రామ పంచాయితీకి స్థానిక ఎన్నికల నామినేషన్‌కి అధికారులు తహసీల్దార్, ఎంపిడివో, ఎంపివో ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. నామినేషన్‌కి వచ్చే అభ్యర్థులకు గానీ కార్యకర్తలకు గానీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. . 41 గ్రామ పంచాయతీలకు నామినేషన్‌కు 13 సెంటర్లను కేటాయించారు. సింగరేణి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు సింగరేణి, అప్పాగూడెం గ్రామ పంచాయతీ సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని, గేట్ కారేపల్లి గ్రామ పంచాయతీ నందు గేట్ కారేపల్లి, రేగుల గూడెం, దుబ్బతండ గ్రామ పంచాయతీ అభ్యర్థులు నామినేషన్ వేయాలని, కొత్తకమలాపురం గ్రామ పంచాయతీ నందు కొత్త కమలాపురం, నామినేషన్ వేయాలని, పేరుపల్లి గ్రామ పంచాయతీ నందు పేరుపల్లి గ్రామ పంచాయతీ నందు పేరుపల్లి సూర్యతండా రావోజీ తండా సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని, మాదారం గ్రామ పంచాయతీ నందు మాదారం కొత్త తండా, గుంపెళ్ళగూడెం, మంగళ్‌తండా సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని, భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీ నందు భాగ్యనగర్ తండా,నానునగర్ తండా అభ్యర్థులు నామినేషన్ వేయాలని, బాజుమల్లెయిగూడెం గ్రామ పంచాయతీ నందు బాజుమల్లెయిగూడెం, పాటిమీద గుంపు, ధంపు అభ్యర్థులు నామినేషన్ వేయాలని ఎంపీఓ తెలిపారు.

# జిపిఒల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### జిపిఒల సంఘం జిల్లా అధ్యక్షుడుగా నాగేంద్రబాబు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిపివోల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ ఏర్పాటు చే యడం జరిగిందని టిజిటిఏ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కోట రవికుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తూమాటి శ్రీనివాసరావు లు తెలిపారు. జిపివో (గ్రామ పాలన అధికారి) సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా చీమల నాగేంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో టిజిటిఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కోట రవికుమార్, టిజిటిఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తూమాటి శ్రీనివాసరావు, టిజిఆర్‌ఎస్ఏ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీ ఆధ్వర్యంలో జిపివోల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తెలంగాణ ఉద్యోగుల జేఏసి ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి, కో కన్వీనర్ కె. రామకృష్ణ, తెలంగాణ గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు సూచనల మే రకు జిల్లా కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ పాలన అధికారులు ప్రజా ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో కృషి చేసేందుకు ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. గ్రామ పాలన ఆఫీసర్స్ సమస్యల పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జిపివో సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా చీమల నాగేంద్ర బాబు, మహిళా విభాగం అధ్యక్షులుగా పడిగ హైమావతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ జానిమియా, జిల్లా కార్య నిర్వహక అధ్యక్షునిగా మందేరుకుల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాల మురళీకృష్ణ, కోశాధికారిగా వజ్జా రామారావు, అసోసియేట్ అధ్యక్షులుగా చల్లా శ్రీనివాసరావు, మక్కాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బానోత్ రాంచందర్‌రావు, టిఎంఎం కిషోర్, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, కోట నరేష్ లను ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా పడిగ హైమావతి, బానోత్ జమ్ము, ఉపాధ్యక్షురాలిగా అంకోలు శ్రీలక్ష్మి , తాటి ఇందిర, కుంజా రాధారుక్మిణి, శ్రీవాణి, బానోత్ స్వప్నలను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీకి సంబంధించి జిల్లా సహాయ కార్యదర్శులను, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రచార కార్యదర్శి, సంస్కృతిక కార్యదర్శి, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు రా ష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జి పివోల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాచకొండ నాగలక్ష్మి , జిపివోలు పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థి భర్తపై ఖాకీ జులుం

### అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడిని కలవాలని హుకుం




ప్రజాపక్షం/బూర్గంపాడు:బూర్గంపాడు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రగులుకుంది. సోంపల్లి గ్రామ పంచాయితీలో పుష్కలంగా ఇక్కడ ఇసుక వనరులు ఉన్నాయి. అదే స్థాయిలో ఇక్కడా రాజకీయం వేడి మొదలైంది. ఇటీవల సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నిక నియమావళి ప్రకారం పలువురు నామినేషన్లు వేశారు. అయితే ఈ క్రమంలో ఓ గిరిజన సర్పంచ్ అభ్యర్థి భర్తను రాజకీయ అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ సర్పంచ్ అభ్యర్థి భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడికి కలవాలని పోలీసులు సదరు వ్యక్తికి హుకుం జారీ చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓ ప్రభుత్వ అధికారిగా ఉండి, అధికార పార్టీ నేతలకు ఏజెంట్లుగా వ్యవహరించడంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక వనరులు ఉన్న గ్రామం కావడంతో, ఆధిపత్యం కోసం అధికార పార్టీ నేతలు పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రత్యర్థులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని విశ్లేషకులు, గిరిజన ప్రజలు తెలుపుతున్నారు. ఓ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన తీరుపై గిరిజన గ్రామంలోని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు పోలీసులు ఇలా వ్యవహరించడం ఏమిటని, ఏకపక్షంగా అధికార పార్టీకి కొమ్ముకాయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, లేని పక్షంలో బూర్గంపాడు మండలంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

## కారు ఢీ కొని యువకుడు మృతి

ప్రజాపక్షం/పాల్వంచ : ఆగి ఉన్న కారును ఢీ కొని ఓ యువకుడు మృతి చెందన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పాల్వంచ నుండి భద్రాచలం వైపుకు వెళుతున్న ఓ కారు మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామ సమీపంలో మొక్కజొన్నకంకులు తీసుకునేందుకు డ్రైవర్ కారును నిలిపి కుడి వైపు కారు డోర్‌ను అజాగ్రత్తగా తెరిచాడు. వెనుక నుండి వస్తున్న ఓ మోటర్ సైకిల్ కారును గమనించకుండా ఒక్క సారిగా బలంగా ఢీ కొట్టిది. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న సగ్గు రాఘవేంద్రరెడ్డి (24) అక్కడికక్కడే మృతి చెందగా, ఆవుల మహేష్ రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతిని బావ రోళ్ల పుల్లారెడ్డి ఫిర్యాదు మేరకు సారపాకకు చెఎందిన కారు డ్రైవర్ రఘునాధ రెడ్డిపై పాల్వంచ్ రూరల్ హెడ్ కానిస్టేబుల్ ఎన్ కృష్ణ కేసు నమోదు చేశారు.

## ఎక్స్‌రే మిషన్ కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎక్స్‌రే మిషన్ కొనుగోలుకు జిల్లా కలెక్టర్ అనుమతితో ఆఫ్‌లైన్ టెండర్లను ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ధర సూచించిన ఏజెన్సీకి ఈనెల 10న మధ్యాహ్నం రెండు గంటలకు టెండర్ ఫైనల్ చేయనున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. షార్ట్ టెండర్‌లో పాల్గొనే వారు ఈఎండి రూ. 50వేలు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఖమ్మం పేరున డిడి ద్వారా చెల్లించాలని తెలిపారు.

# డిజిటల్ అరెస్ట్‌లు నమ్మొద్దు

### అడిషనల్ డిసిపి రామానుజం




ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారని డబ్బులు ఇస్తే విడుదల చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడే సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మిమోసపోవద్దని అడిషనల్ డిసిపి అడ్మిన్ భోజా రామానుజం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన 'ఫ్రాడ్ కాఫుల్‌స్టాఫ్' పేరుతో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పర్యవేక్షణలో స్థానిక పోలీస్ శిక్షణకేంద్రంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిసిపి రామానుజం పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు, ఓటిపిలు వంటి సమాచారాన్ని ఎవరితోను పంచుకోవద్దన్నారు. అపరిచిత, ఫోన్‌ద్వారా వచ్చిన అటాచ్ లింక్‌లను క్లిక్‌చేసి ఓపెన్ చేయవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్‌లకు బయపడవద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నగదు బదిలిచేయమని మోసపూరిత మాటలతో ఫోన్ చేస్తే నమ్మి మోసపోవద్దన్నారు. మోసపోయినట్లు బావిస్తే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని రామానుజం విజ్ఞప్తి చేశారు. సైబర్‌క్రైం ఏసిపి ఫణిందర్, సిఐ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# రీల్

## ‘అఖండ–2’ అంచనాలకు మించి ఉంటుంది

నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట



బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో చిత్రం 'అఖండ–2' ఈ చిత్రం 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. లెజెండ్ సినిమా మేమే చేసాము. 2014 ఎలక్షన్స్‌కి ముందు ఆ సినిమా వచ్చి పెద్ద విజయాన్ని సాధించింది. అదే కాంబినేషన్‌లో మళ్లీ ఈ ఎలక్షన్స్‌కి ముందు ఒక సినిమా చేయాలనుకున్నాం. మేము అనుకున్న కథ సరిగ్గా ఎలక్షన్స్ ముందే రావాలి. అప్పుడే ఆ క్యారెక్టర్, కథ కనెక్ట్ అవుతుంది. సరిగ్గా ఎలక్షన్ డేట్ అనేది ఒక క్లారిటీ లేకపోవడంతో ఆ కథని పక్కనపెట్టి అఖండ2 కథని ముందుకు తీసుకెళ్లాం.చాలా హ్యాపీ గా ఉందండి. బాలయ్య బాబు, బోయపాటి గారిది బ్లాక్ బస్టర్ కాంబినేషన్. వరసగా హ్యాట్రిక్ విజయాల తర్వాత మళ్లీ వస్తున్న సినిమా ఇది. ఈ కథ చాలా బిగ్ స్పాన్ ఉన్నది. బాలయ్యలో అప్పటికి ఇప్పటికీ అదే ఎనర్జీ. ఇంకా పెరిగింది. ఆయనతో కూర్చున్నప్పుడు ఆయన ఎనర్జీ మనకి వస్తుంది. ఈ సినిమాని కుంభమేళాలో షూట్ చేసాం. అక్కడ షూట్ చేయాలంటే చాలా పర్మిషన్స్ కావాలి. మాకు అన్ని పర్మిషన్స్ దొరికాయి. డ్రోన్ పర్మిషన్ కూడా దొరికింది. ఇప్పుడు మీరు సినిమాలో చూడబోయే ప్రతి సన్నివేశం ఈ సినిమా కోసం తీసింది. స్టాక్ షాట్స్‌ని ఉపయోగించలేదు. బోయపాటి గారు అహర్నిశలు కష్టపడి కుంభమేళా సన్నివేశాలను చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ సినిమా కథ వినగానే త్రీడీలో బాగుంటుందనుకున్నాం. రేపు త్రీడీ సెన్సార్ ఉంటుంది. 2డి, 3డి రెండూ ఒకే సారి రిలీజ్ వుంటుంది.

## ఇండియన్, కొరియన్ కొలబ్రేషన్‌తో సినిమాలు



ఇండియన్ కొరియన్ కొలబ్రేషన్‌లో సినిమాలు రావాలని కొరియన్ డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ యూ ఇన్సిక్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియాకి రావడం ఇదే మొదటిసారి. హైదరాబాద్ బిర్యానీ సూపర్‌గా ఉంది. నాకు చాలా నచ్చింది. ఇక్కడ కొంత మంది ప్రేక్షకులను కలిసాను. వాళ్ళు నేను చేసిన సినిమాలు, డ్రామాలు అన్నీ చూశారు. ప్రతిదాని గురించి చాలా డీటైల్‌గా మాట్లాడుతున్నారు. ఇది నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో తప్పకుండా ఇండియన్, తెలుగు ఆడియన్స్ కోసం సినిమాలు నిర్మించాలని భావిస్తున్నాను. కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి మాట్లాడుతూ.. కల్చరల్‌గా ఇండియా కొరియా మధ్య చాలా సారూప్యత ఉంటుంది. వాళ్ళందరూ మనలాగే చాలా ఫ్యామిలీ ఓరియంటెడ్‌గా ఉంటారు. పెద్దలకి, కల్చర్‌కి, మూలాలకి గౌరవిస్తారు. అయోధ్యలో కొరియా ప్రిన్సెస్ పేరుతో మెమోరియల్ ఉంది. ప్రతి ఏడాది 50వేల మంది కొరియన్స్ అయోధ్యని సందర్శిస్తారు. వాళ్ళ పూర్వీకులు ఇక్కడ నివసించారనేది వారి నమ్మకం. ఇండికి లార్జెస్ట్ వ్యువర్స్ షిఫ్ ఉంది. కొరియన్ వెబ్ సిరీస్ సినిమాలు తెలుగు హిందీలో అనువాదం అవుతున్నాయి.

## నచ్చకపోతే ప్రెస్ మీట్ పెట్టి సారీ చెబుతా

'సైక్ సిద్ధార్థ' హీరో శ్రీనందు



శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'తో రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్‌తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా మరో కీలమైన పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. మంగళవారం ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీ నందు మాట్లాడుతూ చాలా ఎమోషనల్‌గా ఉంది. ఇదంతా ఒక టీం జర్నీ. డైరెక్టర్ వరుణ్ ఆర్కిటెక్చర్ ఆ ఫీల్‌లో గోల్ మెడల్స్ వచ్చాయి. తనకి ఫిలిం మేకింగ్ అంటే ప్యాషన్. అన్నపూర్ణ స్టూడెంట్. రామ నాయుడులో డెబ్యూ చేస్తున్నాడు. నాకు రైటింగ్, డైరెక్షన్ మీద మొదటి నుంచే ఆసక్తి ఉంది. కొన్ని మ్యూజిక్ వీడియోస్‌కి డైరెక్షన్ చేశా. బ్రోచేవారు బ్యానర్లో నాకు డైరెక్టర్‌గా ఒక సినిమా ఓకే అయింది. అప్పుడే ఒక రైటర్ కావాలంటే వరుణ్ పరిచయమయ్యాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. ఆ జర్నీలో మా ఇద్దరి మధ్య ఒక నమ్మకం వచ్చింది. నిజానికి ఈ సినిమా ఒక డెమో లాగా షూట్ చేశాడు. దాన్ని ఒక ఓటీటీ సంస్థ నుంచి ఆఫర్ కూడా వచ్చింది. అయితే ఇది మంచి స్కేల్లో ఇంకా చాలామందికి రీచ్ కావాల్సిన కథ అని చెప్పను. ఆ తర్వాత మేమే ఈ సినిమాని చేయాలనుకుని నిర్ణయించుకున్నాం. వరుణ్ నా నమ్మకాలు నిలబెట్టుకున్నాడు.

## ప్రతీ మీమ్ సేవ్ చేసుకున్నా

\- సంయుక్త మీనన్



బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘అఖండ–2’. ఈ సినిమా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సంయుక్త మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. విరూపాక్ష తర్వాత చాలా సినిమాలు వచ్చా.యి నేను మాత్రం సెలెక్టెడ్‌గా చేస్తున్నాను. బింబిసారా, విరూపాక్ష, సార్, భీమ్లా నాయక్ ఒకే సారి సైన్ చేశాను. అయితే రిలీజ్ టైమ్స్ డిఫరెంట్‌గా అయ్యాయి. తర్వాత స్వయంభు, నారీ నారీ, ఆ తర్వాత ‘అఖండ–2’ సైన్ చేశాను. ఆ తర్వాత పూరి సినిమా చేశాను. ప్రతి కథలో కంటెంట్ నచ్చి చేస్తున్నాను. ఇలాంటి కథ ప్రేక్షకులు ఇష్టపడతారు, వారికి నచ్చుతుంది అని ఉద్దేశంతోనే చేస్తాము. అది ఫైనల్‌గా ఆడియన్స్‌కి నచ్చితే వెరీ హ్యాపీ. డైరెక్టర్ ఈ కథ గురించి చెప్పారు. ముందు డేట్స్ ఉన్నాయో లేదో మా టీంని అడిగాను. లేవని చెప్పారు. ఎలాగైనా ఈ సినిమా చేయాలని చెప్పాను. అప్పుడు వాళ్ళు డేట్స్ అడ్జస్ట్ చేశారు.ఈ సినిమాలో నా క్యారెక్టర్ స్టయిలీష్‌గా వుంటుంది. సినిమాలో సాంగ్ చేయాలని చెప్పారు. నాకు నిజంగా ఆ పాట విన్న తర్వాత చాలా నెర్వస్‌గా అనిపించింది. అంత మాస్ సాంగ్ నేనెప్పుడూ చేయలేదు. తప్పకుండా సాంగ్‌ని అద్భుతంగా చేయాలని నిర్ణయించుకున్నాను. రెండు రోజులు ప్రాక్టీస్ తర్వాత నా మోకాలు సహకరించలేదు. తర్వాత ఫిజియోథెరపీ తీసుకున్నాను. బాలయ్య చాలా ఫ్రెండ్లీ పర్సన్. ఆయన్ని తొలిసారి ఒక యాడ్ షూట్‌లో కలిసాను. అప్పుడే నేను ఎంతో పరిచయం ఉన్న మనిషి లాగా మాట్లాడారు. ఆయన డైరెక్టర్ ఏది చెప్తే అది చేస్తారు. ఆయనలో ఆ క్వాలిటీ నాకు చాలా నచ్చింది. ఆయనతో పని చేయడం చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది. దానికి సంబంధించిన ప్రతి మీమ్ సేవ్ చేసుకున్నాను. ఆయనకు చూపించినప్పుడు చాలా సరదాగా నవ్వుకున్నాం. మీమ్స్ మనం క్రియేట్ చేయలేం. అవి ఆర్గానిక్‌గా క్రియేట్ అవ్వాలి. డాకు మహారాజ్ కేరళలో కూడా అద్భుతంగా ఆడింది. అలాగే అఖండ సినిమా కూడా చూశాను. తెలుగు ప్రేక్షకులు నెక్స్ట్ లెవెల్. వాళ్ళు సినిమాని సెలబ్రేట్ చేసుకునే విధానం అద్భుతం. వాళ్ళు ఫస్ట్ దేని సెలబ్రేట్ చేసుకునే విధానం చూస్తే మనం సక్సెస్‌కి ఆడిట్ అయిపోతాం. స్వయంభులో యాక్షన్ క్యారెక్టర్ చేస్తున్నాను. శర్వా నారి నారి నడుమ మురారిలో చాలా మంచి క్యారెక్టర్. అలాగే పూరితో వర్క్ చేయడం మరచి పోలేని అనుభం.

## రాజు వెడ్స్ రాంబాయి దర్శకుడికి దిల్ రాజు సన్మానం

యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన రాజు వెడ్స్ రాంబాయి సినిమా ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చిత్ర దర్శకుడు సాయిలు కంపాటి ఇండస్ట్రీ అంత ప్రశంశలతో మోచేత్తున్నారు. తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు దర్శకుడు సాయిలును అభినందించారు. దిల్ రాజు కార్యాలయంలో సాయిలును ఘనంగా సన్మానించారు. దిల్ రాజు తో పాటు ఆయన సోదరుడు శిరీష్ కూడా



## మోగ్లీ ట్రైలర్ రిలీజ్



యాంకర్ సుమ తన కొడుకు ప్రమోషన్ కోసం తనకున్న అన్ని పరిచయాలను ఉపయోగించుకుంటున్నారు. ఎలాగైనా తన నట వారసున్ని ఫిలిం ఇండస్ట్రీలో నిలబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బబ్లుగం సినిమాతో హీరోగా పరిచయం అయిన సుమ కొడుకు రోషన్ కనకాల ఇప్పుడు రెండో సినిమా మోగ్లీ 2025 అనే సినిమాతో జనం ముందుకు వస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ పెంచేశారు. పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ రష్మిక మందాన చేతుల మీదుగా ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరించారు. కలర్ ఫోటో సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 12న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు.

## ‘రాజా సాబ్’లో బొమ్మన్ ఇరానీ పోస్టర్ రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో పీపుల్ మీడియా నిర్మిస్తున్న చిత్రం ‘రాజా సాబ్’. ఈ సినిమాలో ఒక ఇంపార్టెంట్ క్యారెక్టర్‌లో వెర్సటైల్ యాక్టర్ బొమన్ ఇరానీ నటిస్తున్నారు. మంగళవారం బొమన్ ఇరానీ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మూవీ టీమ్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ‘రాజా సాబ్’ సినిమాలో సైకియాట్రిస్ట్, హిప్నాటిస్ట్, పారానార్మల్ ఇన్వెస్టిగేటర్‌గా బొమ్మన్ ఇరానీ క్యారెక్టర్ ప్రేక్షకులను థ్రిల్ చేయనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9న ‘రాజా సాబ్’ సినిమా వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా ‘రాజా సాబ్’ ను తెరకెక్కిస్తున్నారు.





# ప్రపంచపటంలో రాష్ట్రం


(మొదటి పేజీ తరువాయి)

నడిపించి అభివృద్ధిలో అగ్ర స్థానంలో నిలిపిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటి పారుదల సౌకర్యాల కల్పనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించారని, ఆయన పరిపాలనా కాలంలోనే నాగార్జున సాగర్, ఎస్‌ఆర్‌ఎస్‌పి, బాక్రానంగల్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయన్నారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం ఉన్నత లక్ష్యాలతో రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా ముందుకు తీసుకెళుతుందన్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గత 10 సంవత్సరాల పాటు తెలంగాణలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన ఆరోపించారు. త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, రాష్ట్రంలోనే కృష్ణ, గోదావరి నదులతో సాగు, తాగు నీరు అందించే అవకాశం ఉమ్మడి ఖమ్మం జిల్లాకే దక్కిందని ఆయన తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ చీరలు, మహిళకు ఉచిత బస్ ప్రాయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి తదితర సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు వస్తున్నామని, 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈనెల 8, 9 తేదీల్లో ఆవిష్కరించనున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాప్రభుత్వానికి ఖమ్మం జిల్లా ఆయువు పట్టుగా ఉందని, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావులు ఈ ప్రభత్వానికి ఆయుపు పట్టుగా ఉన్నారని, ఏ కార్యక్రమాన్నైనా చేయగలిగే అవకాశం వారి చేతుల్లోనే ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని, ఇక్కడి ప్రజలు ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వాన్ని నడిపించే అవకాశం కాంగ్రెస్‌కు ఇచ్చారని చెప్పారు. ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకునేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రానున పంచాయితీ ఎన్నికల్లో అభివృద్ధి చేసేవారినే ఎన్నుకోవాలని, అభివృద్ధి నిరోధకులకు, మందుకు, డబ్బులకు లొంగకుండా అభివృద్ధి కాముకులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ఈ సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావులు ప్రసంగించగా ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్ఏలు కోరం కనకయ్య, డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణతో పాటు వివిధ కార్పోరేషన్ల చైర్మన్‌లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పొదెం వీరయ్య, మువ్వా విజయ్‌బాబు, పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో వర్సిటీ ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగుతోందని, రాబోయో రోజుల్లో మరిన్ని నిధులను తీసుకొచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాశన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. బుధవారం డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం (ఎర్త్ యూనివర్సిటీ)ని ఏర్పాటు చేయడం, దానికి భారత మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం అభినందనీమని చెప్పారు. దీంతో భద్రాద్రి జిల్లా ఖ్యాతి దేశ విదేశాలకు చేరుకుందని, ప్రపంచ దేశాల నుండి చదువుకునేందుకు ఇక్కడికి తరలివస్తారని చెప్పారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇది చక్కటి ప్రాంతమని, ఈ ప్రాంత భూముల్లో విలువైన ఖనిజ సంపద నిక్షిప్తమై ఉండటంతో భూ విజ్ఞాన పరిశోధనలు చేసేందుకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం విద్యా పరంగా ప్రపంచ పటంలో నిలవబోతోందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ యూనివర్సిటీని విద్యార్థులు ఉపయోగించుకుని దేశానికి సేవ చేయాలన్నారు. అదే విధంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని పాల్వంచలో నెలకొల్పేందుకు ప్రభుత్వం సుముకంగా ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులు త్వరిత గతిన పూర్తి చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాని, విమానాశ్రయం ఏర్పాటుకు మరింత చొరవతీసుకుని ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలోన మరికొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు సహకరించాలని, ప్రతీ సమస్యపై సమగ్ర సమాచారంతో నివేదికలు తయారు చేసి త్వరలో ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

## కాంగ్రెస్‌లో పెరిగిన హిందూ వ్యతిరేక ధోరణి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఐఎం సహవాసంతో కాంగ్రెస్‌లో యాంటీ హిందూ ధోరణి పెరిగిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బిఆర్ఎస్ గతంలో చూపిన ధోరణినే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మంజుల, బండారు రవీందర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నగేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బిజెపిలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి రాంచందర్ రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సుపరిపాలన, అభివృద్ధి పట్ల ఆకర్షితులై పెద్ద ఎత్తున చేరికలు జరిగాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై అవహేళన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు హిందూ మనోభావాలను దెబ్బతీస్తాయన్నారు. హిందూ దేవతలను అవమానించే వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ వైఖరికి కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిజెపి శ్రేణులకు రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లారని పవన్‌ను ఉద్దేశించి ఆయన విమర్శించారు. హైదరాబాద్ కి వచ్చిన పైసలతో విజయవాడ, వైజాగ్ మిగితా ప్రాంతాలను డెవలప్ చేసుకున్నారన్నారు. పవన్ కళ్యాణ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారని, మంచి చేయాలని ఉదేశం తో వచ్చి ఉంటారు.. కానీ ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. పవన్ సోదరుడు చిరంజీవి మంచి వ్యక్తి...ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు ఎప్పుడు చేయలేదని గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్తే నైజాంలో రెండు రోజులైనా సినిమాలు ఆడుతాయని లేనిపక్షంలో సినిమాలు మూసుకోవాల్సిదేనన్నారు. ఇప్పటికి 13ఏళ్లు అయింది తెలంగాణ వచ్చి ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు అవసరమా అని ప్రశ్నించారు. పవన్ వ్యాఖ్యలపై మా తెలంగాణ బిడ్డలు బాధపడుతున్నారు. గత సిఎం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్ళిపోయారు. ఆ అప్పులు కడుతూ ఇప్పుడు ఇప్పుడే రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాము. ఇలాంటి సమయంలో తెలంగాణ సమాజాన్ని తక్కువ చేసి మాట్లాడడం కరెక్ట్ దని హితవు పలికారు.

## రెండు దశల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో జరుగుతుంది. అయితే లద్దాఖ్, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పబడే నాన్ సింక్రోనస్ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది' అని నిత్యానంద్‌రాయ్ లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్‌రాయ్ చెప్పారు. మన దేశంలో జన గణనకు 150ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాలను తదుపరి జన గణన కోసం పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా, కులగణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్‌రాయ్ లోక్‌సభకు తెలిపారు.

### డిజిటల్ విధానంలో జనగణన

మరో ప్రశ్నకు జవాబిస్తూ, 2027 జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. ఇంతకు మునుపే రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్‌పిజి/సిఎన్‌జి కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరీయల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

## యాప్‌పై తీవ్ర దుమారం

(మొదటి పేజీ తరువాయి)

అని, డివైస్‌లో యాప్ ఉంచుకోవాలా వద్దా అనేది వినియోగదారుని ఇష్టమని తెలిపారు. దేశంలో ఇక నుంచి విక్రయించే ప్రతి సెల్‌ఫోన్‌లో తప్పనిసరిగా ‘సంచార్ సాథీ’ యాప్ ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలని ఫోన్ దిగుమతిదార్లు, తయారీదార్లను టెలికాం శాఖ ఆదేశించింది. 90 రోజుల్లోపు ఈ నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే విక్రయించిన ఫోన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని పేర్కొంది. ఈ దిశగా తీసుకున్న చర్యలకు సంబంధించిన కంప్లయెన్స్ నివేదికను 120 రోజుల్లోగా సమర్పించాలని తెలిపింది. ఈ యాప్ ఫోన్ యూజర్లకు స్పష్టంగా కనిపించేలా ఇన్‌స్టాల్ చేయాలని, మొదటిసారి డివైజ్ సెటప్ సమయంలోనే ఇది యూజర్లకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం యాపిల్, సామ్‌సంగ్, గూగుల్, వివో, ఒప్పో, షియోమీ వంటి ప్రధాన కంపెనీలు ఇండియాలో హ్యాండ్‌సెట్లు తయారు చేస్తున్నారు. వీటికి తా జా ఆదేశాలు వర్తిస్తాయి. ‘సంచార్ సాథీ’ అంశంపై పార్లమెంటులో మంగళవారం తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఈ చర్య ప్రజల ప్రైవసీ ఉల్లంఘనేనంటూ కాంగ్రెస్, శివసేన, యుటిబి, టిఎంసి తప్పుపట్టాయి. విస్తృత చర్చ జరగాలని పార్టీలు డిమాండ్ చేశాయి. కాగా, దీనిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికామ్ (డిఓటి) స్పందించింది. ఈ యాప్ కేవలం సైబర్ సెక్యూరిటీకి ఉద్దేశించినది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదని, యూజర్ డాటాను రక్షిస్తుందని తెలిపింది.

## మరోవైపు యుద్ధం (మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిపారు. తర్వాత ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, యుద్ధాన్ని ఎలా ముగించాలనే విషయంపై మేక్రాన్‌తో చర్చించామన్నారు. యుద్ధం వీలైనంత త్వరగా ముగిసిపోవాలన్నారు. సెక్యూరిటీ గ్యారంటీలు సాధించడంపైనే తాము ప్రధానంగా దృష్టి సారించామని చెప్పారు. ఒకవైపు మాస్కోలో చర్చలు, మరోవైపు యుద్ధం జరగుతున్న సమయంలో జెలెన్‌స్కీ మంగళవారం ఐర్లాండ్‌లో పర్యటించారు. ఐర్లాండ్ ప్రధానమంత్రి మైఖేల్ మార్టిన్ ఆయనకు స్వాగతం చెబుతూ, అత్యంత సంక్లిష్టమైన సమయంలో ఈ పర్యటన జరుగుతోందన్నారు. ఉక్రేన్‌కు 100 మిలియన్ డాలర్లు ఆర్థిక సహాయం అందజేసేందుకు ఐర్లాండ్ మంత్రివర్గం మరోవైపు సమావేశం నిర్వహించింది. చర్చలు జరుగుతున్న సమయంలో ఉక్రేన్‌ను బలహీన పరచేందుకు పుతిన్ దుష్ప్రచారానికి తెరతీశారని జెలెన్‌స్కీ డబ్లిన్‌లో విమర్శించారు. విట్‌కాఫ్ మాస్కో ప్రయాణానికి ముందుగా ఆదివారం ఆయన ఫ్లోరిడాలో ఉక్రేన్ అధికార ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రష్యాకు ఉక్రేన్ భూభాగాలను వదిలేసుకోవడం, ఉక్రేన్‌కు భద్రతా హామీలు వంటి అనేక అంశాలపై వారితో విట్‌కాఫ్ చర్చించారు. ట్రంప్ అల్లుడు కుష్నెర్, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కూడా పాల్గొన్నారు. ఉక్రేన్ తరపున ఆ దేశ జాతీయ భద్రతా కార్యదర్శి రస్టెమ్ ఉమెరోవ్, విదేశాంగశాఖ మొదటి ఉపమంత్రి సెర్గీ కిస్లిస్టా పాల్గొన్నారు.

### యుద్ధ పరిష్కారానికి ట్రంప్ ప్రతిపాదన మూలాధారం

ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి ట్రంప్ ప్రతిపాదించిన 28 సూత్రాల ప్రణాళిక (తర్వాత 19కి కుదించారు) ఒక మంచి మూలాధారంగా ఉంటుందని రష్యా కేంద్రకార్యాలయం అధికార ప్రతినిధి పెస్కోవ్ చెప్పారు. భారత్‌లో పుతిన్ పర్యటనకు ముందుగా ఆయన న్యూఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీలో పెస్కోవ్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, యూరోపియన్లు విదేశాలలో ఉన్న రష్యా ధనాన్ని ఆస్తులను దొంగిలించి తిరిగి దానినే ఉక్రేన్‌లో యుద్ధ యంత్రాంగానికి పెట్టుబడిగా సమకూరుస్తున్నారని విమర్శించారు. భారత్–రష్యా సంబంధాల గురించి మాట్లాడుతూ, భారత్ ఆందోళన తమకు తెలుసునని, అందుకే వాణిజ్యలోటు భర్తీ చేసేందుకు దిగుమతులను గణనీయంగా పెంచుకుంటామన్నారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com